www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 68 | సోమవారం | 28 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



బిగ్‌ఫైటర్ మేవెదర్

12

ప్రపంచ క్రీడా చరిత్రలో అత్యంత ఖరీదైన పోటీగా పేరొందిన బిలియన్ బిగ్ ఫైట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లోఅమెరికా దిగ్గజ బాక్సర్ ఫ్లాయిడ్ మేవెదర్ విజేతగా నిలిచాడు. రికార్డు స్థాయిలో రూ.1700 కోట్ల ప్రైజ్‌మనీ గల ఈ పోటీలో మేవెదర్ ఐర్లాండ్ దిగ్గజం కానర్ మెక్‌గ్రెగర్‌ను ఓడించాడు. ఈ గెలుపుతో మేవెదర్‌కు రూ.1280 కోట్లు, ఓటమి పాలైన మెక్‌గ్రెగర్‌కు రూ.400 కోట్లు లభించాయి.



వెండి కొండ మన సింధు

12

భారత స్టార్, తెలుగుతేజం పి.వి.సింధు ప్రపంచ బ్యాడ్మింటన్‌షిప్‌లో రజతం సాధించింది. ఆదివారం హోరాహోరీగా సాగిన మహిళల ఫైనల్లో సింధు జపాన్ క్రీడాకారిణి నొజోమ్ ఒకుహర చేతిలో ఓటమి పాలైంది. ఈ పోటీల్లో భారత్‌కు ఇది రెండో పతకం. ఇంతకు ముందు సైనా నెహ్వాల్ కాంస్య పతకం సాధించింది. కాగా, గతంలో కూడా సైనా రజత పతకం సాధించగా, సింధు రెండు సార్లు కాంస్య పతకాలు గెలుచుకుంది. ఈ సారి కూడా భారత్‌కు వీరు పతకాలు అందించారు.



సిరీస్ భారత్‌దే

12

శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. జస్‌ప్రీత్ బుమ్రా 27 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి లంకను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 45.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రోహిత్ శర్మ 124(నాటౌట్) అజేత శతకంతో ముఖ్య పాత్ర పోషించాడు.

డేరా బాబాకు నేడు శిక్ష ఖరారు

రోహ్‌తక్ జైలు వద్ద భారీ భద్రత 10

నేడు రేపు భారీ వర్షాలు

2

9లోగా రైతు సమితులు

ఏర్పాటుకు జిల్లాల వారీ ఇంఛార్జ్‌లుగా మంత్రుల నియామకం

గ్రామ రైతు సమన్వయ సమితిలో 15, మండల, జిల్లా స్థాయిల్లో 24, రాష్ట్ర కమిటీలో 42 మంది సభ్యుల నియామకానికి ఆదేశిస్తూ జివో జారీ

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితుల సభ్యులను, కో ఆర్డినేటర్‌లను నియామక పద్ధతిలో ఎంపిక చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నాడు జివో జారీ చేసింది. ఇందు కోసం జిల్లాలకు ఇంఛార్జ్ మంత్రులను నియమించింది. వ్యవసాయ పెట్టుబడి పథకం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, పంట కాలనీల ఏర్పాటులో రైతు సమితులే కీలక పాత్ర పోషిస్తాయని సిఎం కె. చంద్రశేఖర్ రావు పలుసార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 26వ తేదీ శనివారం నాడు తరువాయి 6లో

ఇంఛార్జ్ మంత్రులు

పోచారం శ్రీనివాస్ రెడ్డి: నిజామాబాద్, కామారెడ్డి, **కడియం శ్రీహరి:** జనగాం, వరంగల్ అర్బన్, రూరల్, **ఈటెల రాజేందర్:** కరీంనగర్, పెద్దపల్లి, **కె. తారకరామారావు:** రాజన్న సిరిసిల్ల, జగిత్యాల్, **టి.హరీశ్‌రావు:** సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, **జోగు రామన్న:** ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, **ఎ. ఇంద్రకరణ్ రెడ్డి:** నిర్మల్, మంచిర్యాల్, **పి. మహేందర్‌రెడ్డి:** రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, **జి. జగదీష్ రెడ్డి:** నల్లగొండ, సూర్యా పేట, యాదాద్రి భువనగిరి, **తుమ్మల నాగేశ్వర్‌రావు:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, **సి.లక్ష్మారెడ్డి:** మహబూబ్‌నగర్, **జూపల్లి కృష్ణారావు:** నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, **అజ్మీరా చందులాల్:** జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్.



గ్రామ రెవెన్యూ రికార్డులు నాలుగే

సెప్టెంబర్ 15 నుంచి ప్రక్షాళన

మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమానికి రెవెన్యూ శాఖ విధి విధానాలు ఖరారు చేసింది. ఏ ప్రాతిపదికన ప్రక్షాళన నిర్వహించాలనేది అధికార యంత్రాంగానికి స్పష్టం చేసినట్లు సమాచారం. రెవెన్యూ గ్రామం యూనిట్‌గా డిసెంబర్ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కొనసాగనున్నది. ప్రస్తుతం విలేజి అకౌంట్స్‌లో 9 రకాల అకౌంట్లు (రికార్డులను) నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రికార్డుల తరువాయి 6లో

విశ్వాసం పేరిట హింస తగదు

10

దోషులను కఠినంగా శిక్షిస్తాం
ప్రధాని మోడీ మన్ కీ బాత్



బిజెపి ముక్త్ భారత్ కోసం

జాతీయ కూటమి

లాలూ ర్యాలీలో ప్రతిపక్ష నేతల నిర్ణయం

పాట్నా: బిజెపి పతనానికి కౌంట్ డౌన్ మొదలయిందని, జాతీయ స్థాయిలో ప్రతిపక్ష ఐక్యతతో ఎన్‌డిఎ ఓటమి ఖాయం అని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీమైదాన్‌లో ఆదివారం జరిగిన బిజెపి బగావో, దేశ్ బచావో సభలో నేతలు ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బిజెపి పతనం ఖాయం అని లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు. భారీ సంఖ్యలో హాజరు అయిన జనాన్ని ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం మోడీపైనా, నితీశ్‌పైనా ఘాటైన విమర్శలతో సాగింది. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశానికి చెడ్డరోజులు దాపురించాయని , ఆయన హయాంలో దేశ సంవిధానాన్ని మార్చే యత్నాలు జరుగుతున్నాయని,ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి అని హెచ్చరించారు. బిజెపిని ఓడించేందుకు ప్రజలంతా సంఘటితంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. నితీశ్‌ను ఉద్దేశించి లాలూ ఘాటైన వ్యాఖ్యలకు దిగారు. మొదట తనకు ఇష్టం లేకపోయినా తరువాయి 6లో

2024 నుంచి రెండు దశల్లో

జమిలి ఎన్నికలు

నీతి ఆయోగ్ సూచన



న్యూఢిల్లీ: జాతీయ ప్రయోజనాల కోణంలో లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలు నిర్వహించడం మంచిదని నీతి అయోగ్ సూచించింది. దాదాపుగా ఒకే సమయంలో లోక్‌సభ, అసెంబ్లీలకు రెండు దశలుగా ఎన్నికలు నిర్వహించడం మంచిదని పేర్కొంది. ఇప్పటికిప్పుడు కాకపోయినా 2024 నుంచి అయినా ఏకకాల ఎన్నికలు నిర్వహిస్తే క్షేమకరంగా ఉంటుందని నీతి అయోగ్ తమ నివేదికలో తరువాయి 6లో

టిఆర్ఎస్, బిజెపిల మధ్య

రహస్య ఒప్పందం

జైపాల్‌రెడ్డి ఆరోపణ



మన తెలంగాణ/వికారాబాద్/ కొడంగల్: నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి అన్నారు. టిఆర్ఎస్, బిజెపిల మధ్య లోపాయికారి ఒప్పందం కొనసాగు తుందని మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఆరోపించారు. బిజెపికి అనుకూలంగా టిఆర్ఎస్ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడంతో ఇరు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పం దం కుదిరినట్లు స్పష్టమవుతుందని ఆయన విమర్శించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ నా యకులు మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరువాయి 6లో

నాలుగేళ్ల కూతురితో నదిలో దూకి తల్లి ఆత్మహత్య



మన తెలంగాణ/ ఆదిలాబాద్: పెన్‌గంగా నదిలో కూతురిని తోసేసి తానూ దూకి ఓతల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. మావల గ్రామ పంచాయతీ పరిధి లోని ధోబికాలనీలో తరువాయి 6లో

గోగూండాయిజానికి ఇద్దరు ముస్లింలు బలి

పశ్చిమ బెంగాల్‌లో దారుణ ఘటన 3

డిఎస్‌సి ప్రకటన జాప్యంతో నిరుద్యోగి ఆత్మహత్య

మన తెలంగాణ/ నారాయ ణ్‌ఖేడ్ : డిఎస్‌సి ఉద్యోగ ప్రకటన 2014 నుండి విడుదల కావడంలేదని మనస్థాపంతో ఓ నిరుద్యోగి నెలరోజులుగా ఆహారం మానేసి అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో జరిగింది. నారాయణ్‌ఖేడ్‌కు చెందిన రామకృష్ణ(30) బిఎస్‌సి, బిఇడి పూర్తి చేశాడు. 2014 నుండి డిఎస్‌సి నోటిఫికేషన్ రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. నెలరోజులుగా ఆహారం తీసుకోవడంలేదు, దీంతో ఆరోగ్యం క్షీణించిన రామకృష్ణ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కుంచెపోటు



ఇది ఎవరి బతుకమ్మ?



సిరిసిల్లలో పెట్టుబడి సొమ్ము లేక చీరల ఆర్డర్లు మాస్టర్ వీవర్లకు బదలాయిస్తున్న మ్యాక్స్ సొసైటీలు


మన తెలంగాణ/ సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం మ్యాక్స్ సొసైటీలకు ఇచ్చిన బతుకమ్మ చీరల అరర్లను వారు ముడి సరుకు కొనలేని స్థితిలో మాస్టర్ వీవర్లకు బదలాయిస్తున్నారు. సొసైటీల మనుగడ కోసమే ఆర్డర్లు ఇస్తున్నామని చెబుతున్నా ప్రభుత్వం తమకు ముడి సరుకు కొనుక్కునేందుకు నిధులు మంజూరు చేయకపోవడం మూలంగానే ఈ దుస్థితి దాపురించిందని మ్యా క్స్ సొసైటీలు అరణ్యరోదన చేస్తున్నాయి. బతుకమ్మ చీరలు నేస్తున్నందువల్ల తమకు రూ. 500 గిట్టుబాటు అవుతుందన్నదని ఇంతకు ముందు వచ్చిన దానికి ఇది రెట్టింపు అని కార్మికులు చెప్పారు. సిరిసిల్లలో దాదాపుగా 34,000 పవర్‌లూంలు ఉన్నట్లు అంచనా. పూర్తి స్థాయిలో స్వంత పవర్ లూంలు కలిగిఉండి, ముడి సరుకులు సమకూర్చుకుని కార్మికులతో నే యించి, మార్కెట్‌లో విక్రయించుకునే వారిని యజమానులుగా పరిగణిస్తారు. సిరిసిల్లలో వీరు దాదాపు 200 మంది ఉంటారు. రెండోరకం తరువాయి 6లో

హామీకి భిన్నంగా ఓపెన్ కాస్ట్ విధానం : రమణ



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ విమర్శించారు. ఎన్నికల హామీలలో చెప్పిన దానికి భిన్నంగా ఇప్పటికీ ఓపెన్ కాస్ట్ విధానం కొనసాగిస్తున్నారన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో జరగనున్న ఎన్నికల కార్యాచరణ రూపకల్పనపై టిఎన్‌టియూసి అధ్యక్షులు బి.ఎన్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు మాయ మాటలు చెప్పి ఆ ప్రాంతంలోని 12 నియోజకవర్గాలలో పాగా వేసిందన్నారు. ఇప్పటికే అనేక సమస్యలపై టిడిపి పోరాటం చేస్తుందని, కార్మికుల సమస్యలపై కూడా కార్మిక పోరు బాటను నిర్వహించనున్నట్లు చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల కార్మికుల సమస్యలను చూపించి బలోపేతం అయిన టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత వారిని మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు ఉన్నాయంటే దానికి కారణం సింగరేణి బొగ్గగనుల కార్మికుల శ్రమే కారణమన్నారు. వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను తీసుకుంటామని, ఓపెన్ కాస్ట్‌ను మూయించి గని కార్మికుల ఉద్యోగాలను పెంచుతామని చెప్పి మోసం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఎపికి సిఎంగా ఉన్న సమయంతో సింగరేణి లాభాలలో 10 శాతాన్ని కార్మికులకు ఇవ్వడం జరిగిందన్నారు.

విమోచన దినం కోసం యాత్ర



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్‌తో సెప్టెంబర్ 1 నుంచి 7 వ తేదీ వరకు తెలంగాణలో యాత్ర నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ నిర్ణయించారు. ఆరు రాత్రులు, ఏడు రోజుల పాటు జరిగే యాత్ర మొత్తం నిజాం నిరంకుశత్వంపై తిరుగుబాటు చేసిన చారిత్రాత్మాక ప్రదేశాలు, ప్రాంతాలను సందర్శించడంతో పాటు రజాకార్ల దాష్టికానికి బలైన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. ఈ ఆరు రాత్రులు ఆయా ప్రదేశాలలోనే రాత్రి పూట లక్ష్మ ణ్ బస చేయనున్నారు. సెప్టెంబర్ 1 న హైదరాబాద్‌లోని అమరుల స్థూపం నుంచి యాత్రను ప్రారంభించనున్న లక్ష్మ ణ్ మొదటి రోజు భువనగిరిలో బస చేస్తారు. తర్వాత ఖమ్మం, జనగాం, సిరిసిల్లా, మేడ్చల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలలో రాత్రి బస చేసి గ్రామస్థులతో గడప నున్నారు. ఈ యాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాలలో నైజాం పాలనలో జరిగిన దాష్టికాలను స్థానికులకు తెలియజేయడంతో పాటు నాటి పోరాటాల ఫలితంగా సెప్టెంబర్ 17 న తెలంగాణకు విముక్తి లభించడం, అందుకోసం సర్ధార్ వల్లభభాయ్ పటేల్ చూపిన తెగువను కళాకారుల ద్వారా తెలియజేయనున్నారు. ఏడు రోజుల పాటు జరుగనున్న యాత్రలో 60 నియోజకవర్గాలలో యాత్రను నిర్వహించి 10 ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. బిజెపి తెలంగాణ ఉద్యమ కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో సాగనున్న ఈ యాత్రలో ఆయా ప్రాంతాలలోని నేతలు, కార్యకర్తలతో పాటు భారీ ఎత్తున జన సమీకరణకు శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి.

పోలీసుల నిర్బంధంలో ప్రజాభిప్రాయ సేకరణ గర్హనీయం : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : పోలీసుల నిర్బంధంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం గర్హనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పథకం ప్రకారమే టిఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి నిర్వాసితుల, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం, ప్రజాభిప్రాయ సేకరణ అధికారులు ప్రేక్షకప్రాత వహించడం పోలీసులు ప్రతిపక్షపార్టీల నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వెల్లడించకుండా ప్రభుత్వం అణచివేతకు పాల్పడటం అప్రజాస్వామికమని, ప్రాజెక్టు పనులు చేపట్టిన చాలా రోజులు తరువాత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం అర్థరహితమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణాల నుండి నిర్వాసితులను ఈడ్చికెళ్ళి బయటకి గెంటి వేయడం, అసాంఘిక శక్తులపై వినియోగించే డ్రోన్‌లతో పహారా కాయడం ప్రభుత్వ దాష్టికానికి అద్దం పడుతున్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాల్సిందేనని ముక్తకంఠంతో అన్ని పార్టీలు కోరుతున్నాయని, అయితే, రైతులు కోల్పోతున్న భూములకు 2013 కేంద్ర భూసేకరణ ప్రకారం నష్టపరిహారం, పునరావాస ప్యాకేజిని కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా టిఎస్‌పిఎస్‌సి పరీక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్ : వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు నిర్వహించిన పరీక్షలకు 64.29 శాతం హాజరు నమోదు కాగా, పిజిటి(హిందీ, తెలుగు, ఉర్దూ) భాషా పోస్టులకు నిర్వహించిన సిబిఆర్‌టి ఆన్‌లైన్ పరీక్షలకు 87.51 శాతం హాజరు నమోదైనట్లు పేర్కొన్నారు.

తెలుగు భాష, సాహిత్య వికాసంలో ఆకాశవాణి పాత్రపై సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగు భాష, సాహిత్య వికాసంలో ఆకాశవాణి పాత్రపై సాహిత్య అకాడమీ రవీంద్రభారతిలో ఆగస్టు 28, 29వ తేదీల్లో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సుకు ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం, రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సహకారం అందిస్తున్నాయి. సోమవారం ఉదయం సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ఎన్.గోపి అధ్యక్షతన జరిగే ప్రారంభోత్సవానికి ఆల్ ఇండియా రేడియో మాజి డిజి, సలహాదారు ఆర్.వేంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, సాంస్కృతిక సంచాలకులు గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. సదస్సులో రేడియో నాడు, నేడు, రేడియో ప్రొడక్షన్‌లో ఉపయోగించే మాట్లాడే పదాలు, రేడియో నాటకం, రేడియో పద్యం, రేడియో షార్ట్ స్టోరీలపై పేపర్లను సమర్పించనున్నారు. రెండవ రోజు రేడియోలో మహిళల కార్యక్రమాలు, హాస్యం, ఆధ్యాత్మిక సాహిత్యం హరికథ, యక్షగానాలు, జానపద సాహిత్యం, వ్యవసాయ ప్రసారాలు, లైట్ మ్యూజిక్, శాస్త్రీయ కార్యక్రమాలు, బాల సాహిత్యం, రేడియో కోసం వార్తలు రాయడం తదితర అంశాలుంటాయి.

ఉదయ్ నిబంధనల అమలెట్లా?

త్రైమాసిక నివేదికలు ఇవ్వాలని ఇఆర్‌సి ఆదేశం • రైల్వేలు, మెట్రో రైలు కరెంటు చార్జీలు తగ్గించిన కమిషన్



మన తెలంగాణ/హైదరాబాద్: ఉదయ్ నిబంధనలు పాటించాలని తెలంగాణ డిస్కంలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆదేశించింది. విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చునంతా మూడేళ్లలోనే వినియోగదారుల నుంచి వసూలు చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వానికి డిస్కంలు హామీనిచ్చాయి. ఈ మేరకు ఒప్పందం పత్రంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంతకం చేశాయి. డిస్కంలను అప్పుల నుంచి విముక్తి చేయడానికి ఉదయ్‌లో చేరారు. నవంబరు 30 లోపు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు కమిషన్ చేరాల్సివుంది. వచ్చే ఆర్థిక సంవత్సరమైనా గడువులోపు ప్రతిపాదనలు పంపించాలని కమిషన్ డిస్కంలకు సూచించింది. ఇదేవిధంగా విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించుకోవడం, వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లను దశల వారీగా మార్చి, విద్యుత్ పొదుపు చేసేవాటిని అమర్చాలన్న ఉదయ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని కమిషన్ ఆదేశించింది. విద్యుత్ చార్జీలను ఖరారు చేస్తూ కమిషన్ శనివారం అర్థరాత్రి ఆదేశాలు జారీచేసింది. రైల్వే ట్రాక్షన్, హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన చార్జీలు మినహా, మిగతా కేటగిరీలన్నీ ప్రస్తుత చార్జీలు వసూలు చేయాలని కమిషన్ ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిస్కంలు చార్జీలను పెంచకుండా యధాతథంగా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. రైల్వేలకు, హైదరాబాద్ మెట్రో రైల్‌కు మాత్రం తగ్గించారు. రైల్వేల టారిఫ్ ప్రస్తుతం యూనిట్‌కు రూ.7.10 వసూలు చేస్తుండగా, దాన్ని రూ.4.70కు తగ్గించారు. ప్రజా రవాణాలో అతి పెద్ద పాత్ర నిర్వహిస్తున్న రైల్వేలకు చార్జీల్లో వాణిజ్యకోణం ఉండవద్దని కమిషన్ భావించింది. ఉదయ్ నిబంధనలు, లక్ష్యాలపై ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. ఎసిఎస్, ఎఆర్‌ఆర్ మధ్య తేడాను ఏ విధంగా సరిచేస్తారో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది. దీనికి నవంబరు 30, 2017ను గడువుగా విధించింది. ఇదేవిధంగా 2018–19 నాటికి ఎటి అండ్ టి నష్టాలు ఎన్‌పిడిసిఎల్‌లో 9.90 శాతం, ఎస్‌పిడిసిఎల్‌లో 10 శాతానికి ఏ విధంగా తగ్గిస్తారో చెప్పాలని కమిషన్ ప్రశ్నించింది. దీంతోపాటు దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్ సిస్టం పథకాల అమలుకు సంబంధించి మూడు నెలలకోమారు నివేదిక ఇవ్వాలని కమిషన్ సూచించింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లకు 100 శాతం మీటర్లు బిగించాలని సూచించారు. ఇదేవిధంగా 11 కెవి స్థాయి వరకు ఎనర్జీ ఆడిటింగ్ జరపాలని కమిషన్ సూచించింది. దీంతో పాటు డిస్కంలపై పెన్షన్ల భారం, వేతన సవరణ భారం, ఉద్యోగుల జీతభత్యాలు, పనితీరుపై ఇతర రాష్ట్రాల డిస్కంలతో పోలుస్తూ ఒక నివేదిక ఇవ్వాలని కమిషన్ సూచించింది.

క్రీమిలేయర్ పరిధిలో పిఎస్‌యులలో ఓబిసి కోటా

న్యూఢిల్లీ : ఓబిసిలకు కొత్త క్రీమీలేయర్ పరిమితి పరిధిలో ఉద్యోగాల కల్పనకు రంగం సిద్ధం అయింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో ఉద్యోగాలకు కొత్త పద్ధతిలో కోటా వర్తింపునకు సంబంధించి కేంద్రం మార్గదర్శకసూత్రాలను రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్న పరిమితితో బేరీజు వేసుకుని ఈ నిబంధనవాళిని రూపొందించారు. దీనికి మంత్రుల స్థాయి బృందం ఆమోదం తెలిపింది. త్వరలోనే కేంద్ర మంత్రి మండలి ఆమోదం దక్కుతుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ మంత్రుల బృందమే ఇటీవల ఇతర వెనుకబడిన వర్గాల కోటాలో ప్రయోజనాల కల్పనకు ఉన్న ఆదాయ పరిమితిని రూ 8 లక్షలకు పెంచింది. ఆదాయ పరిమితిని పెంచడంతో పిఎస్‌యులు, బ్యాంకులలో ఉద్యోగాలలో ఓబిసి కోటా మేరకు ప్రభుత్వ ఉద్యోగాల మేరకు ఓబిసిలను భర్తీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలలో ఓబిసిలకు 1993లో ప్రభుత్వం 27 శాతం కోటాను ఖరారు చేసింది. ఆదాయ పరిమితి మేరకు అప్పట్లో వర్గీకరణ గావించారు. అప్పటి ఆదేశాలలో గ్రూప్ ఎ , గ్రూప్ బి ఉద్యోగాలలో ఉండే ఉద్యోగాల గురించే ప్రస్తావన ఉంది. తరువాత దీనిపై విస్తృత స్థాయిలో వివిధ రకాల ఉద్యోగాల్లో ఉన్న వారికి వారి ఆదాయాన్ని పరిమితిని బట్టి ప్రయోజనాలను చేకూర్చే కసరత్తు జరిగింది. ఇప్పుడు కొత్తగా ఆదాయ పరిమితిని పెంచడంతో బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలనే తేడాలు లేకుండా ఓబిసి ప్రభుత్వ ఉద్యోగుల వర్గీకరణకు వీలుగా కొత్త నిబంధనావళిని రూపొందించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

మన తెలంగాణ/హైదరాబాద్: సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాబోయే 24 గంటల్లో ఉపరితల ఆవర్తనం బలపడి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఉత్తర ఒడిషా నుంచి పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతంలో సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈశాన్య మధ్యప్రదేశ్ సమీపంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం రుతుపవన ద్రోణితో కలిసి మరింత బలంగా మారింది. ఈ ద్రోణి ప్రస్తుతం ఒడిషా నుంచి తమిళ నాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ఆవరించింది. ఫలితంగా వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రంలోని పలు చోట్ల భారీ వర్షం కురుస్తుందని, ప్రధానంగా వరంగల్ జిల్లాలో భారీ వర్షం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో వరంగల్ జిల్లా భూపాలపల్లిలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదేవిధంగా కొత్తగూడెంలో 6, దోమలో 5, మక్లూరు, ఆలంపూర్‌లో 4, లింగంపేట, గట్టు, చెన్నూరు, ములుగు, వర్ని, కొల్లాపూర్‌లో 3, పాలకుర్తి, దామరగిద్ద, కాళేశ్వరం, అచ్చంపేట, గండీడ్, సరూర్‌నగర్, నారాయణఖేడ్, కొడంగల్, నందిపేట, కోస్గి, మెదక్, రుద్రూరులో 2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిమ్మాజిపేట, ఆసిఫాబాద్, మద్దూరు, మోర్తాడు, జగిత్యాల, నర్మెట్ట, హయత్‌నగర్, చింతకం, జడ్చర్ల, మాగనూరు, నారాయణపేట, బిక్నూరు, కల్వకుర్తి, గూడూరు, ఆర్మూరు, మహబూబ్‌నగర్, బాన్స్‌వాడ, భీమ్‌గల్, హన్మకొండ, ఎల్లారెడ్డి, యాచారం, గుండాల, నర్సంపేటలో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది.

మాజీ ఎంఎల్ఎపై కేసు

మన తెలంగాణ/మన్సూరాబాద్ : ఓపెన్ ప్లాట్ చూడడానికి వచ్చిన ఓ వ్యక్తిపై మాజీ ఎమ్మెల్యే దాడి చేసిన సంఘటన చైతన్యపురి పియస్ పరిధిలో చోటు చేసుకుంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎల్బీనగర్ జోన్ పరిధిలో చైతన్యపురి పోలీసుల కథనం ప్రకారం కొత్తపేట్ మోహన్‌నగర్ సమీపంలో ఆర్‌బిఐ కాలనీలో ఓపెన్ ప్లాట్ (స్థలం) కొనుగోలు చేయడానికి వెంకటేష్ (50) వెళ్లాడు. ఆ ప్లాట్ ప్రక్కనే మహబూబ్‌బాద్ మాజీ శాసనసభ్యులు శ్రీరాం భద్రయ్య నివాసం ఉంటాడు. ఆప్లాట్ చూడటానికి వెళ్లిన వెంకటేష్‌తో అట్టి స్థలం కోర్టు కేసులో ఉంది అని శ్రీరాం భద్రయ్య తెలిపాడు. దీంతో ఇరువురు మధ్య మాట మాట పెరగడంతో శ్రీరాంభద్రయ్య తన వద్ద గన్‌తో (డబుల్ ఫ్లోర్ బ్యారల్ గన్) వెంకటేష్ వెనుక భాగంలో కొట్టి గాయ పరిచాడు. గాయపడిన వెంకటేష్‌ను నాగోల్ లక్ష్మి ఆసుపత్రికి తరలించాడు. భాదితుని ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ ఛలాన్లపై ప్రత్యేక కోర్టులు?



న్యూఢిల్లీ : ట్రాఫిక్ ఛలాన్ల బెడద తీర్చేందుకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. దిగువ న్యాయస్థానాలపై ఉన్న ఈ ట్రాఫిక్ చలాన్ల సమస్య విరుగుడుకు ఇదొక్కటే మార్గం అని నీతి ఆయోగ్ తమ త్రివర్ష ప్రణాళికలో భాగంగా సూచించింది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారి కేసుల పరిష్కారం దిగువ కోర్టులకు భారంగా మారుతోంది. కేవలం చలాన్ల సమస్యను పరిష్కరించే ప్రత్యేక కోర్టులు ఉంటే కోర్టులపై భారం తగ్గుతుందని, ఉల్లంఘనదార్లు నిర్ణీత గడువులో జరిమానాలు చెల్లించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రత్యేక ట్రాఫిక్ కోర్టులను లా గ్రాడ్యుయెట్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని 2014 లో లా కమిషన్ చేసిన సిఫార్సును ప్రాతిపదికగా చేసుకుని ఆయోగ్ తమ ప్రతిపాదన వెలువరించింది.

కాలపరిమితితో పురపాలక సేవలు

మరింత విస్తృతంగా ఆన్‌లైన్ సేవలు • అమలు తీరుపై నిరంతర పర్యవేక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: స్థానిక సంస్థలలో ఆన్‌లైన్ సేవలను తప్పనిసరిగా అమలు చేసేలా మున్సిపల్ శాఖ చర్యలను తీసుకున్నది. సిటిజన్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో అందించే పలు ప్రధాన సేవలకు మున్సిపల్ శాఖ నిర్ణీత కాలపరిమితిని విధించడంతో పాటు వాటికి ఫీజులను కూడా నిర్ణయించింది. మంచినీటి నల్లా కనెక్షన్ 15 రోజుల వ్యవధిలో తప్పనిసరిగా మంజూరు చేయాలి. ఈ సేవలను తప్పనిసరిగా అమలు చేయాలని స్థానిక సంస్థలను ఆదేశించింది. వివిధ రకాల సేవల విషయంలో సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మున్సిపల్ శాఖ ఆన్‌లైన్ సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఇది వరకే ఆన్‌లైన్ సేవలను అందిస్తున్నప్పటికీ దీనిని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రధాన సేవలను నిర్ణీత గడువులోపు చేపట్టాలని స్థానిక అధికారులను మునిసపల్ శాఖ ఆదేశించింది. దీనికి సంబంధించి ఇటీవల అన్ని మున్సిపాలిటీలకు సర్క్యూలర్‌ను కూడా జారీ చేసింది. ప్రధానంగా ట్రేడ్ లైసెన్స్ పర్మిషన్లు, రెన్యూవల్(15రోజులు), మంచినీటి కనెక్షన్లు(14 రోజులు), అడ్వర్టయిజ్ అనుమతులు (15రోజులు), రోడ్ కటింగ్(7రోజులు), ముటేషన్ (15రోజులు), కాంట్రాక్టర్ లైసెన్సు (30రోజులు) ఆస్తిపన్ను అసెస్‌మెంట్ ప్రక్రియ(15 రోజులు)వంటి పనులకు నిర్ణీత గడువును విధించారు. అయితే భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అధికారులు సదరు బిల్డింగ్‌ను పరిశీలించిన 48గంటల్లోనే నివేదికను అప్‌లోడ్ చేయడం, అనుమతులు 48గంటలలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సేవలను ఆన్‌లైన్‌లో అందించేందుకు సిబ్బందికి తగిన అవగాహన కల్పించాలని, అవసరమైతే ప్రత్యేకంగా ఒక వర్క్‌షాపును కూడా నిర్వహించాలని మున్సిపల్ శాఖ ఆదేశించింది. కాలపరిమితితో కూడిన ఆన్‌లైన్ సేవలు సక్రమంగా అమలు జరుగుతున్నాయా? లేదా? అనే అంశంపై హైదరాబాద్, వరంగల్ ప్రాంతీయ సంచాలకులు నిత్యం పర్యవేక్షించాలని, లోపాలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ శాఖ సూచించింది. టిఎస్ ఐపాస్ నిబందలను అమలు చేస్తున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక అధికారులకు స్పష్టం చేసింది. ఆన్‌లైన్ సేవలపై త్వరలోనే మరోసారిఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించనున్నారు.

సెలవుల కోసం ఆన్‌లైన్ వినియోగం

పోలీసు శాఖ సరికొత్త ప్రయోగం

మన తెలంగాణ/హైదరాబాద్ : రోజుకో కొత్త విధానాన్ని అమలు చేస్తూ తనకు తానే సాటి అని నిరూపించుకుంటున్న తెలంగాణ పోలీసు శాఖ తాజాగా సిబ్బంది సెలవుల కోసం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానాన్ని మొదట హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ప్రారంభించి ఫలితాలను పరిశీలించిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోంది. అప్పటి వరకు పోలీసు శాఖలో ఎవరికైనా సెలవులు కావాలంటే తనపై అధికారిని కలిసి లిఖిత పూర్వకంగా ధరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకుంటున్నారు. ఉద్యోగి పెట్టిన దరఖాస్తును పరిశీలించిన అనంతరం సదరు అధికారి సాధ్యాసాధ్యాలను తెలుసుకుని సెలవును మంజూరు చేయడం కానీ, తిరస్కరించడం కానీ చేస్తున్నారు. ఈ విధానానికి వీలైనంత తొందరగా స్వస్తి పలికి కూర్చున్న చోటు నుంచే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విధానాన్ని అమలు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో సెలవు అభ్యర్థన పెట్టుకోగానే వెంటనే సదరు అధికారికి చేరుతుంది. ఈ దరఖాస్తును పరిశీలించిన అనంతరం పై అధికారి తన నిర్ణయాన్ని ఆన్‌లైన్‌లోనే తెలియజేయాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవలే ప్రవేశపెట్టి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. సెలవు పెట్టాలనుకున్న అధికారి అందుకోసం ఉన్నతాధికారి వద్దకు పనికట్టుకుని వెళ్ళడం వల్ల కొన్ని సందర్భాలలో విధులలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఇబ్బందులను నివారించేందుకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న నిర్ణయానికి అధికారులు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ సెలవుపై వెళ్ళాలనుకుంటే డిసిపికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అభ్యర్థనపై ఎసిపి నుంచి వివరణ తీసుకున్న అనంతరం సెలవు మంజూరీపై తుది నిర్ణయం వెల్లడిస్తారు. ఇన్‌స్పెక్టర్ సెలవు కోసం ముందుగా ఎసిపిని, తర్వాత డిసిపిని కలవడం, తర్వాత ఎసిపి వద్దకు వచ్చి సెలవు పత్రం రాసిచ్చినట్లు చెప్పడం, దీనిపై ఎసిపి పని కట్టుకుని డిసిపికి తెలియజేయడం అనే సుదీర్ఘ ప్రక్రియకు పుల్‌స్టాప్ పెట్టినట్లవుతుందని అధికారులు అంటున్నారు. అంతేకాకుండా ఏ ఇన్‌స్పెక్టర్ ఎప్పటి నుంచి సెలవులో వెళ్తాడు, ఎప్పుడు విధులలో చేరుతాడు, ఎవరు అంతవరకు ఇంచార్జీగా వ్యవరిస్తారనే విషయాలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండటం వల్ల మిగతా ఇన్‌స్పెక్టర్లకు కూడా కొంత సౌలభ్యంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ ఆన్‌లైన్ విధానం సత్ఫలితాలనిస్తే త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఇదే జరిగితే దేశంలోనే మొదటి సారి ఆన్‌లైన్ సెలవుల మంజూరును ప్రవేశపెట్టిన ఘనత కూడా తెలంగాణ పోలీసు శాఖకే దక్కనుంది.

ఫీజుల నివేదిక మరింత ఆలస్యం

మరో మూడు నెలల గడువు కోరిన తిరుపతిరావు కమిటీ • ఆన్‌లైన్‌లో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వివరాలు సేకరణ




మన తెలంగాణ/ హైదరాబాద్ : స్కూల్ ఫీజుల కమిటీ నివేదిక సమర్పణకు గడువు పొడిగింపు కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు గతంలో పొడిగించిన గడువు ఆగస్టు 15వ తేదీతో ముగియగా, తాజాగా మరో మూడు నెలల గడువు కావాలని ఆచార్య తిరుపతి రావు కమిటీ ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది. పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలు సమర్పిస్తే, వాటిని అధ్యయనం చేసి, విశ్లేషించి నివేదిక సమర్పిస్తామని, అందుకు మరింత గడువు కావాలని కోరినట్లు సమాచారం. ఇప్పటికే మూడు సార్లు గడువు పొడిగించగా, ఇది నాల్గవసారి. ప్రభుత్వం ముందు జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం ఏప్రిల్ 20న ఫీజుల నివేదిక నివేదిక సమర్పించాల్సి ఉండగా, అధ్యయనం పేరుతో గడువు పొడిగింపు నెలల తరబడి కొనసాగుతూనే ఉంది. నివేదిక సమర్పణలోనే ఇంత జాప్యం జరుగుతుంటే, ఫీజుల నియంత్రణపై ఉత్తర్వులు ఎప్పుడు వెలువడ తాయి..? ఆ ఉత్తర్వులు ఎప్పటి నుంచి అమలవుతాయి..? అని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇతర రాష్ట్రాలలో ఫీజుల నియంత్రణకు ఉత్తర్వులు వెలువరిస్తూ, కొత్త చట్టాలు తీసుకువస్తుండగా, మన రాష్ట్రంలో మాత్రం ఎక్కడ లేని జాప్యం చేస్తున్నారని తల్లిదండ్రుల సంఘాలు ఆగ్రహిస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తోందని ఆరోపి స్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రిస్తామని ప్రభు త్వం ప్రతి సారి చెబుతున్నా అమలు మాత్రం జరగ డం లేదు. కమిటీలు నియమిస్తూ కంటితుడుపు చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న అధ్యయనం

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోసం మార్గదర్శకాల రూపక ల్పనకు ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీని నియమిస్తూ మార్చి 21న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దాని ప్రకారం ఏప్రిల్ 20వ తేదీ న ఫీజుల కమిటీ నివేదిక సమర్పించాల్సి ఉంది. కానీ మరింత లోతుగా అధ్యయనం చేస్తామని చెబుతూ నివేదిక సమర్పించడంలో కమిటీ జాప్యం చేస్తూ ఇప్పటివరకు నివేదిక సమర్పించలేదు. ఏప్రిల్ 20న గడువు ముగియగా మరో 15 రోజుల గడువు కావాలని తొలిసారి తిరు పతిరావు కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఆ తర్వాత మరో 15 రోజులు కావాలని, ఆ తర్వాత నెలరోజులు అంటే జూన్ 30వ తేదీ వరకు గడువు కావాలని కోరింది. ప్రభుత్వం గడువు ఇస్తూ వచ్చింది. తాజాగా మరో 45 రోజుల కావాలని కోరినట్లు తెలిసింది. అంటే ఆగస్టు 15 వరకు నివేదిక సమర్పిస్తామని ప్రభుత్వానికి తెలిపింది. ఆ గడువు కూడా ముగియడంతో తాజాగా మరో మూడు నెలల గడువు కోరింది.

త్వరలో అందుబాటులోకి ప్రత్యేక పోర్టల్ : టి.తిరుపతిరావు



ప్రైవేట్ స్కూళ్ల ఆదాయ, వ్యయాలను ఆన్‌లైన్ సేకరించాలని ఫీజుల కమిటీ నిర్ణయించింది. అందుకు ప్రత్యేకమైన పోర్టల్ రూపొందిస్తోంది. సిజిజి రూపొందిస్తున్న ఈ పోర్టల్ త్వరలో అందుబాటులోకి రానున్నట్లు కమిటీ ఛైర్మన్ ఆచార్య తిరుపతిరావు తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు మూడు సంవత్సరాలు ఆదాయ, వ్యయాలను పోర్టల్‌లో పొందుపరచాలని చెప్పారు. ఆన్‌లైన్ సేకరించిన ఫీజుల వివరాలను అధ్యయనం చేసి, విశ్లేషించి నివేదిక రూపొందిస్తామన్నారు. అందుకు కనీసం మూడు నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు.



బాంబు చేతపట్టుకొని కానిస్టేబుల్ వీరోచిత చర్య

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓ పోలీస్ వీరోచిత చర్య బాలీవుడ్ సినిమాలోని ఓ సన్నివేశాన్ని గుర్తు చేసింది. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టేందుకు 40 ఏళ్ల హెడ్‌కానిస్టేబుల్ అభిషేక్ పటేల్ సిద్ధమయ్యారు. పాఠశాల ఆవరణలో ఉన్న భారీ బాంబ్‌ను తన భుజంపై పెట్టుకొని జనావాసాలకు దూరంగా కిలో మీటర్ వరకు పరుగెత్తిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. శుక్రవారం సాగర్ జిల్లాలోని చిటోరా గ్రామంలో ఘటన చోటు చేసుకుంది. 400 మంది విద్యార్థులు చదువున్న ప్రభుత్వ పాఠశాలలో బాంబ్ ఉన్నట్లు సమాచారం రావడంతో అభిషేక్ పటేల్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాంబ్ స్క్వాడ్ అందుబాటులో లేకపోవడంతో అభిషేక్ పటేల్ స్వయంగా రంగంలోకి దిగారు. 12 సెం.మీ. పొడవు, 10 కిలోల బరువు గల బాంబ్‌ను ఆయన తన భుజంపై పెట్టుకొని కిలో మీటర్ వరకు పరుగెత్తి బాంబ్‌ను నిర్వీర్యం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నివాస ప్రాంతం, స్కూల్ ఆవరణ కావడంతో జరుగబోయే ప్రమాదాన్ని ముందే ఊహించినట్లు ఆయన తెలిపారు. బాంబు పేలినట్లైతే 500 మీటర్ల వరకు పేలుడు ప్రభావం ఉంటుందని శిక్షణలో నేర్చుకున్నానని ఆయన తెలిపారు. బాంబు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదని అన్నారు.

నేవీకి ఎయిర్ మిసైల్ అప్పగింత



మన తెలంగాణ/హైదరాబాద్ : సుదూర ఉపరితలాన్ని చేధించే ఎయిర్ మిసైల్ (ఎల్ఆర్ఎస్ఎం)ను భారత నేవీకి కేంద్ర రక్షణ, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లి అప్పగించారు. కంచన్‌బాగ్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బిడిఎల్)లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనన దీనిని అప్పగించారు. గగనతలం, ఉపరితలాల నిఘా, ముప్పుపై అప్రమత్తత, అగ్నిమాపక నియంత్రణ ఎల్ఆర్ఎస్ఎం ప్రత్యేకతలు. గగనతల లక్ష్యాలు, మిసైల్స్‌ను ఎదుర్కొనేందుకు దీనిలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ), ఇశ్రాయేల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ (ఐఎఐ) పని వాటా ప్రాతిపదికన సంయుక్త అభివృద్ధిలో ఒప్పందంలో భాగంగా దీనిని రూపొందించారు. బిడిఎల్ సిఎండి వి.ఉదయ్ భాస్కర్ రక్షణ మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి వెంట కేంద ప్రభుత్వ కార్యదర్శి (రక్షణ ఉత్పత్తులు) ఉన్నారు. బిడిఎల్ ఇబ్రహీంపట్నం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన రాకెట్ మోటార్ స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీని మంత్రి జాతికి అంకితం చేశారు. ఈ సౌకర్యం ఏర్పాటు కోసం రూ.48 కోట్లను వెచ్చించారు. ఉపరితలానికి అవసరమైన ఎయిర్ మిసైల్ తరగతికి చెందిన మిసైల్స్‌ను (సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ ఎస్ఎఎం)రూపొందించి, ఉత్పత్తి చేసేందుకు 50 టన్ రాకెట్ మోటార్ టెస్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అభివృద్ధి ఏజెన్సీగా డిఆర్‌డిఒ ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. అన్ని రకాల ఎస్ఎఎంలను పరీక్షించేందుకు వీలుగా 50 టన్నుల లోడు సామర్థ్యం, 1000 కిలోగ్రాముల పేలుడు, 1.1 హెచ్.డి కేటగిరీని కలిగి ఉంది.

జైట్లీకి చింతపండు వ్యాపారుల వినతి

మన తెలంగాణ/హైదరాబాద్ : చింతపండుపై గతంలో పన్ను లేదని, జిఎస్‌టిలో 12 శాతం పన్ను విధించారని వ్యాపారులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి విన్నవించారు. ఒక రోజు పర్యటన కోసం హైదరాబాద్‌కు వచ్చిన అరుణ్ జైట్లీని ఆదివారం బేగంపేట విమానాశ్రయంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ నేతృత్వంలో చింతపండు వ్యాపారులు కలిశారు. మిర్చి, పతి పసుపు వాణిజ్య పంటల కొనుగోలులో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అరుణ్ జైట్లీ స్పందిస్తూ, వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో చింతపండుపై విధించిన పన్నుపై నిర్ణయం తీసుకుంటామని వ్యాపారులకు హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే భూసర్వే : టిడిపి

మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో పూర్తి వ్యతిరేకత నెలకొనడంతోనే టిఆర్ఎస్ పార్టీ ఎంఎల్ఎలు గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి దాపురించిందని టిడిపి అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. మేనిఫెస్టోలో, సిఎం హోదాలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అధికారంలోకి ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు. పుండు ఒకచోట వైద్యం మరోచోట అన్న చందంగా కెసిఆర్ వ్యవహారశైలీ ఉందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి ప్రభుత్వానిదా ? ప్రైవేట్ వ్యక్తులదా అని చూడకుండా ఒకే సర్వే నంబర్ భూమిని అనేక మంది పేర్ల మీద బదిలీ చేసే రెవిన్యూ, రిజిస్ట్రార్ వ్యవస్థల ప్రక్షాళనపై దృష్టి పెట్టకుండా కేవలం గ్రామస్థాయిలో రికార్డులను ప్రక్షాళన పేరిట హడావుడి చేయడం ప్రజలను మభ్యపెట్టడానికేనన్నారు. భూసర్వే పేరిట సమీక్షలు నిర్వహించి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. రెండేళ్లయినా మన ఊరుమన ప్రణాళిక, గ్రామజ్యోతి, పథకాలు ఎక్కడికిపోయాయని ప్రశ్నించారు. టిఆర్ఎస్ ఎంఎల్ఎల పనితీరుపై కాదని సిఎం కెసిఆర్ పనితీరుపై ప్రజల్లో సర్వే చేయించుకోవాలన్నారు.

ఫీజుల పెంపుపై వీడియో సాంగ్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఫీజుల్ పెంపుపై హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి వీడియో సాంగ్‌ను షూట్ చేసింది. కెసిఆర్, విద్య పట్ల నీకెందుకు శ్రద్ధ లేదనే అర్థంలో సాగే హిందీ పాటను పాటను ఎడిటింగ్ పూర్తయిన తర్వాత దీనిని తమ వెబ్‌సైట్‌లో పెట్టనున్నట్లు హెచ్ఎస్‌పిఎ సభ్యులు తెలిపారు. అత్తాపూర్ అంబియన్స్ ఫోర్ట్‌లో దీనిని షూట్ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎస్‌పిఎ సభ్యులు అశీష్ నరేడి మాట్లాడుతూ, ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతందని, ముఖ్యమంత్రి వరకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఫీజుల పెంపుపై తాము చేసిన ప్రయత్నాలు, నిరసనలు చెవుటోళ్ల ముందు శంఖమూదినట్లుగా మారాయయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాదీ హిందీలో దాదాపు రెండు నిమిషాల పాటు ఈ పాట ఉంటుందన్నారు.

పెట్రో ధరలు పైపైకి..



న్యూఢిల్లీ: పెట్రోల్ ధరలు చాపకింద నీరులా పెరిగిపోతున్నాయి. జూలై నుంచి చమురు సంస్థలు రోజువారీగా పెట్రోల్ ధరలను కొద్దీ కొద్దీగా పెంచుతూ లీటర్‌కు రూ.6 పెంచాయి. రోజు వారీ సమరణల పేరుతో పెంచిన పెట్రోల్ ధరలు గత మూడేళ్లలో గరిష్ఠ స్థాయికి చేరాయి. డీజిల్ ధరలు లీటర్‌కు రూ.3.67కు పెంచారు. దీంతో ఢిల్లీలో లీటర్ డీజిల్ ధర రూ.57.03కు చేరుకుంది. గత నాలుగు నెలల్లో డీజిల్ ధరలు గరిష్ట స్థాయికి చేరినట్లు చమురు సంస్థల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 69.04కి చేరుకుంది. 2014 ఆగస్టు అర్థ భాగంలో పెట్రోల్ ధర రూ. 70.33కు చేరిన తర్వాత ప్రస్తుతం గరిష్ట స్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. జూన్ 16న ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.65.48 నుంచి జూలై 2 నాటికి లీటర్‌కు రూ. 63.06 లకు పడిపోయింది. ఆ తర్వాత నాలుగు సందర్భాలలో లీటర్‌కు రూ.29 పైసలు తగ్గడం మినహా ప్రతిరోజు పెరుగుతూనే ఉన్నాయి. కాగా, జూన్ 16న లీటర్ డీజిల్ ధర రూ. 54.49 నుంచి జూలై 2 నాటికి రూ.53.36 కు పడిపోయింది. అప్పటి నుంచి పెరుగుతున్న డీజిల్ ధరలు పెట్రోల్ ధరల పెంపుతో పోల్చినప్పుడు తక్కువగానే పెరిగినట్లు తెలుస్తోంది. జూలై నుంచి అంతర్జాతీయ చమురు మార్కెట్లో రోజువారీ ధరల హెచ్చు, తగ్గులను తక్షణమే వినియోగదారుడికి బదిలీ చేసే విధానాన్ని ప్రవేశ పెట్టారు. గతంలో 15 రోజులకోసారి ప్రతి నెల 1, 16 తేదీల్లో మాత్రమే పెట్రోల్, డీజిల్ ధరలను సమీక్షించేవారు. ఒకేసారి పెద్ద మొత్తంగా ధరలు పెంచే కన్నా రోజువారీగా మార్కెట్ ధరల్లో వస్తున్న మార్పులను వినియోగదారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటారని అధికారులు తెలిపారు. పెట్రోల్ ధరలను రోజువారీగా ఉదయ్‌పూర్, జంషెడ్‌పూర్, పుదుచ్చేరి, చండీగఢ్, విశాఖపట్నంలలో మొదటిసారిగా ప్రవేశపెట్టి అనంతరం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

ఓనం పండగకు ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్: ఓనం పండగ సందర్భంగా ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గిం చేందుకు సికింద్రాబాద్ : కోచువెల్లి, హెచ్ఎస్ నాంథేడ్: ఎర్నాకూలం మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడిపంచనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. సెప్టెంబర్ 1న సికిం ద్రాబాద్ నుంచి కోచ్‌వెల్లి, సెప్టెంబర్ 6న కోచ్‌వెల్లి నుంచి సికింద్రాబాద్‌కు ఈ ప్రత్యేకరైళ్లు నడుస్తా యని ఎస్‌సిఆర్ సిపిఆర్‌వో ఉమాశంకర్ ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 1న హెచ్ఎస్ నాంథేడ్ నుంచి ఎర్నా కులంకు సెప్టెంబర్ 4న ఎర్నాకులం నుంచి నాంథేడ్‌కు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి.

శరద యాదవ్‌కు బెదిరింపు లేఖ

న్యూఢిల్లీ : బీహార్ రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని, హిందువుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడవద్దంటూ జెడి(యు) అసమ్మతి నేత శరద్ యాదవ్‌కు ఒక అతివాద సంస్థ నుండి బెదిరింపు లేఖ వచ్చిందని ఆయన కార్యాలయం వెల్లడించింది. ఇటీవల ఇక్కడ ఆయన అధికారిక నివాసానికి స్పీడ్ పోస్టు ద్వారా ఆ లేఖ చేరుకుంది. దీని గురించి కేంద్ర హోం శాఖకు తెలిపామని శరద్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. బీహార్ ప్రభుత్వంతో పాటు హిందువుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడవద్దని, అలా చేయని పక్షంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన్ను హెచ్చరించారు. జాతివ్యతిరేక శక్తులతో చేతులు కలిపి ఆయన భారీ తప్పిదం చేశారని కూడా సదరు లేఖ పేర్కొంది.

ఏకీకరణతో కార్పొరేట్లకే బ్యాంకుల తాకట్టు

సురవరం విమర్శ... సమ్మెకు మద్దతు



హైదరాబాద్ : బ్యాంకింగ్ రంగంలో స్థిరీకరణ పేరిట ఏకీకరణ చర్యలు తగవని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు లేదా రుణ సంస్థలకు ఉండే సామాజిక బాధ్యతలు, కట్టుబాట్లకు కేంద్రం చర్య విఘాతంగా మారుతుందని సురవరం తెలిపారు. విలీనం లేదా సముదాయాలుగా మార్చడం వంటి బ్యాంకింగ్ వ్యవస్థ మార్పులను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని వెల్లడించారు. వచ్చే కొద్ది నెలల్లో సమస్యల పరిష్కారానికి బ్యాంక్ ఉద్యోగులు తీవ్రతరం చేయనున్న సమ్మెకు తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. బ్యాంకుల విలీనంతో వాటి సామాజిక బాధ్యత తగ్గు తూ పోతుందని, తమ భారం తగ్గించుకునేందుకు బ్యాంకులు అత్యధికంగా కార్పొరేట్ సంస్థలకే రుణాలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటాయని సురవరం ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకుల విలీన ప్రతిపాదన అంశంపై ఆయ న ఆదివారం పిటిఐ వార్తాసంస్థతో మాట్లాడారు. పది పదిహేను వేల ఖాతాదార్లను చూసుకోవడం కన్నా , ఒకే ఒక్క కార్పొరేట్ సంస్థతో లావాదేవీలు నిర్వహించే పద్ధతి ఏర్పడుతుందని, ఈ విధంగా కార్పొరేట్ సంస్థ లు బ్యాంకులకు గండికొడుతాయని ఆయన హెచ్చరించారు. ఇప్పటిస్థాయిలో విలీన బ్యాంకుల నుంచి రైతు లు, స్వయం ఉపాధి గల వారికి ఇతరులకు రుణాలు ఇచ్చే పద్ధతి పోతుందని, ప్రాంతీయ బ్యాంకులు తమవే అనే భావన ప్రజలలో పోగొట్టే దశ ఏర్పడుతుందని తెలిపారు. గత కొద్ది సంవత్సరాలలో బడా సంస్థలకు ఇచ్చిన రూ 2.56 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని విమర్శించారు. ఇక ఇదే సమయంలో పేదల రుణాల మాఫీ నామమాత్రంగా ఉందని, పైగా వారికి వేధింపులు తప్ప లేదని చెప్పారు. అక్టోబర్ నుంచి బ్యాం క్ ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు మద్దతుగా నిలుస్తామని సురవరం వెల్లడించారు. బ్యాంకుల నష్టాలకు కార్పొరేట్ సంస్థల మొండిబకాయిలే కారణం అని, వీటి గురించి బ్యాంకులు తమ అధికారిక గణాంకాలలో వెల్లడించడం లేదని తెలిపారు. ఇక రుణాల వసూళ్ల ప్రక్రియ సామాన్యుడికో తీరు, సంపన్నుడికో తీరుగా ఉందని ఆయన నిరసన వ్యక్తం చేశారు. సామాన్య పౌరుడు రుణాలు చెల్లించలేకపోతే వారి ఆస్తులనే కాకుండా ష్యూరిటీ ఇచ్చిన వారి ఆస్తులను కూడా వేలం వేస్తారని , ఇక ప్రైవేటు కంపెనీలు ఎగవేతలకు భారీ స్థాయిలో దిగితే చర్యలు వేరే విధంగా ఉంటాయని ఇదేం వివక్షత? అని ప్రశ్నించారు.

ఇద్దరిని కొట్టి చంపిన గోరక్షకులు

జల్పాయ్‌గురి : పశ్చిమ బెంగాల్‌లో గోరక్షకుల పేరిట ఓ గుంపు జరిపిన దౌర్జన్యకాండలో ఇద్దరు ముస్లిం యువకులు మృతి చెందారు. ఈ సామూహిక హింసోన్మాద ఘటన ఆదివారం జల్పాయ్‌గురి జిల్లాలోని బర్హోరియా గ్రామంలో జరిగింది. ఆవులను తీసుకువెళ్లుతున్న ఓ వ్యాన్‌ను ఈ మూక అడ్డగించింది. దురుసుగా వ్యాన్‌లో ఉన్న 19 ఏళ్ల అన్వర్ హుస్సేన్, హాఫీజుల్ షేక్‌ను బయటకు లాగి , కిందపడేసి తీవ్రంగా కొట్టడంతో వారు ప్రాణాలు విడిచారు. ఆదివారం తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. గోవులను రవాణా చేస్తున్న వ్యాన్‌ను దుండగులు పూర్తిగా ధ్వంసం చేసినట్లు, తీవ్ర గాయాలతో పడి ఉన్న ఇద్దరు యువకులను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే వారు మృతి చెందినట్లు వెల్లడైందని స్థానిక పోలీసులు తెలిపారు. ఘటన తరువాత గ్రామంలోకి భారీ సంఖ్య లో పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. వాహనంలో ఉన్న ఆవులను పోలీసులు తీసుకుని వెళ్లారు. ఘటనతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

దసరాకు టెక్స్‌టైల్‌పార్కు శంకుస్థాపన

❑ రూ. 1,586 కోట్ల పెట్టుబడుల అంచనా!



మన తెలంగాణ/ హైదరాబాద్ : వరంగల్ రూరల్ మండలం సంగెం వద్ద ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు దసరాకు శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం ఐదు దశల్లో 330 యూనిట్ల నిర్మాణం చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 659 కోట్లు అవసరం కాగలవని అంచనా. ఈ పార్కు శంకుస్థాపన తర్వాత పెట్టుబడులను ఆహ్వానించడానికి వరంగల్ జిల్లాలోనే టెక్స్‌టైల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటైతే రూ. 11,586 కోట్ల పెట్టుబడులు వస్తాయని, కనీసం లక్షన్నర మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే వీలు ఉంటుందని ప్రభుత్వం అంచనా.

పెట్టుబడులకు 15 సంస్థల సన్నద్ధత ! : శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో దసరా రోజునే పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన 15 సంస్థలు టిఎస్ఐఐసితో ఒప్పందం చేసుకోనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నిజానికి ఈ టెక్స్‌టైల్ పార్కుకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయాల్సి ఉండింది. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన కార్యక్రమం కాస్త వెనక్కి జరిగింది. అయితే ఇంతలోనే దక్షిణ కొరియాకు చెందిన టెక్స్‌టైల్ రంగ సంస్థలు ఐటి శాఖ మంత్రి కెటిఆర్‌తో సంప్రదింపులు జరిపగా తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. టెక్స్‌టైల్ పార్కు సైట్ విజిట్ చేస్తామని దక్షిణ కొరియా బృందం కోరగా అందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అయితే హైదరాబాద్ నుండి వరంగల్‌కు ఏయిర్ కనెక్టివిటీ లేని కారణంగా వారు సైట్‌ను విజిట్ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేయలేదు. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కులో హెలీప్యాడ్ లేని లోటును గుర్తించిన ప్రభుత్వం రెండు వారాల కిందట ఈ హెలీప్యాడ్ నిర్మాణం పూర్తి చేయించి దక్షిణ కొరియా బృందాన్ని ఆహ్వానించింది. తాము కోరిన విధంగా హెలీప్యాడ్ కూడా సమకూర్చడంతో దక్షిణ కొరియా బృందం ఇటీవలే కాకతీయ టెక్స్‌టైల్ పార్కు సైట్‌ను హెలీకాప్టర్‌లో వెళ్లి పరిశీలించి వచ్చింది. మొత్తం 1190 ఎకరాల్లో వెయ్యి కోట్ల అంచనా వ్యయంతో నిర్మితం కానున్న టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది. జిన్నింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, మార్కెటింగ్ సెంటర్‌లను అన్ని వసతులతో సమకూరుస్తుండడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. హెలీపాడ్ నిర్మాణం తొలుత అవసరం లేదని భావించిన ప్రభుత్వం విదేశీ పెట్టుబడి దారుల కోరిక మేరకు నిర్మించక తప్పలేదని అధికారులు తెలిపారు.

ఏడు ఎత్తైన పర్వతాలు అధిరోహిస్తా

ఆగస్టు ఫెస్ట్‌లో పూర్ణ మలావత్



మన తెలంగాణ/హైదరాబాద్ : క్రీడలకు మరింత ప్రోత్సాహకం అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆటలకు మరిన్ని క్రీడా మైదానాలు అవసరమని అన్నారు. ఐఎస్‌బిలో ఆసియాలోనే అతిపెద్ద స్టార్టప్ ఫెస్టివల్ ఆగస్టు ఫెస్ట్ 2017 రెండు రోజుల పాటు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం స్పోర్ట్స్ కార్నివాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మలావత్, ఒంటరిగా ఎవరెస్ట్‌ను‌అధిరోహించిన మొదటి భారతీయుడు శేఖర్‌బాబు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్(ఎస్ఎటిఎస్) చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మలావత్ పూర్ణ మాట్లాడుతూ, 2018 జూన్ నాటికి ఏడు ఖండాలలోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించడమే తన లక్ష్యమని ప్రకటించారు. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ క్రీడాకారులు, అర్జున, పద్మ అవార్డు గ్రహీతలు, మాజీ క్రీడాకారులు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. స్పోర్ట్స్ బడ్జెట్ నుంచి రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పెంచాలని అభిప్రాయపడ్డారు.

ఎగుమతి చేసే స్థాయికి కూరగాయల ఉత్పత్తి

'తెలంగాణ ఉద్యాన మహోత్సవం' ప్రారంభోత్సవంలో మంత్రి పోచారం





మన తెలంగాణ / హైదరాబాద్ : ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే ప్రజలు ఆరోగ్యమైన తాజా ఆహారం తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ' తెలంగాణ ఉద్యాన మహోత్సవం 2017ను ప్రారంభించిన అనంతరం మంత్రి పోచారం మీడియాతో మాట్లాడారు. ప్రజలు తమ ఇంటికి అవసరమైన కూరగాయలను ఇంట్లోనే పండించుకోవాలన్నారు. రసాయన మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతులను ఆచరించి తాజా కూరగాయాలను పండించుకోవాలని సూచించారు. ఇళ్లలోనే కూరగాయలు పండించడానికి అవసరమైన అధునాతన, సాంకేతిక పద్ధతులను రాష్ట్రఉద్యానశాఖ అందుబాటులోకి తెచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు, పండ్లను మన రాష్ట్రంలోనే పండించడమే కాకుండా ఎగుమతి చేసే స్థాయికి ఉత్పత్తులు చేరాలన్నారు. ఉద్యాన పంటల ద్వారానే రైతులు అధిక ఆదాయం పొందుతారని మంత్రి వెల్లడించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలను కల్పించి ఉద్యాన పంటల రైతులను ప్రొత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలోని 10800 రెవెన్యూ గ్రామాలను 3600 యూనిట్స్‌గా విభజించి సెప్టెంబర్ ఒకటో తేది నుండి 9 వరకు గ్రామ రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. సెప్టెంబర్ 10 నుండి 14 లోగా మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి రిసోర్స్ పర్సన్స్ ద్వారా సదస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. రైతు సమగ్ర సర్వే వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి సమన్వయ కర్త, ఏఈవో సంతకాలతో కూడిన రికార్డు ఆధారంగా వచ్చే ఏడాది మే 15 నాటికి ఏకరాకు రూ. 4000 నగదును రైతుల ఖాతాలలోకి బదిలీ చేస్తామన్నారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు ఏడాదికి రూ. 8000 నగదు అందుతందన్నారు. రైతులు అప్పుల బారి నుండి బయట పడి ఆత్మహత్య రహిత తెలంగాణయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహోత్సవం ఈ నెల 31 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లకు ఏర్పాటు చేసుకున్నాయి.

ఈ కార్యక్రమంలో నారాయణ్ ఖేడ్ ఎంఎల్ఏ భూపాల్ రెడ్డి, నర్సాపూర్ ఎంఎల్ఏ మదన్ మోహన్ రెడ్డి, డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ డిప్యూటి స్పీకర్ హరీశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరి సి. పార్థసారథి, ఉద్యాన శాఖ కమిషనర్ యల్. వెంకట్రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరద్ యాదవ్‌పై అనర్హత వేటుకు యోచన

న్యూఢిల్లీ: రెబల్ నేత శరద్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యత్వం నుంచి అనర్హత వేటు వేయాలని కోరుతూ రాజ్యసభ చైర్మన్ ఎం. వెంకయ్య నాయుడుకు జెడి(యు) లేఖ రాయనుంది. పార్టీ నిబంధనలను ఉల్లంఘించి ఆదివారం పాట్నాలో ప్రతిపక్ష పార్టీ ఆర్‌జెడి చేపట్టిన ర్యాలీలో శరద్ పాల్గొనడాన్ని జెడి(యు) తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించిన ర్యాలీలో శరద్ యాదవ్ పాల్గొనడంతోనే ఆయన జెడి(యు) సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టేనని పార్టీ స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం.. ఒక పార్టీలో కొనసాగుతూ ఆ పార్టీకి వ్యతిరేకంగా మరోక పార్టీ ర్యాలీలో పాల్గొనే సభ్యులు ఎవరైనా సరే ప్రధాన పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సిందేనని జెడి(యు) ప్రధాన జనరల్ సెక్రటరీ కెసి త్యాగీ చెప్పారు. పార్టీకి వ్యతిరేకంగా ఆర్‌జెడి ర్యాలీలో శరద్ యాదవ్ పాల్గొనడంపై హెచ్చరిస్తూ గత కొన్ని రోజుల క్రితమే త్యాగీ ఆయనకు లేఖ రాశారు. అయితే పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా పార్టీ అధ్యక్షుడిగా దీర్ఘకాలిక సేవలందించిన శరద్‌కు రాజ్యసభ సభ్యత్వాన్ని నిలబెట్టుకునేందుకు అనుమతిని ఉంటుందని, అప్పటివరకూ యాదవ్‌ను పార్టీ నుంచి తొలగించేది లేదని జెడి(యు) వర్గాలు స్పష్టం చేశాయి. గత ఏడాది రాజ్యసభకు ఎన్నికైన శరద్ యాదవ్ 2022 వరకు కొనసాగనున్నారు.

ఉర్దూ కవుల స్వాతంత్ర్యగానం



వాహెద్
7396103556

ప్రపంచంలో ఏ ప్రాంతంలో అయినా స్వేచ్ఛల కోసం, హక్కుల కోసం వినిపించే నినాదాల్లో ''వి షల్ ఓవర్ కం'' తప్పక వినిపిస్తుంది. అమెరికాలో ఆఫ్రికన్ అమెరికన్ పౌరహక్కుల పోరాటాల్లో తప్పక వినిపించే పాట ఇది. ఉద్యమాలకు పాట ఊపిరులూదుతుంది. ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన ''హమ్ దేఖేంగే'' గేయం కూడా అలాంటిదే. భారత ఉపఖండంలో అనేక ఉద్యమాల్లో ఈ కవితతో పాటు ''బోల్ కే లబ్ ఆజాద్ హై'' కవిత ప్రముఖంగా వినిపిస్తుంది. ఫైజ్ అహ్మద్ ఫైజ్ కన్నా ఈ విషయంలో మౌలానా హస్రత్ మోహానీ రాసిన రెండు పదాలు భారత ఉపఖండంలో 1921 నుంచి నేటి వరకు మారుమోగుతూనే ఉన్నాయి. ఆ రెండు పదాలు ''ఇంక్విలాబ్ జిందాబాద్''. భగత్ సింగ్ సగర్వంగా అసెంబ్లీ హాలు దాడి తర్వాత ఈ నినాదమే పలికాడు. మౌలానా హస్రత్ మోహానీ పేరు వినగానే అందమైన గజళ్ళు గుర్తొస్తాయి. నికా చిత్రంలో ఆయన రాసిన ''చుప్కే చుప్కే రాత్ దిన్'' పాట వాడుకున్నారు. అద్భుతమైన, అందమైన గజల్ అది. అలాంటి గజళ్ళు రాయడమే కాదు హస్రత్ మోహానీ విప్లవాత్మక కవితలు అల్లారు. దేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని పిలుపిచ్చిన మొట్ట మొదటి వ్యక్తి ఆయనే. 1921లోనే ఆయన ''ఆజాదియే కామిల్'' కావాలని డిమాండ్ చేశాడు.

'రస్మె జఫా కామియాబ్ దేఖియే కబ్ తక్ రహే' (నిరంకుశత్వం ఎంతకాలమో అదీ చూద్దాం) / 'హుబ్బె వతన్ మస్త్ ఖాబ్ కబ్ తక్ రహేం' (దేశప్రేమికులు స్వప్నాల్లో ఎంత కాలం ఉంటారో అదీ చూద్దాం)/ 'దౌలతె హిందూస్తాన్ ఖబ్జాయే అగ్యార్ మేం' (భారత సంపద పరుల చేతుల్లో ..)/ 'బే అదద్ వ బే హిసాబ్ దేఖియే కబ్ తక్ రహేం' (లెక్కా పత్రం లేకుండా ఎంతకాలమో అదీ చూద్దాం) స్వతంత్ర ఉద్యమాల్లో కళారూపాలు, ముఖ్యంగా కవిత్వం కీలకపాత్ర పోషిస్తుంది. బ్లాక్ పోయట్రీ ఒక ప్రత్యేక కవిత్వ అభివ్యక్తిగా గుర్తింపు పొందింది. భారత స్వతంత్ర సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన ఉర్దూ కవుల గురించి ఆ తర్వాత ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఉర్దూ కవిత్వమంటే అద్భుతమైన ప్రేమ గజళ్ళుగానే భావించబడుతుంది. ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించింది కూడా ఉర్దూ కవిత్వమే. సామాజిక సమస్యలపై, స్వతంత్రపోరాట స్ఫూర్తిని రగిలించిన అద్భుతమైన ఉర్దూ కవిత్వాన్ని నేడు ఎవ్వరూ స్మరించడం లేదు. నిజానికి అద్భుతమైన గజళ్ళు కూడా వచ్చాయి. ఉర్దూ కవిత్వం స్వతంత్ర పోరాటకాలంలో పోషించిన కీలకపాత్ర పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

1857 తిరుగుబాటును కవిత్వంలో రికార్డు చేసింది ఉర్దూ కవిత్వమే. తిరుగుబాట వైఫల్యం తర్వాత షహర్ ఆషోబ్ (విషాదాలు) కవితలైనా, ఆ తర్వాత బ్రిటీషు వ్యతిరేక ప్రతిఘటనల్లో వచ్చిన కవిత్వము లోను ఉర్దూ కవులు నిరంకుశ పాలకులపై నిజాయితీగా గళమెత్తారు. ప్రజాకాంక్షలను తమ కవిత్వంలో ప్రతిబింబించారు. ఉర్దూ కవిత్వమంటే కేవలం ప్రేమ గజళ్ళు కాదు. ఫైజ్ మాటల్లో చెప్పాలంటే, 'ఔర్ భీ దుఖ్ హై జమానే మేం ముహబ్బత్ కె సివా' (ప్రపంచంలో ప్రేమే కాదు ఇంకా దుఃఖాలున్నాయి)/ 'సర్ఫరోషీకి తమన్నా అబ్ హమారే దిల్ మేం హైం' (ఆత్మత్యాగం చేయాలన్న కోరిక గుండెల్లో ఉంది)/ 'దేఖ నా హై జోర్ కితనా బాజుయే ఖాతిల్ మేం హైం' (హంతకుడి చేతిలో ఎంత బలం ఉందో చూద్దాం) బిస్మిల్ అజిమాబాదీ రాసిన ఈ గజల్ పంక్తులను పాడుకుంటూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ఉరికంబం వైపు నడిచారు. భారత స్వతంత్ర సంగ్రామంలో అల్లమా ఇక్బాల్ రాసిన ''సారే జహాం సే అచ్ఛా హిందూసితా హమారా'' స్వతంత్ర పోరాట కాలంలో అందరి నాలుకలపై నాట్యం చేసేది. స్వతంత్ర పోరాటంలో ఉర్దూ కవిత్వం కీలకపాత్ర పోషించింది. మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ, బ్రిజ్ నారాయణ్ చక్ బస్త్, హస్రత్ మోహానీ, జఫర్ అలీ ఖాన్, ముహమ్మద్ అలీ జోహార్, షౌకత్ అలీ జోహార్, అల్లామా ఇక్బాల్, దుర్గా సహాయ్, సురూర్ జహానాబాదీ, త్రిలోక్ చంద్ మహ్రూమ్ ఇలాంటి అనేక పేర్లు మనకు కనబడతాయి.

కవిత్వం సామాజిక ప్రయోజనానికని నినదించినవాడు మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ. 1837లో జన్మించిన మౌలానా 1857 ఘోరాలను కళ్ళారా చూశాడు. సామాజిక ప్రయోజనాలకే కవిత్వం రాయాలనేవాడు. ఆయన రాసిన హుబ్బె వతన్ (దేశప్రేమ) కవితకు అత్యంత ప్రజాదరణ లభించింది. మౌలానా 1914లో మరణించారు.

'తెరీ ఏక్ ముష్త్ ఖాక్ కే బదలే' (నీ ఒక్క గుప్పెడు మట్టికి బదులు)/ లూం నా హర్ గిజ్ అగర్ బహిష్త్ మిలే (స్వర్గం దొరికినా వద్దంటాను) ఈ పంక్తులు రాయడం మౌలానా హాలీకి మాత్రమే సాధ్యం. అక్బర్ అలహాబాదీ కూడా ఈ కాలంలో మేధావిగా పరిగణించబడిన కవి. కాని ఆయన చాలా వ్యంగ్యాత్మక ధ్వనితో రాసేవారు. అందువల్ల ఆయన కవితల్లోని తాత్విక భావాలను వ్యంగ్యం కప్పేసేది. అక్బర్ అలహాబాదీ చివరి దశలో గాంధీజీ తెరపైకి వచ్చారు. గాంధీయిజం పట్ల ఆకర్షితుడై అక్బర్ అలహాబాదీ హిందూ ముస్లిమ్ ఐక్యత కోసం చాలా కృషి చేశాడు. ఆయన కవితల్లో తీవ్రమైన హాస్యం తొణికే వ్యంగ్యం గమనించదగింది.

> భారత స్వతంత్ర సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన ఉర్దూ కవుల గురించి ఆ తర్వాత ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఉర్దూ కవిత్వమంటే అద్భుతమైన ప్రేమ గజళ్ళుగానే భావించబడుతుంది. ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించింది కూడా ఉర్దూ కవిత్వమే. సామాజిక సమస్యలపై, స్వతంత్రపోరాట స్ఫూర్తిని రగిలించిన అద్భుతమైన ఉర్దూ కవిత్వాన్ని నేడు ఎవ్వరూ స్మరించడం లేదు.

'బుద్ధూ మియాం భీ హజ్రతె గాంధీకే సాథ్ హైం' (ఈ మూర్ఖుడు కూడా గాంధీగారికి తోడయ్యాడు)/ 'గో ఖాకె రాహ్ హైం, మగర్ ఆంధీకే సాథ్ హైం' (స్వయంగా దుమ్ము ధూళి అయినా, సుడిగాలితో పాటున్నాడు) చాలా లోతైన తాత్వికత ఉన్న కవిత. గాంధీజీ వెంట నడవడం వల్ల సాధారణమైన వ్యక్తి కూడా అసాధారణ ఎత్తులకు చేరుకుంటాడని చెప్పే ఈ కవితలో తీవ్రమైన వ్యంగ్యం, తనపై తానే వేసుకున్న హాస్యం కవితలో తాత్వికతను లోతుగా అర్థం చేసుకోనివ్వదు. తనలాంటి మూర్ఖుడు కూడా గాంధీజీకి తోడయ్యాడని చెప్పి, గాంధీజీని సుడిగాలితోను, తనను తాను దుమ్ముధూళితోను పోల్చుకున్నాడు. ఈ వ్యంగ్యం విన్నవెంటనే నవ్వు వస్తుంది. కాని సుడిగాలి, దుమ్ముకణాన్ని అసాధారణ ఎత్తులకు తీసుకెళుతుందన్న తాత్విక కోణాన్ని అర్థం చేసుకోనీయదు.

కాకోరి కుట్ర కేసులో శిక్షకు గురైన అష్ఫాఖుల్లా ఖాన్ గొప్ప కవి. అతను రాసిన చివరి కవిత ''షోరిషె జునూన్''లో అతను తాను ఎన్నుకున్న మార్గాన్ని ఇతరులకు స్ఫూర్తిదాయకంగా వివరించాడు.

'సభీ సామానె ఇష్రత్ థే, మజే సే కటీ థీ' (విలాస సామాగ్రి అంతా ఉండేది. హాయిగా గడిచేది) / 'వతన్ కీ ఇష్క్ నే హమ్ కో హవా ఖిలాయీ జందాం కీ' (దేశ ప్రేమ జైలు ఊచల వెనుకకు తెచ్చింది) రాంప్రసాద్ బిస్మిల్ రాసిన పంక్తులు కూడా గమనించదగినవి. 'నవ్ జవానోం యహీ మోకా హై ఉఠో ఖుల్ ఖేలో' (యువకుల్లారా ఇదే అవకాశం లేవండి .. ఉత్సాహంగా) 'ఖిద్మతె ఖౌమ్ మేం ఆయే జో బలాయేం ఝేలో' (జాతి సేవలో ఏ కష్టం వచ్చినా తట్టుకోండి) బ్రిజ్ నారాయణ్ చక్ బస్త కవిత్వంలో ఇవే భావాలు కాస్త సున్నితంగా ప్రకటించాడు.

'యే ఖాకె హింద్ సే పైదా హై జోష్ కే ఆసార్' (ఈ దేశం మట్టిలో పుడతాయి ఉత్సాహపు భావాలు)/ 'హిమాలయ సే ఉఠే జైసే అబ్రె దర్యార్' (హిమాలయాల నుంచి వర్షపు మబ్బులు జన్మించినట్లు) విప్లవకవుల గురించి రాస్తున్నప్పుడు జోష్ మలిహాబాది ప్రస్తావన తప్పనిసరి. ఆయన షాయరె ఇంక్విలాబ్ గా పేరుపడ్డాడు.

'కామ్ హై మేరా తగ్యార్, నామ్ హై మేరా షబాబ్ '(నా పేరు యవ్వనం, నా పని మార్పు తేవడం)/ 'మేరా నారా ఇంక్విలాబో ఇంక్విలాబో ఇంక్విలాబ్' (నా నినాదం విప్లవం, విప్లవం, విప్లవం) అలీ సర్దార్ జాఫ్రీ కవి మాత్రమే కాదు, జాతీయ ఉద్యమంలో పాల్గొని జైళ్ళకు వెళ్ళాడు. జైల్లోనే అనేక కవితలు రాశాడు. 'రక్స్ కరాయీ రూహె ఆజాదీ, కె రక్సామ్ హై హయాత్' (స్వేచ్ఛా స్ఫూర్తి నృత్యం చేయించింది. జీవితమే నాట్యం)/ 'ఘూమతీ హర్ వక్త్ కే మెహవర్ పర్ సారీ కాయనాత్' (కాలం ఇరుసుపై విశ్వం నర్తిస్తుంది.)

ఉర్దూ కవిత్వం గురించి రాస్తున్నప్పుడు అంజుమనె తరఖ్ఖీ పసంద్ ముసన్నిఫీన్ (అభ్యుదయ రచయితల సంఘం) ప్రస్తావన లేకపోతే అసంపూర్ణమే. అభ్యుదయ రచయితలు ఒక ఉద్యమంగా వచ్చారు. కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించారు. వచన కవిత్వం వంటి ప్రక్రియల్లో కవిత్వం రాస్తూ విప్లవగీతాలు ఆలపించారు. స్వతంత్ర పోరాటంలో తమదైన పాత్ర పోషించారు. అభ్యుదయ రచయితల సంఘంలో ప్రారంభంలో అత్యధికులు ఉర్దూలో రాసిన వాళ్ళే. సామాజిక పరిస్థితుల పట్ల తమ నిరసన, దమననీతి పట్ల ప్రతిఘటన నిర్భయంగా రాశారు. స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకున్నారు. తమ కవిత్వం, కథలు, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్నిసృష్టించారు. మజ్నూ సుల్తాన్ పురి ముంబయికి 1944లో వచ్చాడు. అప్పటి వరకు సంప్రదాయిక గజళ్ళు మాత్రమే రాసిన మజ్రూ ఆ తర్వాత అభ్యుదయ రచయితలతో కలిసి ఆయన గొంతు మారిపోయింది.

'దహ్రే మేం మజ్రూ కోయీ జావిదాం మజ్మూన్ కహాం' (ఈ లోకంలో శాశ్వతమైన అంశం నీకెక్కడ దొరుకుతుంది మజ్రూ)/ 'మైం జిసే ఛూతా గయా వో జావిదాం బన్తా గయా' (నేను కవిత్వంతో తాకిన ప్రతిదీ శాశ్వతమైంది) అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకడైన ఫైజ్ జైలు నుంచి రాసిన పంక్తులు కూడా గమనించదగినవి.

'హమ్ నే జో తర్జె ఫుగాన్ కీ హై ఖఫస్ మేం ఈజాద్' (మేం పంజరంలో కనిపెట్టిన దుఃఖించే పద్ధతి)/'ఆజ్ గుల్షన్ మేం వహీ తర్జె బయాన్ ఠహరీ హై' (నేడు ఉద్యానవనంలో అదే పలుకు శైలిగా మారింది)/ ఫైజ్ సమకాలీకుడు, అభ్యుదయ కవుల్లో ఒకడు మజాజ్ రాసిన పంక్తులు కూడా గమనించదగినవి.

'ఇస్ మెహఫిలె కైఫొ మస్తీ మేం ఇస్ అంజుమనె ఇర్ఫానీ మేం' (ఈ మత్తయిన, ఆనందపు గోష్టిలో, ఈ మేధోపరమైన సమావేశంలో)/ 'సబ్ జామ్ బకఫ్ బైఠే హీ రహే, హమ్ పీ భీ గయే ఝుల్కా భీ గయే' (అంతా చేతుల్లో మధుపాత్రలతో కూర్చుని ఉన్నారు. నా తాగుతున్నాను. పాత్ర నుంచి తొణికేలా చేస్తున్నాను) మఖ్దూం రాసిన పంక్తులు చూడండి. ఈయన కూడా అభ్యుదయ రచయితల్లో ముఖ్యమైన కవి.

'కోహె గమ్ ఔర్ గిరాం ఔర్ గిరాం ఔర్ గిరాం' (కష్టాల కొండ మరింత బరువు అయిపోతోంది)/ 'గమ్ జదోం తీషా చమ్కావ్ కె కుఛ్ రాత్ కటే' (దుఃఖితులారా పారలకు పదునుపెట్టి మెరిపించండి. కాస్త రాత్రి గడుస్తుంది)ఈ కవిత్వం కల్లోలపరిస్థితుల్లో అప్పటి సమాజాన్ని ఉద్దేశించి రాసిన కొత్త అభివ్యక్తి. ఈ కవిత్వంలో పాత ప్రతీకలు మారిపోయాయి. మఖ్దూం రాసిన కవితలో తీషా (పార) సంప్రదాయక ప్రేమ కవితలో ఆత్మహత్య సాధనం. కాని మఖ్దూం దాన్ని కార్మికులకు వెలుగు అంటే విజయాన్ని సాధించే సాధనంగా ప్రతీకించాడు. నిజానికి ఇలా ప్రతీకల రీ డిఫైన్ చేయడం అన్నది ఇక్బాల్ ప్రారంభించాడు. అభ్యుదయ రచయితలు దాన్ని మరింత ముందుకు తీసుకుపోయారు. కొత్త కొత్త సింబల్స్ ఉపయోగించడం ప్రారంభించారు. ఉర్దూ కవులు, రచయితలు స్వతంత్రపోరాటంలో తమదైన పాత్ర పోషించడమే కాదు, సామాజిక ఉద్యమాల్లోను ఉర్దూ కవిత్వం కీలకపాత్ర పోషించింది. మొన్న జవహర్ లాల్ నెహ్రూ యూనివర్శిటీ విద్యార్థి ఆందోళనల్లోను ఫైజ్ రాసిన బోల్ కే లబ్ ఆజాద్ హై కవితయే ప్రతిధ్వనించింది.

గ్రహణం విడిచింది

సూర్యునికి భూమికి మధ్య
చంద్రుడు వస్తే సూర్యగ్రహణం
పురుషాధిక్యానికి మతానికి మధ్య
ఒక చాంద్‌కా తుక్డా వస్తే సమానత్వం !

ఇంతకాలం
శిల్పాన్ని ఉలులతో చెక్కి బండరాయిని చేశారు
హరిణ వనాన్ని పులులతో నింపి హింసాకాండ
పెంచారు
పూలు, పండ్లు కోసుకుంటూనే తల్లివేరును
కుళ్ళబొడిచారు
జంటగా వున్న మహిళ సైతాన్ మంత్రగర్జనతో
క్షణంలో ఒంటరిగా మారిపోయింది.

కుటుంబ ఉగ్రవాదం రక్తం కళ్ళ చూసింది
అందరూ వుండి అనాథలైన పిల్లల కన్నీళ్ళను
తన తడి చూపులతోనే తుడిచేసింది
అగాధంలోకి నెట్టి వేయబడుతున్నప్పుడు
ఆశావాదం ఉతకగ్రగా లేచి నిలబడింది
ఉరి బిగుస్తున్నవేళ యుద్ధనాదం చేసింది

ఒక్కబాణం నాటుకున్న హంసను
కాపాడింది సిద్ధార్థుని జీవకారుణ్యం
మూడు బాణాల ముప్పేట హింసను
దునుమాడింది సుప్రీం ధర్మాసనం

అమ్మంగి వేణుగోపాల్
9441054637

వినాయకా మానాయకా!



వినాయకా నమస్కారం
వీధివీధినా వెలసిన
మహానాయకా నమస్కారం

నీ రాకతో చిన్నాచితకా
నేతలకు ఎంతపని కలిగిందో
నీ నెపంతో నాగరికులు
ఎన్నెన్ని తమాషాలు చేస్తున్నారో !

పెద్ద పెద్ద విగ్రహాలు
వింతవింత వేదికలు
ఇవేవీ కావు వారి భక్తికి సంకేతాలు
ఇవి ఆ వాడ లోకుల వైభవానికి ప్రతీకలు

ఫ్యాషన్‌గా పూజించే వాళ్లు కొందరైతే
రేషన్ కోసం పూజించే వాళ్లూ ఉన్నారు
హైటెక్ ఆడంబరాల నీడలో
అమాయకులూ, అన్నార్తులూ ఉన్నారు.

గణపతీ కాలం మారింది
కంప్యూటర్ రాజ్యం వచ్చేసింది
పదేండ్ల క్రింది నాయకున్ని
నీవు గుర్తుపట్టలేవు
మా నాయకుల ముందు నీ లెక్కే లేదు

ఏ నాయకున్ని ఎలా పూజించాలో
తెలివి గల నాగరికులకు తెలుసు
అమాయక జనాలకు మాత్రం
ఎప్పటికీ నీవే దేవుడవు నిజం

కాళిదాసు. జి
8686706463

బిసి వాదం – బహుజన్



డా. చింతం ప్రవీణ్
9346886143

సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలకు సంబంధించిన వాదాల గురించి మాట్లాడుకున్నప్పుడు స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, ప్రాంతీయవాదం తదితర వాదాల పేర్లు వాడుకలో ఉన్నాయి. పైన పేర్కొన్న వాదపు నామం వినగానే ఆ యా సమూహాలకు సంబంధించిన అస్తిత్వపు తాలూకూ భావజాల చర్చ మన మదిలో మెదులుతుంది. ఇదంతా సరే..,కానీ వాట్ అబౌట్ బి.సి? బి.సిలకు సంబంధించి ఏ పదం (ఏ టర్మినాలజీ) వారివారి అస్తిత్వాన్ని తెలియజేస్తుంది? ఏ పదంతో బి.సిలు ఐడెంటిఫై అవుతున్నారు? అని చర్చించడం..,ఈ అంశాన్ని చర్చకు పెట్టడం ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం. అసలు బి.సిలకు సంబంధించి...ఫలానా పదం బి.సిల కొండగుర్తుగా ఉందా?..ఆ పదం పలకగానే ఓ ఇది బి.సిల గురించిన,బి.సి సమూహం గురించిన పదం అని తెలియజేసే పదం ఏదైనా ఉందా అనే ప్రశ్నలు అస్తిత్వోద్యమాల్లో తరచూ ఎదురయ్యే ప్రశ్న. అయితే అది కేవలం 'బహుజన్' మాత్రమే అని కొందరు..,మహాజన్ అని కొంద రు.., బహుజన్ అంటే ఎస్సీ,ఎస్టీ,బి.సి,మైనారిటీలందరు అని అన్నప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి లంటే దళిత్‌గా ఐడెంటిఫై అవుతున్నారు..,మైనారిటీలంటే కూడా ఒక సమూహం అని ఐడెంటిఫై అవుతున్నారు.., ముఖ్యంగా దళితులు రాసిందే దళిత సాహిత్యం అని దళిత కవులు బహిరంగంగా ప్రకటించుకున్నారు కనుక బహుజన్ అంటే బి.సియేననే వాదనలున్నాయి.

అసలు 'బహుజన' అనే పదం ఎక్కడినుండి వచ్చింది అని ఆలోచిస్తే భారతదేశ అస్తిత్వోద్యమాల ఆద్యుడు బుద్ధుడు నోటి నుండి వెలువడిన పదం ఇది. 'బహుజన హితాయః బహుజన సుఖాయః '. ఆయన వాక్కు ప్రకారం ''బహుజనుల హితం కోసం బహుజనుల సుఖం కోసం'' అనే అర్థం స్ఫురిస్తుంది. ఆయన కాలంలో బ్రాహ్మణ ఛాందస మనువాద భావజాలం వలన ఇబ్బంది పడ్డ వారందరూ బహుజనులే. మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఈ దేశంలో ఉన్న అనార్యులు అందరూ బహుజనులే. అంటే ఇప్పటి శూద్రులు, అతి శూద్రులందరూ బహుజనులే. అయితే కాలక్రమంలో దీని అర్థం మారుతూ అర్థ సంకోచం జరిగిందనేది అస్తిత్వోద్యమాలు చెప్పిన వాస్తవం.

బుద్ధుడి తర్వాత పూలే, సాహూ, బాబాసాహెబ్ కాలం దాటి మాన్యశ్రీ కాన్షీరాం దగ్గరకు వచ్చేసరికి బహుజన్ అనే పదం ఈ దేశ మూలవాసులందరికీ వర్తించే పదంగా మారింది. కాన్షీరాం దృష్టిలో ఈ దేశ మూలవాసులంందరిని ఎస్‌సి, ఎస్‌టి, బి.సి, మైనారిటీలందరిని రాజ్యాధికారం దిశగా తీసుకుపోయే క్రమంలో వీరందరిని ఒక త్రాటిపైకి తీసుకొచ్చే క్రమంలో వాడినదే బహుజన్. అయితే ఇక్కడ బహుజన్ అనే దాన్ని భావజాలపరంగా రాజకీయార్థంలో చూడాల్సి ఉంది. అయితే కొందరి వాదన ఇలా ఉంది. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు ఉన్నాయి...కాని బిసిలు ఈ దేశంలో అత్యధికులుగా(బహుజనులుగా) ఉన్నప్పటికీ వారికి రాజకీయ రిజర్వేషన్లు లేవు..,జనాభా దామాషా ప్రకారం వారి వాటా వారికి దక్కట్లేదు...చట్టసభల్లో వారికి నిర్ణయాధికారంలో వారికి గొంతుక లేదని..,వారికి రాజకీయ గొంతుకనివ్వాలనే ఆశయంతో బహుజన్ సమాజ్ పార్టీ ఏర్పాటు చేసాడనేది కొందరి వాదన.

సాహిత్యానికి సంబంధించి దృష్టి పెడితే 1990లో ఏర్పాటైన ద.ర.క.మే. (దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక),ఆ తర్వాత 1995లో వెలువడిన చిక్కనవుతున్న పాట,1996 పదునెక్కిన పాట వరకు దళితులంటే ఎస్‌సి, ఎస్‌టి, బి.సి, మైనారిటీలందరు అనే సామూహిక భావజాలం ఉండేది. అప్పుడు ఎస్‌సి, ఎస్‌టి, బి.సి,మైనారిటీలందరు కూడా దళితులుగా ఐడెంటిఫై అవ్వడానికి ఏ ఇబ్బంది పడలేదు. ఆ తర్వాత ప్రపంచీకరణ ప్రభావంతో ఎవరి బతుకులు వారివే అనే సంకుచిత స్వభావం ఏర్పడడం.., కారంచేడు, చుండూరు ఘటనల తర్వాత అసలు దళితులు ఎవరు అనే చర్చ విపరీతంగా జరిగింది.

అప్పటిదాకా ద.ర.క.మే అందించిన భావజాల స్ఫూర్తిదాయకమే ప్రచురించిన వందలాది పుస్తకాల్లో.., చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట సాహిత్యం వరకు బి.సిలు కూడా దళితులుగానే ఐడెంటిఫై అయ్యారు. ఈ సందర్భంలోనే సతీష్‌చందర్, శిఖామణిలాంటి కవులు 'దళితులు రాసిందే దళిత సాహిత్యంఅని దళిత కవులు బహిరంగంగా ప్రకటించుకున్నారు'. అక్కడ మొదలైన డీవియేషన్ కేవలం దళిత అనే అర్థాన్నే కాదు.., బహుజన అనే పదానికున్న అర్థాన్ని కూడా మరొక్కసారి ఆలోచించేలా చేసింది. ఈ సందర్భంగానే బి.సిల ఐడెంటిఫై నామంగా బహుజన్ అనే పదాన్ని ఖాయం చేసారు చాలా మంది. సాహిత్యంలో బహుజన జీవితాలు అంటే బి.సి జీవితాలు అని తేల్చిపారేసారు బహుజనతత్వవేత్త బి.ఎస్.రాములు.

మొత్తంగా..,బహుజన్ అంటే ఎస్‌సి, ఎస్‌టి, బి.సి, మైనారిటీలందరు అని రాజకీయార్థంలో ఉన్నప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిలంటే దళిత్‌గా సాహిత్యంలో, సామాజికంగానూ, రాజకీయంగాను ఐడెంటిఫై అవుతున్నారు.., మైనారిటీలంటే కూడా ఒక ప్రత్యేకమైన సమూహం అని ఐడెంటిఫై అవుతున్నారు. కను కబి.సిలంటే బహుజనులుగా ఎందుకు ఐడెంటిఫై కాకూడదు అనే అంశంపై చర్చ జరగవలసిన అవసరమున్నది.

కవితలకు ఆహ్వానం

గరగపర్రు – వెలిని నిరసిస్తూ 'పోరు గరగపర్రు' కవితా సంకలనం తీసుకురానున్నాం. ఇందుకోసం కవుల నుంచి 20 పంక్తులకు మించని కవితలను ఆహ్వానిస్తున్నాం. ఆగస్టు 30 లోపు కవితలను apbarave@gmail.com ఇ మెయిల్‌కు ఓపెన్ ఫైలు, పిడిఎఫ్ ఫైల్ పంపాలని మనవి. మరిన్ని వివరాలకు కవి, సంకలనకర్త నేలపూరి రత్నాజీని 9494423787, 9848187416 నంబర్లలో సంప్రదించవచ్చు.

బహుజన రచయితల వేదిక

ఉప్పెన

అప్పుడప్పుడే లోకంలో
విహరిస్తున్న తరుణం,
రెక్కలకు అడ్డుతగిలిందొక
బహిరంగ రహస్యం!

దూరముంచలేని తోడై
ఓదార్పునివ్వని స్నేహమైంది!
కన్నీటి రక్తాన్ని తనలో దాచుకొని
పరాయి నేస్తమైంది!

ఉదరంలో రణం మొదలై
దేహమంతా కుంచించుకుపోయి
అణువణువూ అల్లాడిపోతుంటే
అసలే చీకటి ఆపై గబ్బిలాల దాడి!
వినబడదెవరికీ మా ఆర్తనాదం
నినాదమై పిడికిలెత్తేదాక!

మాకెందుకీ శిక్ష... ఎవరిదీ కక్ష..?
ప్రతి నెలా మళ్లీ మళ్లీ పుట్టినట్లే
బతికుండగానే ఎన్నెన్ని చావులో!
మరణాల దారుల్లోనే మా పయనం
మారణాయుధాల్లేని హోమం
అదే మా స్త్రీ జాతి సహజ గుణం!

ఇప్పుడిప్పుడే పురోగమిస్తుంటే
మళ్లీ గుడ్డలకై తిరోగమించాలా!
మా పేదల గుండెల్లో గునపాలై
పన్నుల గాయాలు కలిగిస్తే!
మీ గుడ్డలూడగొట్టేందుకు సిద్ధం
మీ పీఠాలు కదిలించేందుకు సన్నద్ధం!

(శానిటరీ నాప్కిన్‌లపై
పన్నును నిరసిస్తూ)

పుట్టి గిరిధర్, 9491493170

కిటికీ

ఆవల ప్రపంచం
బహిర్గతం
అందరికీ అందుబాటులో
కిటికి ఇవతల
ఇరుకిరుకు
రహస్యం
విప్పితేనే బట్టబయలు
జీవితం
కిటికి ఆవల ఇవతల
అనుసంధానం
రెప్పపాటులో వ్యత్యాసం

గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

కలవాలి

ఎవరినయినా 'మనిషి' ని
ఒకసారి కలిసి రావాలి
ముందు నేనే / నాలుగు అడుగులు వేసో
నాలుగు గుమ్మాలు దాటో
ఊర్లు అడవులూ, ఎడార్లూ
దాటయినా సరే నేనొక్కసారి ఆ మనిషిని
కలిసే రావాలి / చేతిలో చెయ్యేసి
చూపుల్ని కలిపేసి
నా ఒంటరి తనాన్ని కొంత వొంపు కోవాలి
అతని లోని వొంటరితనాన్ని
ఎంతో కొంత వెంటేసుకు రావాలి.

వారాల ఆనంద్
9440501281

చిన్న కథల పోటీకి ఆహ్వానం

సోమేపల్లి 10వ సాహితీ పురస్కారం కోసం చిన్న కథల పోటీని నిర్వహిస్తున్నారు. కాగితానికి ఒకవైపుకే రాత ప్రతిలో రెండు నుండి ఐదు పేజీలలోపు డిటిపిలో రెండు పేజీలు మాత్రమే పంపాలి. హామీ పత్రం, రచయిత వివరాలు వేరే కాగితంపై రాయాలి. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. విజేతలకు వరుసగా రూ. 2500/, రూ. 1500/, రూ. 1000/ మరో ఇద్దరికి ప్రత్యేకంగా రూ. 500/ చొప్పున బహుమతులు ఇస్తారు. సెప్టెంబర్ 30తేదీ లోపు 'రమ్య భారతి, పి.బి.నెం. 5, 11–57/1–32, జె.ఆర్ కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ – 520001కు పంపాలి. వివరాలకు 9247475975

కథానిక - పద్యకవితల పోటీ 2017


రంజని – నందివాడ భీమారావు కథానికల పోటీని నేటి నిజం సౌజన్యంతో, రంజని – విశ్వనాథ పద్య కవితల పోటీని ఎ. సత్యవర్ధన సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. తెలుగువారి జీవితం , సంప్రదాయాల ఆధారంగా రాతప్రతిలో 10 పేజీలు మించని కథానికలను , 13 మించకుండా స్వేచ్ఛాఛందస్సులో పద్యాల్ని పంపాలి, ఎవరెన్ని శీర్షికలనైనా పంపవచ్చును. కథానికలకు 4వేలు, 3 వేలు, 2 వేలు, వెయ్యి రూపాయలు గానూ పద్య కవితలకు 2 వేలు , 1500 చొప్పున ఏడుగురికి, బహుమతులుంటాయి. ఆఖరు తేది ఆగస్టు 30 , చిరునామా , ప్రధాన కార్యదర్శి, రంజని, తెలుగు సాహితీ సమితి, ఏజీ ఆఫీసు, హైదరాబాద్, వివరాలకు : మట్టిగుంట వెంకటరమణకు 8374822255 సెల్లో సంప్రదించవచ్చు.

అభాగ్య జీవులు – అస్తిత్వాల గ్రంథం



డా. రాయారావు సూర్యప్రకాశరావు
9441046839

నాలుగు పదుల కాలమైనా గడపకుండానే మరణించిన గొప్ప రచయిత ఫ్రాంజ్ ఫనాన్. ఫ్రెంచి వలస ప్రాంతం కరీబియన్ ద్వీపమైన మార్టినిక్‌లో 1925లో జన్మించిన ఈ రచయిత అల్జీరియాలో మానసిక వైద్య నిపుణుడిగా పనిచేశారు. అల్జీరియా విప్లవ ప్రారంభంతో అల్జీరియా జాతీయ విముక్తి ఫ్రంట్‌లో చేరిన ఆయనను ఫ్రెంచి ప్రభుత్వం అల్జీరియా నుండి బహిష్కరించింది. అల్జీరియా విప్లవకారుల తాత్కాలిక ప్రవాస ప్రభుత్వంలో ఘనాకు రాయబారిగా పనిచేసిన మేధోజీవి ఫ్రాంజ్ ఫనాన్. వలసవాదం గురించి, జాత్యహంకారం గురించి సిద్ధాంతాలను రూపొందించిన తాత్త్విక చింతనాపరుడు ఆయన. లుకేమియాతో బాధపడుతూ ఉన్న దశలో ఆయన రాసిన గొప్ప పుస్తకం 'రెచెడ్ ఆఫ్ ది అర్త్'. ప్రపంచవ్యాప్తంగా చాలా సంచలనం సృష్టించిన పుస్తకమిది.



ఫ్రెంచి భాషలో ఫ్రాంజ్ ఫనాన్ రాసిన ఈ పుస్తకాన్ని రిచర్డ్ ఫిల్‌కాక్స్‌ఆంగ్లంలోకి అనువదించా రు. ఎన్.రవి, బి. అనురాధ 'అభాగ్య జీవులు' అనే పేరుతో తెలుగులోకి తర్జుమా చేశారు. విరసం ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

ప్రచురణకర్తలు తమ ముందుమాటలో పేర్కొన్నట్టు 'మన సమాజంలోని కులవివక్షతో సారూప్యత కలిగిన జాతి వివక్ష పట్ల ప్రజలకు ఉండాల్సిన దృక్పథాన్ని ఫనాన్ రాసింది అస్తిత్వ ఉద్యమాలకు, ఆత్మ గౌరవ ఉద్యమాలకు, దళిత ఉద్యమాలకు, కుల నిర్మూలన ఉద్యమాలకు, విప్లవోద్యమానికి ఎంతో ఉపయోగం'. జాతీయ పోరాటంలోకి రైతాంగ ప్రవేశం పట్ల జాతీయవాద పార్టీల స్పందన ఎలా ఉంటుందనే విషయంలో ఆసక్తికరమైన చర్చ చేస్తారు ఫనాన్. అధికశాతం జాతీయవాద పార్టీలు ప్రజల ప్రతిఘటన కొనసాగాలని ఆశిస్తాయి. ప్రజలకు రాజకీయ పరిజ్ఞానాన్ని అందించే చొరవ రాజకీయ పక్షాలు తీసుకోవని ఆయన విమర్శ. ప్రజా చైతన్యాన్ని వృద్ధి చేసి, పోరాటాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోవాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు చేపట్టడం ఆయా రాజకీయ పక్షాలు చేయవని రచయిత పేర్కొంటారు. ఈ మాట మన సమాజంలోనూ నిజం. జాతీయవాద రాజకీయ పక్షాల ఆలోచనావిధానం అంతా జాతీయవాదం చుట్టూ పరిభ్రమిస్తుంటుందంటారు ఫనాన్. మిగిలిన అన్ని విషయాలను ఆ పక్షాలు గాలికి వదిలేస్తాయని ఆయన అభిప్రాయం. ఒక సుస్పష్ట ఆర్థికవిధానం ఈ పార్టీలకు ఉండదని విమర్శిస్తారు. ఈ వాస్తవమూ దేశాలతో నిమిత్తం లేకుండా సర్వత్రా నెలకొన్నదే.

సాయుధ పోరాటం అనంతరం అప్పటిదాకా పోరాటంలో నిమగ్నమైన ఉద్యమకారుడి కర్తవ్యమేంటనేది ఒక ప్రశ్న. దీనికి కూడా ఫనాన్ సమాధానం చెప్తారు. సాయుధ పోరాట కాలంలో దేశానికి అంటి పెట్టుకుని ఉన్న విధంగానే దేశ నిర్మాణ కాలంలోనూ తన రోజువారీ ఆచరణలో భాగంగా దేశాన్ని అంటిపెట్టుకుని ఉండాలని ఆయనంటారు. నిరంతరం దేశపు గతితార్కిక సత్యాన్ని మూర్తీభవించాలి. ఒక వంతెన కట్టడంలో కట్టే వారి చైతన్యం పెరగకపోతే అటువంటి వంతెన కట్టవద్దని ఆయన సలహా ఇస్తారు. దేశ నిర్మాణం కూడా కృత్రిమ పద్ధతుల్లో జరగరాదని నిక్కచ్చిగా చెప్తారు ఫనాన్. ''పెద్ద పెద్ద యంత్రాలతో వంతెనను అక్కడ తెచ్చిపెట్టద్దు. వంతెన నిర్మాణం పౌరుల మెదళ్లూ, కండరాలతో జరగాలి. ఆర్కిటెక్టులు, ఇంజనీర్ల అవసరం పడొచ్చు. అది కూడా విదేశీయులైన వాళ్ల అవసరం పడొచ్చు. అయినా స్థానిక పార్టీ నాయకులు ఏం చేయాలంటే ఆ సాంకేతిక పరిజ్ఞానం పౌరుల మెదళ్లలోకి పూర్తిగా ఇంకేలా చూడాలి''. ఉద్యమానంతరం పోరాట యోధుడి కర్తవ్యాన్ని కూడా సుస్పష్టంగా పేర్కొన్న ఫ్రాంజ్ ఫనాన్ నిర్దేశాలు ఆచరణీయం. తెలుగు అనువాదం బాగుంది. మాతృకలోని దీర్ఘవాక్యాలను సమర్థవంతంగా తెలుగులోకి తేగలిగారు. అయితే తెలుగుకు విరుద్ధమైన యత్తధర్తక వాక్యాలు అక్కడక్కడా కన్పిస్తాయి. ఉదాహరణకు 93వ పేజీలో ఒక వాక్యం 'పాశ్చాత్య దేశాలు మనలను ఏ స్థితిలో ఉంచదలుచుకున్నాయో దానిని మనం తిరస్కరించాలి'. ఇటువంటి వాక్యాలను పరిహరిస్తే అనువాదం ఇంకా బాగుండేది. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఈ గొప్ప పుస్తకాన్ని తెలుగులోకి తెచ్చిన విరసంకు అభినందనలు. మంచి పఠనీయ శైలితో అనువదించిన అనువాదకులు అభినందనీయులు.

'అభాగ్య జీవులు', అనువాదకులు : ఎన్.రవి, బి. అనురాధ; ఫ్రెంచి మూలం 'రెచెడ్ ఆఫ్ ది అర్త్', రచయిత ఫ్రాంజ్ ఫనాన్, పుటలు : 272, వెల : రూ. 170, ప్రచురణ : విరసం, ప్రతులకు : డి.వి.రామకృష్ణారావు, ఎం.ఐ.జి. 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ 40.



మన తెలంగాణ

5

హైదరాబాద్

సోమవారం

28, ఆగస్టు, 2017

www.manatelangana.news



కొంటె ప్రశ్న – తుంటరి జవాబు

సోషల్ పల్

- చలికాలంలో ఐస్‌క్రీం తింటే ఏమవుతుంది?
  - కప్పు ఖాళీ అవుతుంది
- నిమ్మకాయను కోసి రసమెందుకు పిండుతారు?
  - తొక్కతీస్తూ కూర్చుంటే టైం వేస్టు కనుక
- రెండు మామిడి పళ్ళను ముగ్గురు ఎలా పంచుకోవాలి?
  - రసం తీసి
- గుడికి వెళ్ళినప్పుడు బొట్టు దేనికి పెట్టుకుంటారు?
  - మొహానికి
- సెల్‌ఫోన్ పోతే ఏమవుతుంది?
  - ప్రశాంతంగా ఉంటుంది.
- రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు ఎందుకు?
  - డ్రైవర్‌ను నిద్రలేపేందుకు.
- బస్సులో ఎంతమంది కూర్చోవచ్చు?
  - పట్టినంతమంది.
- ఆఫ్రికన్ గిరిజన్లు అరటిపండు ఎలా తింటారు?
  - తోలు ఒలుచుకొని.
- నిద్రలో మంచం మీద నుంచి పడితే ఏమవుతుంది?
  - మెలకువ వస్తుంది.



ప్రైవసీ హక్కు వీరే దిక్కు



వ్యక్తిగత గోప్యత పౌరుల ప్రాథమిక హక్కు అని సుప్రీకోర్టు ఏకకంఠంతో ఎలుగెత్తి చెప్పి దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. చాలాకాలం తర్వాత సుప్రీం ఏకగ్రీవ తీర్పుచెప్పి ప్రజల హర్షద్వానాలు అందుకుంది. ఆధార్‌కార్డ్‌ను అమెరికా గ్రీన్‌కార్డుస్థాయి కార్డులా చిత్రీకరించి 125 కోట్ల భారతీయులను నాలుగుదిక్కులకు పరుగులెత్తిస్తున్న కేంద్రనాయకులకు ముకుతాడు వేయడం వెనక ఇద్దరు మహిళల తెగింపు ఉంది. వ్యక్తిగత సమాచారాన్ని బట్టబయలు చేయడంలో అధికారులు చూపుతున్న ఉత్సాహానికి బ్రేకులు వేసి కేంద్రప్రభుత్వాన్ని, దాన్ని నడిపే పాలకులను డిఫెన్స్‌లో పడేశారు. కేంద్రాన్ని నిర్భయంగా సవాల్ చేయడంలో వారికున్న ప్రతిభా పాటవాలు మరోసారి రుజువయ్యాయి. ఈ అద్భుతానికి మూలకారణమైన వారిలో ప్రధానమైన వ్యక్తి మెగసెసె అవార్డు గ్రహీత శాంతాసిన్హా కాగా మరొకరు ప్రముఖ సామాజిక కార్యకర్త అరుణరాయ్. హక్కుల పోరాటాలు చేయడంలో దిట్టలు ఈ ఇద్దరు. శాంతాసిన్హా హైదరాబాదీకాగా, అరుణరాయ్ చెన్నయ్‌వాసి. దక్షిణాదికి చెందిన ఈ ఇద్దరూ కేంద్రప్రభుత్వ చర్యలు నిలదీయడంలో తమకున్న శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించారు. ఆధార్‌కార్డు పేరుతో అనేక సంస్థలు, ప్రభుత్వరంగ కార్యాలయాలు వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకోవడం, టార్గెట్ చేసినట్టుగా అధికారాన్ని వినియోగించడాన్ని వీరు తప్పుపట్టారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎలాగైనా తెలుసుకోవచ్చునని, అది హక్కుకిందికే రాదన్న గుడ్డితనంలో ఉన్న కేంద్రపాలకుల మెడలు వంచి అది కూడా హక్కేనని తెలియజెప్పడంలో వీరు కృతకృత్యులయ్యారు. రాజ్యాంగాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వక్రభాష్యాలు చెప్పడానికి వీల్లేకుండా ప్రతీ ఒక్కరూ ఒళ్ళు దగ్గరపెట్టుకుని వ్యవహరించాలన్న సలహా కోర్టు ద్వారా కేంద్రంలోని పెద్దలకు ఇప్పించారు.

శాంతా సిన్హా

బాలల హక్కుల కార్యకర్త, మెగసెసె అవార్డు గ్రహీత, జాతీయ బాలల హక్కుల కమీషన్ చైర్ పర్సన్ (మాజీ) ప్రొఫెసర్ శాంతా సిన్హా ఈ కేసులో పిల్ దాఖలు చేశారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ గర్ల్స్ స్కూల్, కీస్ హైస్కూల్‌లలో పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఉస్మానియా యునివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పిజి పూర్తిచేశారు. జెఎన్‌యు నుంచి పిహెచ్‌డి అందుకున్నారు. భారత ప్రభుత్వంచే పద్మశ్రీ, అసోచామ్ లేడీస్ లీగ్ సమాజ సేవలో అందించిన హైదరాబాద్ వుమెన్ ఆఫ్ ద డికేడ్ ఎచీవర్ అవార్డు అందుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని దాదాపు 500 గ్రామాల్లో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం హక్కుల కార్యకర్తగా తన విజయాన్ని సూచిస్తుంది. తన సేవలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం శాంతాసిన్హాను ఎన్‌సిపిసిఆర్‌కు మొదటి చైర్ పర్సన్‌గా నియమించింది. మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్‌ను స్థాపించి ఒంటరి మహిళలు, పిల్లల హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ నంబరును తప్పనిసరి చేయడాన్ని సవాలు చేస్తూ ఈ సంవత్సరం మే నెలలో పిల్ వేశారు. రాజ్యాంగం అందించిన జీవించే హక్కుకు ఇది భంగకరం అని అంటూ, వ్యక్తిగత గోప్యత అనేది ప్రతి పౌరుని గౌరవానికి సంబంధించిన వ్యవహారం అని శాంతా సిన్హా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తీర్పు వెలువడిన తర్వాత ఇది చరిత్రాత్మకమైనదని, పేదల బతుకులకు భరోసా ఇచ్చేలా సుప్రీంకోర్టు వ్యవహరిస్తుందని తన ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

అరుణ రాయ్

చెన్నైలో పుట్టి ఢిల్లీలో పెరిగారు. ఢిల్లీ యూనివర్సిటీ ఇంద్రప్రస్థ కాలేజీలో ఇంగ్లీష్ లిటరేచర్ పూర్తి చేశారు. భారత సివిల్ సర్వీస్‌లో ఐఎఎస్ అయిన అరుణ రాయ్ సామాజిక కార్యకర్తగా మారారు. పేదల పక్షాన పోరాడేందుకు సోషల్ వర్క్, రీసెర్చ్ సెంటర్‌లో చేరారు. శంకర్ సింగ్, నిఖిల్ డేతో కలిసి మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ స్థాపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ ఈ సంస్థ పోరాడుతోంది. ఇంకోరకంగా చెప్పాలంటే రైట్ టు ఇన్ఫర్మేషన్ మూమెంట్ లీడర్‌గా అరుణ సుపరిచితం. వీరి పోరాట ఫలితంగానే 2005లో రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఏర్పడింది. ఇవే కాకుండా రైట్ టు వర్క్, రైట్ టు ఫుడ్ లపై పోరాడుతున్నారు. పెన్షన్ పరిషత్ సభ్యురాలిగా అసంఘటిత కార్మికులకు పెన్షన్ అందించాలని పోరాడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని ప్రశ్నించారు. వారి వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలుచేసే బాధ్యత ప్రభుత్వానికుండాలని వీరు వాదించారు. ఆధార్ తప్పనిసరి చేయడం వ్యక్తిగత గోప్యతకు, జీవించే హక్కుకు భంగకరం అని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలనుంచి పేదలను క్రమంగా తప్పించే ఆధార్‌నుంచి వారిని రక్షించాలని సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతోనైనా ప్రభుత్వం ఆధార్‌ను తప్పనిసరి చేయడంపై ఆలోచించాలని అన్నారు.

అందాల సుందరి ఈ మాజీ ఆఫీసర్





ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని అధిగమించి విజయతీరాలకు చేరిన షాలినీ సింగ్ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 23 సంవత్సరాలకే భర్త మరణించినా ఆమె జీవితంలో ఎదురైన కష్టాలు చూసి అధైర్యపడలేదు. భర్త మరణించినప్పుడు ఆమెకు రెండేళ్ల బాబు కూడా ఉన్నాడు. మొక్కవోని ధైర్యం, దృఢ నిశ్చయం, పట్టుదల ఆమెను ఆర్మీ ఆఫీసర్ నుండి మిసెస్ ఇండియా 2017 అయ్యేలా చేశాయి. 19 ఏళ్ల వయసు ఉన్నప్పుడు షాలిని అవినాష్‌ను పెళ్లి చేసుకున్నారు. అవినాష్ ఆర్మీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేవాడు. 2001సెప్టెంబర్ 28న కాశ్మీర్‌లో ఉగ్రవాదులపై జరిగిన దాడిలో అవినాష్ తీవ్ర గాయాలపాలై, చివరికి తన ప్రాణాలను దేశానికి అర్పించి, అమరుడయ్యాడు. అప్పుడు ఆమెకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో షాలిని మానసిక ఒత్తిడికి గురై, ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. తన కొడుకే బలం అనుకొని, తన బాబు జీవితం కోసం ధైర్యంతో ముందుకు సాగారు. భర్త ఉన్నప్పుడు షాలిని ఉన్నత చదువులు చదువుకోవాలని భావించారు. భర్త మరణంతో ఒంటరిగా అయిన ఆమె తన బాబు కోసం ఆలోచించేవారు. పోస్టుగ్రాడ్యుయేషన్ చదివిన షాలిని ఆర్మీలో జాయిన్ కావాలని నిర్ణయించుకున్నారు. భర్త మరణించిన తర్వాత అలహాబాద్‌లోని సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బి)కి దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల పాటు గంటలపాటు బోర్డు అధికారులు ఇంటర్వ్యూ చేసేవారు. ఆ సమయంలో ఆమె కొడుకును షాలిని తల్లిదండ్రులు చూసుకునేవారు. ఇంటర్వ్యూలో విజయం సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో షాలిని పట్టుదల చూసి ఆర్మీ అధికారులు చూపిన ప్రశంసలు ఆమెకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. ఉద్యోగ శిక్షణ కోసం మార్చి, 2002లో ఆరు నెలల పాటు ఆమెను చెన్నైలో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (OTA)కి పంపించారు. తన భర్త మొదటి సంవత్సరానికి కొద్దిరోజుల ముందు అంటే 2002 సెప్టెంబర్ 07న ఆమె భారతదేశ సైన్యంలో అధికారిగా బాధ్యతలు చేపట్టారు. తన భర్త కీర్తి చక్ర అవార్డును షాలిని రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం చేతుల మీదుగా అందుకున్నారు.

షాలిని భారతీయ సైన్యంలో ఆరు సంవత్సరాల పాటు దేశానికి సేవ చేశారు. ఆమె ప్రస్తుత వయస్సు 40 సంవత్సరాలు. షాలిని బాబుకు 17 ఏళ్ల వయసు ఉన్నాడు. షాలిని కుటుంబం ఢిల్లీలో సెటిలైంది. ఆమె ఇప్పటికి ఎన్నో ఉన్నత లక్షణాలను నిర్దేశించుకొని వాటిని చేరుకుంటూ తన విజయాల కిరీటంలో వెలకట్టలేని ఎన్నో విజయాలను అందుకుంటూ ముందుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో షాలిని 'మిసెస్ ఇండియా 2017 క్వీన్ ఆఫ్ సబ్‌స్టెన్' కిరీటం అందుకున్నారు కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమె జీవితం ఒంటరి తల్లిదండ్రులకు ప్రేరణగా మారిందని చెప్పవచ్చు. షాలిని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశంలో అనేకమంది మహిళలు విజయతీరాలకు చేరి, పలువురికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుందాం.

సమస్యలంటే భయమెందుకు



ఒకరికి సమస్య అయినది ఇంకొకరికి సమస్య కాదు. సమస్యలు మన భావాలకు, భయాలకు ప్రతిబింబాలు. మన దృష్టి కోణాన్ని బట్టి సమస్యలు పుట్టుకొస్తాయి. మనం ఎదుర్కొనే సమస్యలు చాలా వరకు అనాలోచిత పనులవల్లో తొందరపాటు నిర్ణయాల వల్లో వస్తాయి. సమస్యలకి కారణాలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యకుండా, అకారణంగా మన చుట్టూ ఉన్న వారి మీద నింద వేసి తప్పుకునే ప్రయత్నం చేస్తాము. సమస్య లేనప్పుడు కూడా ఉన్నట్టే ఊహించుకుని వర్రీ అయి పోతుంటాం ఒక్కోసారి. ఉదాహరణకి బయట స్నేహితులతో నడిచివెళ్తుంటే మన తలమీద పక్షి రెట్ట వేసిందనుకోండి. అది నామీదే వెయ్యాలా నాపక్కన ఇంతమంది నా స్నేహితులుండగా నామీదే పడాలా..అని తెగ ఇదైపోతాం. ఎందుకు పడింది..? నా రోజులు బాలేవా..? ఇదేమైనా అపశకునమా..? ఇలా సాగిపోతాయి మన ఆలోచనలు. వెనకటికి సరిగ్గా ఆలోచించే ఓ వ్యక్తి పిట్ట రెట్ట తలపై పడితే Thank God అన్నాడట. అదేంటి అని ఆశ్చర్యపడితే ఆ వ్యక్తి ElephanTs don't fly (ఏనుగును ఎగరకుండా చేసినందుకు) అని పూర్తి చేసాడుట. కాకతాళీయంగా జరిగిన సంఘటన అక్కడ సమస్య అయి కూర్చుంది.

ఏదైనా సమస్య వచ్చీ రాగానే వెనకాముందూ ఆలోచించకుండా బెంబేలు పడిపోయే కన్నా అసలది నిజంగా సమస్యేనా? అన్నది ఆలోచించుకోవాలి. చావు, అనారోగ్యం, పేదరికం ఇవన్నీ కూడా మన వైఖరిని బట్టి వాటితో మనం వ్యవహరించే తీరుని బట్టి మనని పీడిస్తాయి. కొంతమంది కొన్ని ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకుని తీవ్రంగా దెబ్బతింటుంటారు. మార్కెట్ పరిజ్ఞానం లేకుండా షేర్‌లు కొని నిండా మునిగిపోవచ్చు. ఎక్కువ వడ్డీకి ఆశపడి చిట్ ఫండ్స్‌లో పెట్టి మోసపోవచ్చు, అదుపులేని వేగంతో బండ్లు నడిపి ప్రాణం మీదికి తెచ్చుకోవడం కావచ్చు, ఇతరుల ప్రాణం తీయడం కూడా కావచ్చు. ఆగ్రహంలో ఉన్నపుడు మాటలు తూలడం కావచ్చు ఇవన్నీ మనకి సమస్యలు తెచ్చిపెట్టేవే. కొద్దిగా మనల్ని మనం అదుపులో పెట్టుకోవడం అనేది ఒక పద్ధతిగా అలవాటు చేసుకుంటే వీటన్నిటినుంచి బయటపడవచ్చు.

మన సామర్థ్యాన్ని మనం తక్కువగా అంచనా వేసుకోవడమే అసలు సిసలైన సమస్య. అందువల్ల మనం చేయగలిగిన సమస్యలు కూడా బ్రహ్మప్రళయాన్ని సృష్టిస్తుంటాయి.

ఏ సమస్యా అధిగమించలేనిది కాదు. ప్రతి సమస్యకీ బయటపడే మార్గం ఉంటుంది, అవేశపడకుండా, అందోళన పడకుండా డిప్రెషన్ లోకిపోకుండా ఆలోచించగల్గితే ప్రతీదీ పరిష్కారసాధ్యమే అవుతుంది. సమస్య నుంచి పారిపోవడం పరిష్కారం కాదు అది ఏదో ఒక రకంగా మనల్ని వెంటాడుతుంటుంది. కాబట్టి సమస్యకి భయపడి పోకుండా పరిష్కారం వెతికే ప్రయత్నం చేసినప్పుడు, సమస్యని మనం అధిగమించగల్గినప్పుడు మన ఆత్మ విశ్వాసం రెట్టింపవుతుంది

సమస్యలు ఒక్కో వయసులో ఒక్కో రకంగా ఉంటాయి. చిన్న పిల్లలకి చదువు తలతినేసేంత పెద్ద సమస్య. హోం వర్క్, క్రమ శిక్షణ ఇంటా బైటా వాయించేస్తుంటాయి.

పెద్దయ్యేప్పటికి, స్నేహాలు, అలవాట్లు, దుందుడుకుతనాలు, తుంటరి పనులు, అమ్మాయిలు అబ్బాయిల మధ్య ఆకర్షణలు, పోటీలు, చెడు అలవాట్లు, చెడు సావాసాలు, చదువు నిర్లక్ష్యం చెయ్యడం సమస్యలవుతాయి. ఇంకొంచం వయసు పెరిగితే పెళ్ళి, ఉద్యోగం, పిల్లలు, పెంపకం వగైరా వగైరా. ఇలా బ్రతుకులో ఏ స్టేజ్లో చూసినా సమస్యలు తప్పవు. పెద్దల కెన్ని సమస్యలున్నా పిల్లల సమస్యలేంటో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సహకరించకపోతే, అవి పెద్దల సమస్యలకి తోడయ్యే ప్రమాదం ఉంటుంది. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తే మన మార్గాన్ని సుగమం చేస్తుంది. మనల్ని సమస్యల బారిన పడకుండా కాపాడుతుంది. ఈర్ష్యా కోపం ద్వేషం లాంటివి మన స్నేహితుల్నీ బంధువుల్నీ దూరం చేస్తాయి.

అందుకని మనం చేయాల్సిన మొదటి పని అసలు సమస్య ఉందా, లేదా అన్నది తేల్చుకోవాలి. సమస్యంటూ అదేంటో తెలుసుకోవాలి. అసలు సమస్యేంటో తెలియకపోతే ఎన్ని విధాల ప్రయత్నించినా వృధాఅవుతాయి. కనుక మనం చేయాల్సింది..

1. సమస్యని గుర్తించడం.. అన్ని కోణాల్లోంచి అర్థం చేసుకోవడం
2. సమస్య పరిష్కరించడానికి పథకాన్ని తయారు చెయ్యడం
3. తయారు చేసిన పథకాన్ని అమలు చెయ్యడం
4. అమలు చేసిన పథకం వల్ల వచ్చిన ఫలితాలు ఎలా ఉన్నాయో బేరీజు వేయడం

సమస్యకి పరిష్కారం ఎప్పుడూ మన చేతుల్లోనే, మన ఆలోచనల్లోనే ఉండకపోవచ్చు. అప్పుడు నిపుణులని సంప్రదించాలి. నిపుణులంటే, వైద్యులు, కౌన్సెలర్లు, టీచర్లు, మానసిక వైద్యులు, ఆర్థిక సలహాదారులు ఎవరైనా కావచ్చు. సమస్యల్లో కూరుకుపోకుండా సలహా తీసుకోవడంలో తప్పు లేదు. కాకపోతే ఏతప్పు వల్ల ,ఏ తప్పుడు నిర్ణయం వల్ల సమస్య వచ్చిందో ఆ పొరపాటు తిరిగి చెయ్యకుండా జాగ్రత్తపడాలి.

కొని తెచ్చుకునే సమస్యలు

సమస్య అంటే చేతిలో గొడుగు లేనప్పుడు వర్షంలో చిక్కుకోవడం. తెలిసీ సమస్యల్లో ఇరుక్కోడమంటే వాన పడుతుందని తెలిసీ గొడుగు పట్టుకెళ్ళకపోవడం ఫలితం వానలో తడిసి ముద్దయిపోవడం. ఇవికాక కొందరు సమస్యలు కొని తెచ్చుకుంటుంటారు. ఒక ఊళ్ళో బాధ్యత కలిగిన ఉద్యోగంలో ఉన్న భార్యా భర్తలున్నారు. పొరుగింటివాళ్లు ఊరెళతాం వచ్చే వరకు తమ పెంపుడు కోడిని జాగ్రత్తగా చూసుకోండి అని అడిగారు. పక్కింటివారు అడిగితే కాదంటే ఏం బావుంటుందని ఒప్పేసుకున్నారు. సరిగా చూసుకోకలేకపోతే ఆ కోడి ఎటైనా పారిపోతే..? అని అనుమానపడ్డారు. అప్పుడెలాగూ మరో కోడిని కొని ఇవ్వాలిగదా..పరిస్థితిని అందాక పోనిచ్చుకోడం ఎందుకని ముందే కోడిని కొనేసారు. ఒక రోజు ఆవిడ మధ్యాహ్నం దాకా ఆఫీసుకు రాలేదు. ఏమిటీ ఆలస్యం బాస్ గుడ్లెర్రచేశాడు. పెంపుడు కోడి అటకెక్కి కూర్చుని దిగను గాక దిగనంటే ఏం చేయనుసార్.. దాన్ని కిందకి దింపి వచ్చేసరికి ఈవేళయిందని చెప్పింది. ఇది విని బాసు గారు విరగబడ్డారు. కోడికోసం ఏమిటీ వెధవగోల అని అనుకుని పనిమనిషికిచ్చి వదిలించుకుంది. కనుక దేనికి అవుననాలో దేన్ని కాదనాలో తెలియడం అవసరం. చాలా మంది నో చెప్పడానికి నోరురాక బుక్కయిపోతుంటారు. తెలిసీ తెలియని వారికి హామీలున్న నేరానికి అప్పుచేసి మరీ డబ్బుకట్టి చివరకు ఆస్తులమ్ముకున్న వాళ్ళున్నారు. కనుక తస్మాత్ జాగ్రత్త.

ఆకలి సమస్య


మనకున్న పెద్ద సమస్యలలో ఆకలి అతిపెద్ద సమస్య. ఆకలి వేయడం ఎంత పెద్ద సమస్యో ఆకలి వెయ్యకపోవడం కూడా అంతే పెద్ద సమస్య. ఆకలి తీర్చుకోవడానికి అర్థబలం లేకపోతే సమస్యగా తయారవుతుంది. డబ్బు సంపాదించుకోడానికి పనిలేకపోతే ఒక సమస్య. పని ఉన్నా చేయడానికి ఆరోగ్యం, వయసూ అనుకూలించకపోతే మరో సమస్య. ఇక ఆకలి వెయ్యకపోడం అనేది అనేక రకాల సమస్య. తిండి ఎక్కువై కొందరికి, ఆరోగ్యం తక్కువై మరికొందరికి సమస్య. ఆ రోగం కూడా మందు లేనిదైతే మరింత సమస్య. మందు కొనుక్కునేందుకు, వైద్యం చేయించుకునేందుకు డబ్బు లేకపోతే అది మహాఘోర సమస్య.

– శారద శివపురపు, 9663378928

రామ బాణాల వంటివే ఇస్రో రాకెట్లు : గుజరాత్ సిఎం రూపానీ

అహ్మదాబాద్ : అప్పటి రామబాణాలు ఇప్పటి ఇస్రో రాకెట్ల వంటివేనని గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ పోల్చారు. ఇప్పుడు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వారు ప్రయోగిస్తున్న రాకెట్ల వంటివి రామాయణ కాలంలోనూ ఉన్నాయని చెప్పిన సిఎం, తిరుగులేని రామబాణాలు గురి చూసి లక్ష్యాలను ఛేదించేవని గుర్తు చేశారు. మణినగర్‌లో ఆదివారం ఇక్కడ సాంకేతిక పరిశోధనా విద్యా సంస్థ (ఈట్రామ్) తొలి స్నాతకోత్సవ సభకు హాజరయిన సందర్భంగా సిఎం మాట్లాడారు. రాముడిలో రాకెట్ల వంటి శరాలు సంధించిన సైంటిస్టు ఉన్నాడని, రామసేతు వంటి వారధిని కట్టిన ఇంజనీరు ఉన్నారని శ్లాఘించారు. అప్పటి నిపుణుల సహకారంతో మనకూ లంకకు మధ్య వారధి కట్టారంటే అంతకంటే గొప్పతనమరోటి ఉంటుందా? అని ప్రశ్నించారు. రాముడి ప్రతి బాణం ఇప్పుడు ఇస్రో వారు ప్రయోగించే క్షిపణుల వంటివేనని , ఇప్పుడు రాకెట్లుగా ప్రయోగిస్తూ ఉంటే అప్పట్లో బాణాలుగా సంధించేవారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఇస్రో కేంద్రం డైరెక్టర్ తపన్ మిశ్రా ఇతర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.రామాయణంలోనే సాంకేతికత, మౌలిక వసతి కల్పన ఉందని, హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకురావడం అంటే మౌలిక వసతుల కల్పననే అని, ఇక రాముడు శబరి ఎంగిలి చేదు మేడిపండ్లను తినడం కేవలం సామాజిక సమీకరణమే అని ఈ సభలో సిఎం సరిపోల్చారు.





పాత్రికేయులపై మంత్రి ప్రశంసలు

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పాత్రికేయులు అనుసంధానంగా ఉంటూ, అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం తపిస్తారని సాగునీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పర్యాటక భవన్‌లో ఆదివారం సీనియర్ పాత్రికేయులు ఎస్‌కె జకీర్ రచించిన 'మర్లబడ్డ మొగిలిచర్ల' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మూడు దశాబ్ధాల పాత్రికేయ జీవితంలో 60 ప్రముఖ ఘటనలు, కథనాల వెనుక కథల కూర్పునే 'మర్లబడ్డ మొగిలిచర్ల' పుస్తకంగా ఎస్‌కె జకీర్ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తతరానికి పాత తరం అనుభవాలు తెలియాలని, ఈ పుస్తకం ఆ లోటును కొంత తీరుస్తుందన్నారు. జర్నలిస్టులు ఉన్నత విలువలతో కూడిన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తే చివరికి మిగిలేది ఆత్మసంతృప్తి, సంతోషం మాత్రమేనని అభిప్రాయపడ్డారు. ఐజెయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి, టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బుద్ధవనం ఓఎస్‌డి మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రజాకవి గోరటి వెంకన్న, దేవులపల్లి అజయ్ తదితరులు పాల్గొని పుస్తకం కొత్త చరిత్రను సృష్టించాలని ఆకాంక్షించారు. వామపక్ష ఉద్యమాల నుంచి మొదలుకొని అస్థిత్వవాద ఉద్యమాల వరకు కీలక సమయంలో జరిగిన ప్రధాన ఘటనలు పుస్తకంలో పొందుపరిచారని, ఇది యువతరం తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమని అభిప్రాయపడ్డారు. జకీర్‌ను అభినందించారు.

నీటి కోసం నేడు రైతులతో కలిసి ధర్నా




మనతెలంగాణ/గద్వాలప్రతినిధి: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆమోదయోగ్యమైన ప్రతి ఎకరాకు నీళ్లను ఇవ్వాలి.. నూతనంగా చేపడుతున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండు ఫేజ్‌లలో చేపట్టి ఫేజ్1, ఫేజ్2 లలో నిర్మించాలని డిమాండు చేస్తూ సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా అఖిల పక్ష పార్టీలు ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గద్వాలలో కూడా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డికె అరుణ అన్నారు. ఆదివారం గద్వాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు కింద ఉన్న మక్తల్, కొడంగల్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి, పరిగి ప్రాంతాలకు జూరాల నుంచే ఫేజ్1 ద్వారా సాగునీటిని అందేలా... ఫేజ్2 కింద కల్వకుర్తి ఎత్తిపోతల కింద సాగయ్యే ఆయకట్టును ముంపునకు గురికాకుండా, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, కొల్లాపూరు, వనపర్తి తదితర ప్రాంతాలకు శ్రీశైలం నుంచి నీటిని తీసుకునేలా ప్రాజెక్టును నిర్మించాలని ఎమ్మెల్యే డికె అరుణ అన్నారు.

కోటి మొక్కలు నాటిన సింగరేణి

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా సింగరేణి కాలరీస్ సంస్థ కోటి మొక్కలను నాటే లక్ష్యాన్ని చేరుకుంది. కార్మికులు, ఉద్యోగుల ఈ స్ఫూర్తిదాయక ఫలితాలపై సింగరేణి సిఎండి ఎన్. శ్రీధర్ హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులను పేరుపేరునా అభినందించారు. సిఎం కెసిఆర్ ఆలోచనల మేరకు 20 శాతంగా ఉన్న అడవులను 33 శాతంగా పెంపుదల చేసేందుకు సింగరేణి సంస్థ కూడా కీలక భూమికను పోషిస్తోంది. సింగరేణి గడచిన రెండేళ్లలో కోటి 50 లక్షల మొక్కలను నాటింది. ఇక ఈ ఏడాదిలో నిర్దేశించుకున్న కోటి మొక్కలు నాటే లక్ష్యాన్ని శనివారం నాడు చేరకుంది. కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, రామగుండం, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, భూపాలపల్లి సహా కార్పొరేట్ ఆఫీసు పరిధిలో మొత్తం 1,01,27,81 మొక్కలను నాటింది.

ఆదివాసీ హక్కుల సాధనకు చలో ఢిల్లీ

మన తెలంగాణ / ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల సాధన కోసం చలో ఢిల్లీ విషయం 2018లో కోటి మంది ఆదివాసీలతో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడికి సిద్ధమవుదామని నేషనల్ జైస్ ప్రచారకర్త హడా హన్మంతరావు, మేస్రం ఆనంద్‌లు పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం అమరవీరులకు నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జల్ జంగల్ జమీన్ కోసం వీరోచితంగా పోరాడిన మహనీయుడు కుమ్రం భీ, ఇంద్రవెల్లి అమరవీరుల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడుదామని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు కొట్నక్ బారిక్ రావ్, మడావి జంగు, బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్

నదిలో దూకితల్లి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

నివాసం ఉండే గొంటి ముక్కల స్వప్న(45) కూతురు అతిథి(4)తో కలిసి ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలోని పెన్‌గంగా నదికి ఆటోలో వెళ్లింది. నదిపై ఉన్న బ్రిడ్జిపై ఆటోను నిలపమని కోరిన స్వప్న ముందుగా తన కూతురిని నదిలో పడేసింది. ఆటో డ్రైవర్ వారిస్తుండగానే తానూ నదిలో దూకింది. తల్లి స్వప్న మృతదేహం ఒడ్డుకు కొట్టుకొని రాగా, పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఆదిలాబాద్ రిమ్స్ మార్చురీకి తరలించారు. కూతురు జాడ సాయంత్రం వరకు తెలియరాలేదు. జైనథ్ ఎస్‌ఐ పుల్లయ్య నేతృత్వంలో అతిథి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. మృతురాలి భర్త అమరేశ్వర్ మంచిర్యాలలో వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌టిసి.. మళ్లీ మొదటికి

● అన్ని ఆస్తులూ కలిపి పంచితే మాకే రూ.200 కోట్లు వస్తాయి: టిఎస్‌ఆర్‌టిసి ● సెప్టెంబర్ 15న మళ్లీ బోర్డు సమావేశం



మన తెలంగాణ/హైదరాబాద్: ఆర్‌టిసి ఉమ్మడి ఆస్తులపై ఆంధ్రప్రదేశ్ ఆర్‌టిసి (ఎపిఎస్‌ఆర్‌టిసి) తొండి వైఖరిని అవలంభిస్తోంది. ఉమ్మడి ఆస్తుల పంపిణీపై ఎపిఎస్‌ఆర్‌టిసి కాలుకేస్తే మెడకు, మెడకు పడితే కాలుకు కొర్రీ లేస్తోంది. తాజాగా ఇటీవల విజయవాడలో జరిగిన ఉమ్మడి ఆర్‌టిసి బోర్డు సమావేశంలో ఉమ్మడి ఆస్తుల విభజన అంశం ఒక కొలిక్కి వస్తుందని భావించినప్పటికీ ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారుల కొత్త వాదనలతో విషయం మళ్ళీ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆస్తులపై మరింత విస్తృతంగా చర్చించేందుకు తిరిగి సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో సమావేశం కావాలని నిర్ణయించారు. మార్కెట్ విలువ ప్రకారం ఆస్తులు పంచాలని, ప్రధాన కార్యాలయం నిర్వహణలో ఉన్న హైదరాబాద్‌లోని బిఓటి ప్రాజెక్టులు, 'కామన్ యూసేజ్'లో ఉన్న ఆస్తులలో కూడా వాటా ఇవ్వాలని కొత్త కొత్త వాదనలను తెరమీదకు తెస్తోంది. మొత్తంగా హైదరాబాద్‌లోని 14 ఆస్తులను పంచి రూ.1100 కోట్లను ఇవ్వాలని ఎపిఎస్‌ఆర్‌టిసి మొండికేస్తోంది. సంస్థ ప్రధాన కార్యాలయం బస్‌భవన్ (కొత్త భవనం ఒక్కటే) ఉమ్మడి ఆస్థి అని, మిగిలినవన్నీ వారసత్వ ఆస్తులని, ఎపిఎస్‌ఆర్‌టిసి ఏర్పాటు కాకముందే హైదరాబాద్ సంస్థానంలోని 'నిజాం స్టేట్ రోడ్, రైల్ ట్రాన్స్‌పోర్ట్ సం స్థ'కు చెందినవని, మరోవైపు రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోని ఆస్తులు ఆ రాష్ట్రానికే చెం దుతాయని టిఎస్‌ఆర్‌టిసి ఎంత చెప్పినా ఎపిఎస్‌ఆర్‌టిసి వినడం లేదు. చివరకు విభజన చట్టంలోని హెడ్ క్వార్టర్ నిర్వచనం ప్రకారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయం బస్ భవన్ ఒక్కటే ఉమ్మడి ఆస్థి అని, తెలంగాణలోని ఏ ఆస్థిలో ఎపిఎస్‌ఆర్‌టిసికి వాటా ఉండదని కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం (డిఓపిటి) స్పష్టంగా చెప్పినా ఎపిఎస్‌ఆర్‌టిసి పట్టించుకోవడం లేదని టిఎస్ ఆర్‌టిసి వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన కార్యాలయం నిర్వహణలో ఉన్న బస్ పార్కింగ్ యార్డ్ లాంటి బిఓటి ప్రాజెక్టులు, 'కామన్ యూసేజ్'లో ఉన్న బిబియు, కళ్యాణ మండపం లాంటి ఆస్తులలో కూడా వాటా ఇవ్వాలని ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారులు కోరడం సరైంది కాదని టిఎస్‌ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు.

ఒక వేళ ఆ ప్రాతిపదికన ఆస్తులను పంపిణీ చేయాలంటే, ఎపిలో ప్రధాన కార్యాలయం నిర్వహణలో ఉన్న 15 బిఓటి ప్రాజెక్టులలో, 'కామన్ యూసేజ్'లో ఉన్న అనంతపురంలోని రామగిరి 'విండ్ పవర్ ప్లాంట్', ఉమ్మడి రాష్ట్రంలో సేవలందించిన విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ తదితర పెద్ద బస్ స్టేషన్లలో, మంగళగిరిలోని సంస్థ భూమిలో కూడా టిఎస్‌ఆర్‌టిసికి 42 శాతం వాటా ఇవ్వాలని టిఎస్‌ఆర్‌టిసిఅధికారులు అంటున్నారు. ఈ విధంగా లెక్కలు తీస్తే ఒక్క పైసా కూడా ఎపిఎస్‌ఆర్‌టిసికి చెల్లించాల్సిన అవసరం లేదని, తెలంగాణ ఏర్పడిన అనంతరం ఒక ఏడాది ఉమ్మడిగా నడిచిన ఆర్‌టిసిలో ఎపిఎన్‌జిఓలకు బస్ పాస్ సర్వీస్ తదితర సేవలందించినందుకు ఎపిఎస్‌ఆర్‌టిసి తెలంగాణ ఆర్‌టిసికి సుమారు రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని టిఎస్‌ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు.

జాతీయ కూటమి

(మొదటి పేజీ తరువాయి)

తానే ఆయనను సిఎం చేశానని, అయితే తరువాత ఆయన గోడదూకుడు పద్ధతి వెల్లడైందని, ఆయన ఓ పల్టూరామ్ అని చమత్కరించారు. ఆయన అనేక సార్లు ఫిరాయింపులు జరిపారని ఇక పల్టీరాంగా మారి బోల్తా పడటం ఖాయమన్నారు.



జాతీయ స్థాయిలో మహాకూటమి : శరద్

సభకు ప్రత్యేక రాజకీయ ఆకర్షణగా మారిన జెడియూ రెబెల్ నేత శరద్ యాదవ్ ప్రతిపక్ష ఐక్యతకు శపథం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల మహాకూటమి ఏర్పాటు చేసి తీరుతామని శరద్ యాదవ్ చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని ఓడించి, ఎన్‌డిఎను గద్దె దించడమే తమ లక్ష్యం అని ఆయన ప్రకటించారు. మొన్నటివరకూ బీహార్ వరకే పరిమితం అయిన ప్రతిపక్షాల ఘట్‌బంధన్ ఇక జాతీయ స్థాయికి విస్తరిస్తుందని, ఈ దిశలో తాను ముందుకు సాగుతానని ఆయన సభికుల హర్షధ్వానాల మధ్య ప్రతిన వహించారు. హిందూస్థాన్ అంతటా ఇకపై మహాకూటమి బాటలు పర్చుకుంటుందని తెలిపారు. లాలూ ర్యాలీకి శరద్ యాదవ్ హాజరు కావడం ఇప్పుడు మరోమారు రాజకీయ చిచ్చుకు దారితీసింది. దీనికి హాజరయితే వేటు తప్పదనే జెడియూ హెచ్చరికలు ఉన్నప్పటికీ శరద్ దీనికి విచ్చేశారు. బీహార్‌లో కూటమికి బీటలు పెట్టిన వారికి తన సత్తా ఏమిటో చూపిస్తామని, జాతీయ స్థాయిలో మహాకూటమి ఏర్పడుతుందని శరద్ పరోక్షంగా నితీశ్‌కు చురకలు అంటించారు. జెడియూ, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమిని తుంచివేయడం ప్రజాద్రోహం అయిందని, వారి తీర్పును నేలరాచినట్లు చేసిన వారికి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తారా? దీనికి ఫలితం విస్తృతంగా ఉంటుందన్నారు. రాజకీయాలు, మతం అనుబంధం దేశానికి ప్రమాదకరం అని ఆయన హెచ్చరించారు. వీటిని మిళితం చేస్తే పొరుగు దేశాల్లో జరిగేదే ఇక్కడా జరుగుతుందని తెలిపారు. తాను 43 ఏళ్లుగా ఎంపిగా ఉంటూ వచ్చానని, తుది శ్వాస వరకూ పోరాడుతూనే ఉంటానని చెప్పారు. విభజన శక్తులను ఢీకొనడంలో వెనుకంజ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లాలూతో కలిసి ఒకే వేదికపై శరద్ రావడం ఇదే తొలిసారి. నవ్వుతూ లాలూ ప్రసాద్ వేదికపై శరద్‌కు కరచాలనం చేశారు. తాను ఇప్పటికీ మహాకూటమిలో ఉన్నానని, తమదే నిజమైన జెడియూ అని శరద్ ప్రకటించారు. ర్యాలీకి పశ్చిమ బెంగాల్ సిఎం మమత బెనర్జీ, ఎస్‌పి నేత అఖిలేష్, సీనియర్ కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, ఎన్‌సిపి, డిఎంకె, కేరళ కాంగ్రెస్, ఆర్‌ఎల్‌డి, జెఎంఎం, జెవిఎం, జెడిఎస్, ఆర్‌ఎస్‌పి, ఎఐయుడిఎఫ్, సిపిఐఎంఎల్ నేతలు హాజరయ్యారు. సిపిఎం ఈ సభకు దూరంగా ఉంది. మమత రావడంతో పార్టీ ఈ సభకు రాలేదని వెల్లడైంది. ఇక సభకు రాలేకపోయిన సోనియా, రాహుల్‌ల ప్రసంగాలను వీడియో ద్వారా ప్రదర్శించారు. బీహార్‌లో పలు ప్రాంతాలలో వరద బీభత్సం ఉన్నప్పటికీ లాలూ సభకు వేలాది మంది తరలివచ్చారు. వేదికపై లాలూ కుమారులు, భార్య, కూతురు కూడా ఉన్నారు.

అప్పుడు నస్బందీ..ఇప్పుడు నోట్లబందీ : మమత

ఇందిరా గాంధీ హయాంలో బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో ప్రభుత్వం కుప్పకూలిందని, ఇప్పుడు పెద్ద నోట్ల రద్దుతో మోడీ ప్రభుత్వ పతనంమొదలయిందని సభలో మమత బెనర్జీ తెలిపారు. కేంద్రం



రాష్ట్రాల పట్ల వివక్షతను పాటిస్తోందని, బిజెపి పాలిత ప్రాంతాలలో ఘర్షణలు జరిగితే భారీ సంఖ్యలో హుటాహుటిన సైన్యాన్ని పంపిస్తారని,అదే వేరే రాష్ట్రాలకు ఎన్ని సార్లు అడిగినా కిమ్మనరని విమర్శించారు. ప్రతిపక్ష నేతలను బెదిరించడమే కేంద్రం రివాజుగా మారిందని, తమ పార్టీకి గొడుగు పట్టకుంటే కేంద్ర సంస్థలు సిబిఐ, ఇడిలను వాడుకుంటున్నారని మండిపడ్డారు.

జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ప్రభుత్వ సంవిధాన రూపకల్పన సంస్థ అయిన నీతి ఆయోగ్ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. దేశంలో తరచూ ఎన్నికల తంతు, అసెంబ్లీలకు, లోక్‌సభకు వేర్వేరు ఎన్నికల ప్రక్రియలతో పాలనా సౌలభ్యం కొరవడుతుందని నివేదికలో తెలిపారు. దేశంలో ఏ ఎన్నికలు అయినా స్వేచ్ఛగా సజావుగా జరగాల్సి ఉంటుంది. తక్కువ నిడివి ప్రచార హడావిడి , ఎన్నికల హంగామా లేకపోవడం వల్ల ఇది సాధ్యం అవుతుందని సూచించారు. సమన్వయ సంవిధానంతోనే ఎన్నికలు సజావుగా సాగుతాయని తెలిపారు. 2024 నుంచి అయినా లోక్‌సభకు , అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటూ ఇప్పటినుంచే దీనికి సంబంధించి వివిధ రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితుల ఖరారు, ఇతర ఏర్పాట్లు చేసుకోవల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. జాతీయ ప్రయోజనాల కోణంలో ఈ ఏకకాల రెండు దశల ఎన్నికల ప్రక్రియ అవసరం అని నీతి ఆయోగ్ తమ మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూపొందించిన ఈ నివేదికలో తెలిపింది. రెండు దశల జమిలి గురించి రాజ్యాంగ , ఎన్నికల నిపుణులు, మేధావి వర్గాలు, ప్రభుత్వ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓ బృందం ఏర్పాటు చేయాల్సి ఉందని సూచించారు. ప్రధాని మోడీ ఇతర కేంద్ర పెద్దలు తరచూ జమిలి ఎన్నికల గురించి మాట్లాడుతున్న తరుణంలోనే నీతి ఆయోగ్ నివేదిక ఈ అంశాన్ని ప్రస్తావించింది. నీతి ఆయోగ్ ఇటీవలనే మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఎన్నికల నిర్వహణ వ్యయ భారం పెరగడం, గత లోక్‌సభ ఎన్నికల నాటికి ఇది రూ 4వేల కోట్ల స్థాయికి చేరడం, కోటి మందికి పైగా ప్రభుత్వోద్యోగులను ప్రత్యేకించి అధ్యాపకులను రంగంలోకి దింపడం వంటి పలు అంశాలు , శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతూ ఉండటంతో, జమిలి ప్రక్రియ మన ముందున్న అత్యుత్తమ ప్రజాస్వామిక మార్గం అని ఇటీవలే ప్రధాని మోడీ సెలవిచ్చారు.

రహస్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

టిఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు. సొంత ప్రయోజనాల కోసం కెసిఆర్ ప్రధాని మోడీతో రహస్య సమావేశాలు జరుపుతున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో రహస్యంగా వ్యవహరించడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ప్రజలు ఎంతో ఆశతో టిఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే, నేడు గ్రామాల్లో రైతుల పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. టిఆర్‌ఎస్ ప్రకటించిన రుణమాఫీతో రైతులకు ఒరిగిందేమి లేదని పేర్కొన్నారు. వచ్చే 2019 ఎన్నికల్లో తమ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాల విభజనకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, రాజ్యంగ సవరణపై సరైన అవగాహన లేక కెసిఆర్ జిల్లాల విభజన చేసినట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా అన్ని రంగాల్లో టిఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యంగా మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్ధానాలను సైతం నేరవెర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. దళితుల కోసం చేపట్టిన భూ పంపిణీతో పాటు గిరిజనులకు, మైనారిటీలకు ఇస్తామన్న 12 శాతం రిజర్వేషన్లు, తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడం ఏమైందని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఓ నెంబరు 69ని ఆమలుచేసి కృష్ణా జలాలు తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించి పనులు ప్రారంభించిందన్నారు. కాని ఈ ప్రభుత్వం ఆ పథకాన్ని పక్కన పెట్టి పాలమూరు రంగారెడ్డిని తెరపైకి తెచ్చి ఇక్కడి రైతాంగానికి తీరని నష్టం చేసినట్లు విమర్శించారు. త్వరలో బ్లాక్ కమిటీలు ఏర్పాటు చేసి ఇంచార్జిలను కూడా నియమించనున్నట్లు వివరించారు.

9లోగా సమితులు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం కెసిఆర్, పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌ఎలసిలతో సమావేశమై ఈ సమితుల ఏర్పాటుపై చర్చించారు. ఆ సమావేశంలో సిఎం ఇచ్చిన సూచనల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం గ్రామ రైతు సమన్వయ సమితిలో 15 మంది, మండల సమితిలో 24 మంది, జిల్లా సమితిలో 24 మంది, రాష్ట్ర స్థాయి సమితిలో 42 మంది సభ్యులు ఉండనున్నారు. ఈ సమితుల ఏర్పాటు ప్రక్రియను సెప్టెంబర్ 9వ తేదీలోపు పూర్తి చేయాలి. **సమన్వయ సమితి సభ్యత్వానికి నిబంధనలు:** సభ్యులు ఖచ్చితంగా పట్టాదారు అయి, ఆ ఊరికే చెందిన వారై ఉండాలి. ప్రతి ముగ్గురి సభ్యులలో ఒక మహిళ రైతు ఉండాలి. అన్ని సామాజిక వర్గాలతో కూడిన రైతులతో సమితి ఏర్పాటు కావాలి. ఇందుకు వ్యవసాయ శాఖ నోడల్ శాఖగా పనిచేయనుంది. రాష్ట్రానికి వ్యవసాయ శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా, కలెక్టర్లు జిల్లా నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

ఇద్దరు లాయర్లపై చార్జిషీట్

మనతెలంగాణ/కరీంనగర్ లీగల్: ఎస్‌ఐ మోహనరెడ్డి అక్రమ ఫైనాన్స్ దందాలో ఆయనకు సహకరించి బినామిలుగా ఉన్న ఇద్దరు న్యాయవాదులను మూడు కేసులలో నిందితులుగా చూపు తూ సిఐడి చార్జిషీట్ దాఖలు చేశారు. అక్రమ ఫైనా న్స్ వ్యవ హారంలో మోహన్ రెడ్డితో పాటు అతని బంధువులు, అనుచరులు ఇప్పటి వరకు కేసులలో నిందితులుగా ఉన్నారు.

ప్రస్తుతం మూడు కేసుల్లో ఇద్దరు న్యాయ వాదులను నిందితులుగా చూపారు. క్రైం నెం. 553/15 రూరల్ పోలీస్‌స్టేషన్, క్రైం నెం. 229/15 మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ల నమో దయిన ఈ రెండు కేసుల్లో గతంలో జిల్లా కోర్టులలో ఎజిపిగా బాధ్యతలు నిర్వహించిన న్యాయవాదిని నిందితునిగా చూపుతూ చార్జిషీట్ దాఖలు కాగా, క్రైం నం. 479/15 వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదయిన కేసులో పేరు మోసిన న్యాయవాది కావటం విశేషం.

రికార్డులు నాలుగే

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళన ప్రభుత్వ భూముల రిజిష్టర్, పహాణీ, ఖాతావారీ రిజిష్టర్, ముటేషన్ రిజిష్టర్‌లకు పరిమితం చేశారు. అంతా అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాది భూ సర్వే నిర్వహిస్తారు. భూ సర్వే ఏ విధానంలో నిర్వహించాలనేది అప్పుడే ఖరారు చేయనున్నారు. అయితే అధికారులు మూడు విధానాలు సిఎం కెసిఆర్ ముందుంచారు. ఒకటి డిజిపిఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) కాగా రెండోది హెచ్‌ఆర్‌ఎస్‌ఐ (హై రెజుల్యూషన్ శాటిలైట్ ఇమేజరీ). మూడో విధానం హైబ్రీడ్. హైబ్రీడ్ పద్దతిలో త్రి డి విధానం అనుసరించి రికార్డులను కొత్తగా తయారు చేస్తారు. వీటి ప్రకారం సేత్వార్, కోరిలేషన్ స్టేట్‌మెంట్‌లను సరిచే స్తారు.

విలేజి అక్కౌంట్ వివరాలు : ప్రస్తుతం ప్రతి గ్రామంలో రెవెన్యూ శాఖ 9 రకాల రిజిష్టర్లను నిర్వహిస్తున్నది. అవి ప్రభుత్వ భూముల రిజిష్టర్, సవరణ, పహాణీ, చౌఫస్లా ఖాతావారీగా, డిమాండ్, కలెక్షన్, నిల్వ, రోజువారీ కలెక్షన్, రీకన్సిలేషన్, నీటి వనరు, ల్యాండ్ రెవెన్యూ రిజిష్టర్లు. ఇందులో ప్రభుత్వ భూముల రిజిష్టర్, పహాణీ, ఖాతావారీ రిజిష్టర్, ముటేషన్ రిజిష్టర్‌ల ప్రకారం ప్రక్షాళన జరగనున్నది. ప్రభుత్వ భూముల రిజిష్టర్‌లో 17 కాలమ్స్, పహాణీలో 30 కాలమ్స్, ఖాతావారీ రిజిష్టర్‌లో 12 కాలమ్స్, మార్పుల (ముటేషన్) రిజిష్టర్‌లో 10 కాలమ్స్‌ఉన్నాయి. పహాణీలో రెవెన్యూ శాఖ పూరించాల్సినవి 14 కాలమ్స్, వ్యవసాయ శాఖ పూరించాల్సినవి 5 కాలమ్స్, నీటి పారుదల శాఖ పూరించేవి 7 కాలమ్స్, బ్యాంకు సిబ్బంది పూరించేవి 2 కాలమ్స్‌ను ఖరారు చేశారు.

ఇది ఎవరి బతుకమ్మ?

(మొదటి పేజీ తరువాయి)

ఆసాములు. వీరికి స్వంత పవర్‌లూంలు ఉంటాయి. ముడిసరకుకు పెట్టుబడిలేక, ఉత్పత్తి చేసిన వస్త్రాలను మార్కెట్‌లో అమ్ముకునే శక్తిలేక యజమానుల నుండి ముడిసరకు తెచ్చి కార్మికుల చేత తమ పవర్‌లూంలపై చీరలు, వగైరా ఉత్పత్తి చేసి ఇస్తారు. ఇందుకు యజమానుల నుండి డబుల్ కూలీ తీసుకుని అందులో సగం కార్మికులకు చెల్లిస్తారు. వీరు సిరిసిల్లలో దాదాపు 2500 మందివరకు ఉంటారు. మూడో రకం పూర్తిగా కార్మికులు. రోజూ పనిచేసి ఉపాధి పొందుతారు. సిరిసిల్లలో వీరు దాదాపుగా 25,000 మంది ఉంటారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అన్నీ యజమానులు, ఆసాములు అనుభవిస్తున్నారని కార్మికులకు ప్రయోజనం కలుగడం లేదని, వారికి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఒప్పందం మేరకైనా చెల్లించడం లేదని పలు పర్యాయాలు ఆందోళనలు జరిగిన నేపథ్యంలో ప్రభుత్వం సిరిసిల్ల పవర్‌లూం ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ (మ్యాక్స్)లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు కార్మికులు సుమారు 56 మ్యాక్స్ సొసైటీలుగా ఏర్పాటయ్యారు. వీటికి మొదటి విడతగా రాజీవ్ విద్యామిషన్ పాఠశాల దుస్తుల కోసం రూ. 166.76 కోట్ల ఆర్డర్లు వచ్చాయి. త్వరలోనే మరి రూ. 350 కోట్ల ఆర్డర్లు రానున్నాయి. గతంలో ప్రభుత్వం ఇతర రాష్ట్రాలనుండి వస్త్రాలను మీటరుకు 49 రూపాయలు చెల్లించి తెప్పించేది. సిరిసిల్లనుండి 33 రూపాయలకే మీటరు వస్త్రం లభిస్తున్నది. ఇందువల్ల ప్రభుత్వానికి మీటరు వద్ద 16 రూపాయలు ఆదా అయింది. కార్మికులకు ఉపాధి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు చీరెల పంపిణీ చేయాలని, తెల్ల రేషన్ కార్డు కలవారికి 86 లక్షలు, తెల్ల కార్డు గల ఇంటిలో 18 సంవత్సరాలు నిండిన ఆడపడుచులు మరో 11 లక్షల మందికి కలిపి దాదాపు 97 లక్షల చీరెలు అవసరమవుతాయని అంచనావేశారు. 4 కోట్ల మీటర్ల సాదావస్త్రం, 2 కోట్ల మీటర్ల రంగు వస్త్రం తయారి ఆర్డర్‌ను (పాలిస్టర్ చీరల తయారీ ఆర్డర్‌ను) సిరిసిల్లలోని 56 మ్యాక్స్ సొసైటీలకు, 283 చిన్న తరహా పరిశ్రమలకు ఇచ్చారు. బతుకమ్మ చీర అంటే 6 మీటర్ల 30 సెంటీమీటర్ల గుడ్డ ఉంటుంది. ఇందులో చీర కోసం 5.5 మీటర్లు పోగా 80 సెంటి మీటర్లు బ్లౌజ్ కోసం కేటాయిస్తారు. గుడ్డ తయారికి రిలయన్స్, ఇండోరమ వంటి కంపనీల నాణ్యమైన నూలునే వాడాలని నిబంధన విధించారు. సిరిసిల్లలో రోజుకు సుమారు 7 లక్షల మీటర్ల గుడ్డ ఉత్పత్తి అవుతోంది. ఒక్కో రంగుల బతుకమ్మ చీరకు 148 రూపాయలు, తెల్ల చీరకు 112 రూపాయలను ప్రభుత్వం ధర చెల్లిస్తోంది. సిరిసిల్లలో దసరా నాటి వరకు 11 వేల మరమగ్గాలపై కోటి 50 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల గుడ్డ ఉత్పత్తవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. దసరావరకు ప్రతిరోజు 20 వేల మరమగ్గాలపై చీరలు ఉత్పత్తయ్యేలా చూడాలని చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, సహాయ సంచాలకులు అశోక్‌రావు సూచించారు. సిరిసిల్లలో తయారైన వస్త్రానికి టెస్కో ద్వారా ప్రింటింగ్, ప్రాసెసింగ్ చేయించాల్సి ఉంటుంది. ప్లెయిన్‌క్లాత్‌తో దాదాపు పది రంగులలో చీరెలు ప్రాసెసింగ్ చేయించాలనేది అధికారుల వ్యూహం. దీనివల్ల ఒక్కో చీర ఖరీదు దాదాపు 200 రూపాయలవుతుంది. సిరిసిల్లలో ఈ నెలాఖరులోగా ఆశించిన స్థాయిలో ఉత్పత్తయ్యే అవకాశం లేదని గ్రహించిన అధికారులు ఇతర రాష్ట్రాల నుండి సగం చీరలు తెప్పించాలని నిర్ణయించారు. సిరిసిల్లలోని 23,000 సంప్రదాయ మరమగ్గాలను ఆధునీకీకరించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇప్పటివరకు 5,400 మరమగ్గాలను మాత్రమే ఆధునీకీకరించుకున్నారు. ఇంకా 17,600 మరమగ్గాలను ఆధునీకీకరించుకోవాల్సి ఉంది. మరమగ్గాల ఆధునీకీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం (రూ.లు 20,000), కేంద్ర ప్రభుత్వం 50 శాతం (రూ.లు 20,000) సహాయం కూడా అందిస్తున్నాయి. మహిళల ఉపాధికోసం సర్ధాపూర్‌లో 105 ఎకరాల స్థలంలో అపెరల్ పార్క్ ప్రతిపాదించారు.



సామాజిక అభివృద్ధి కోసమే టిమాస్ : తమ్మినేని వీరభద్రం

మన తెలంగాణ/హైదరాబాద్/మాదన్నపేట్ : నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక, సాంఘిక, రాజకీయ అసమానతలు తొలగిపోయి అందరూ సమానంగా జీవించడం కోసమే టిమాస్ ఆవిర్భవించిందని టిమాస్ రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం అన్నారు. కుర్మగూడ డివిజన్ పారామౌంట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ సౌత్‌జిల్లా టిమాస్ ఫోరం ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిలుగా తమ్మినేని, ప్రొ. కంచె ఐలయ్య,అరుణోదయ కమిటీ నాయకురాలు విమలక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బిసి కులాల అభివృద్ధి కోసమే తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక(టిమాస్)ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విమలక్క మాట్లాడుతూ అందరూ సమాన హక్కులతో జీవించాలన్నదే టిమాస్ ముఖ్య ఉద్దేశమని, సమాన హక్కుల కోసం మరో ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కంచె ఐలయ్య మాట్లాడుతూ దేశంలో ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయి. బీఫ్ తినడంపై కేంద్రం ఆంక్షలు విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కుల,మతాల మధ్య చిచ్చు పెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్‌జోన్ ఆటోడ్రైవర్ అసోసియేషన్, భవన నిర్మాణ కార్మికులు, మాదన్నపేట్ గంగపుత్ర సంఘం సభ్యులు, ఇతర కులాల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యం

పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మనతెలంగాణ / హుజూర్‌నగర్/ చింతలపాలెం : ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుందని పిసిసి అధ్యక్షులు నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతలపాలెం మండలంలోని పులిచింతల వద్ద జరిగిన ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 తర్వాత దేశంలో, రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను పాలకులు హరిస్తున్నారని తెలిపారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవాలని ఆయన సూచించారు. భారతదేశంలో వున్న పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం మరే దేశంలోనూ లేదని ఆయన అన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత ప్రజలు సంతోషంగా వున్నారని అన్నారు. బ్యాక్ వాటర్ ద్వారా ఈ ప్రాంతంలో 25వేల ఎకరాలకు నీరందిస్తున్నా మని ఉత్తమ్ తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టు తెలంగాణలోనే వుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, దేవులపల్లి అమర్, కల్లూరి సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ, శేఖర్, నాయకులు సాముల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఇద్దరు ఆత్మహత్య

యువకుల ఆత్మహత్యకు బెట్టింగ్‌లే కారణమా?

మన తెలంగాణ / మిర్యాలగూడ : రైలు పట్టాలపై పడి ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మిర్యాలగూడ పట్ట ణంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాయి పేటకు చెందిన బైక్ మెకానిక్ బచ్చు చరణ్ (19), సెల్‌షాపు నిర్వాహ కుడు బూరుగు నాగరాజు (20) ఆదివారం తెల్లవారు జామున మిర్యాల గూడ మండలం టీక్యాతండా సమీ పంలో రైల్వే పట్టాలపై శవమై కన్పించారు. బాబుసాయిపేట నుంచి శనివారం నాగరాజుకు చెందిన ద్విచక్ర వాహ నంపై మిర్యాలగూడకు వచ్చారు. రాత్రి మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో స్నేహితులను కలిసినట్లు సమాచారం. ద్విచక్ర వాహనంపై టీక్యాతండాకు వెళ్లి రోడ్డు సమీపంలో వాహనాన్ని నిలిపి రైలు పట్టాలపై పడుకున్నారు. దీంతో రైలు వారి పై నుంచి వెళ్ళడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వీరి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ప్రో కబడ్డీ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యారని, అవి ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్నేహితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నాగరాజు డిగ్రీ పూర్తి చేసి త్రిపురారంలో సెల్ షాపు నిర్వహిస్తుండగా, చరణ్ 7వ తరగతి చదివి మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నల్గొండ రైల్వే ఎస్సై టి. అచ్యుతం కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాణస్నేహితులుగా ఉన్న చరణ్, నాగరాజు మృతితో బాబుసాయిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదుకుంటారనుకున్న కొడు కులు శవమై కనిపించడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

లారీని ఢీకొన్న కారు : ఇద్దరు మృతి

మన తెలంగాణ/కొండపాక : ఆగివున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘనటలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన సంఘటన కొండపాక మండలం కొమురవెల్లి కమాన్ సమీపంలో రాజీవ్‌ర హదారిపై ఆదివారం జరిగింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళుతున్న కారు ఇనుప ఊచల లోడ్‌తో రోడ్డు పక్కన వున్న లారీని వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీలోని ఇనుప ఊచలు కారులో ప్రయాణిస్తున్న వారికి గుచ్చుకున్నాయి. కునా సంతోష్(28), బత్తిని రాజమల్లులు (23) అక్కడికక్కడే మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న శేఖర్, రమేష్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతులు కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన వారు. విదేశాల నుంచి వచ్చిన బత్తిని శేఖర్‌ను గ్రామానికి తీసుకువస్తుండగా ఈ ఘటన జరిగింది. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవమానంతో వివాహిత ఆత్మహత్య

మన తెలంగాణ/తిరుమలగిరి : అత్తారింట్లో దొంగతనం కేసులో జైలు శిక్షపడి విడుదలై అవమానం భారంతో వివాహిత మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబందించి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మాలీపురం గ్రామానికి చెందిన మేకల శ్రావ్యరెడ్డి (25) గత నెల రోజుల తన అత్తారింట్లో ఎవరూ లేని సమయంలో 10 తులాల బంగారం, 70వేల నగదు దొంగిలించిందని, ఈ విషయమై శ్రావ్యరెడ్డి అత్తమామలైన మేకల వెంకట్ రెడ్డి, రమాదేవిలు ఫిర్యాదు చేయగా మృతురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని, ఎండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలై అవమాన భారంతో ఊరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బహిరంగ చర్చకు సిద్ధమేనా!

ప్రాజెక్టులపై ప్రభుత్వానికి మాజీ ఎంపి పొన్నం సవాల్

మన తెలంగాణ/కరీంనగర్‌ప్రతినిధి: నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ అడ్డుకుంటున్నదని గత కొంత కాలంగా ముఖ్యమంత్రి, ఆయన మంత్రి వర్గ సహచరులు చేస్తున్న ప్రచారాన్ని కరీంనగర్ లోక్‌సభ మాజీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ తప్పుపట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నీటి పారుదల ప్రాజెక్టులకు ఇచ్చిన ప్రాధాన్యత, గత మూడేళ్లలో ప్రాజెక్టుల పురోగతిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ఆయన ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆదివారం స్థానిక రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత సంవత్సరం మే 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టుకు భూమి పూజ చేసిన ప్రభుత్వం ఆతరువాత మూడు నెలలకు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు చట్టాలు, నిబంధనలకు లోబడి ప్రభుత్వం ప్రాజెక్టులు చేపడితే సహకరించడానికి తాము సిద్ధమన్నారు. భూనిర్వాసితులకు ఎట్టి పరిస్థితులలో 2013 చ ట్టప్రకారమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ.36 లక్షల బంగారం సీజ్

మన తెలంగాణ/శంషాబాద్ : అక్రమంగా విదేశాల నుండి 1కిలో 233 గ్రాముల బంగారంను తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు సీజ్ చేసిన సంఘటన ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టులో చోటు చేసుకుంది. దుబాయ్ కేంద్రంగా బంగారాన్ని రావాణా చేస్తున్న ఏజెంట్ ద్వారా హైదరాబాద్ వస్తున్న పాసింజర్ శ్యామ్‌బాబు ఓల్టేజ్ కన్వర్టర్ లోపల బిస్కెట్లు అమర్చి బయట నుండి కాపర్ వెల్డింగ్ చేసి కాటన్ బాక్స్‌లో మిగతా సామగ్రితో కాటన్ బాక్స్‌లో ప్యాక్ చేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలించినట్లు తెలిపారు. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల తనిఖీలో పట్టుబడ్డారు. అతన్ని అదుపులోకి తీసుకొని కిలో 233గ్రాముల బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ36,86,670 లక్షలు ఉంటుందన్నారు. తదు పరి విచారణ కోసం కేంద్రం కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఔటర్‌పై నడిస్తే జైలుకే!



- ఈ ఏడాది 19 మంది పాదచారుల మృతి
- ప్రతి రోజూ 2 వేల ఓవర్‌స్పీడ్ కేసులు నమోదు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుపై పాదచారులు కనపడితే జైలుకే పంపిస్తామంటున్నారు పోలీసులు. వారిపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులు నమోదు చేస్తామని కూడా అంటున్నారు. గతంలో పలుమార్లు ఈ రహదారిపై నడుచుకుంటూ వెళ్లినా, ఓఆర్‌ఆర్‌ను దాటినా కఠిన చర్య లు తప్పవని పోలీసులు పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో కేసు, జైలు శిక్షలు అమలు చేయడానికి నిర్ణయించారు. ఓఆర్‌ఆర్‌పై ఈ ఏడాది రోడ్డు దాటుతూ 19 మంది దుర్మణం చెందారు. కొందరు బారికేడ్లను తొలగించి ఓఆర్‌ఆర్‌పైకి వచ్చేస్తున్నారు. దీంతో ఇక ఒఆర్‌ఆర్‌పై పాదచారుల ప్రయాణాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు సైబరాబాద్, రాచకొండ పోలీసులు స్పష్టం చేశారు.ప్రత్యేకంగా పలు జంక్షన్‌లలో సిసి కెమెరాలను ఏర్పా టు చేశారు. మొదట ఐదు జంక్షన్‌లలో వీటిని ఏర్పా టు చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఓ జంక్షన్‌లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు.శంషాబాద్ విమానాశ్రయంలో పనిచేసే ఉద్యోగులు, ఐటి కంపెనీలలో పనిచేసే ఉద్యోగులు ఈ విధంగా ఓఆర్‌ఆర్‌కు ఉన్న ఫెన్సింగ్‌ను కత్తిరించుకుని మరి రోడ్లపైకి వచ్చి అడ్డం గా క్యాబ్‌లను ఆపి ప్రయాణిస్తున్నారు. ఓఆర్‌ఆర్‌పై పాదచారులు కనిపిస్తే వారిని క్షేమంగా ఠాణాకు తీసుకువచ్చి సెక్షన్ 188తో పాటు ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసును నమోదు చేస్తున్నారు. ఈ సెక్షన్‌ల కింద రూ.10 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం : 19 మంది మృతి

ఓఆర్‌ఆర్ పాదచారులు వారి సౌకర్యం కోసం చేసిన చిన్న తప్పిదాలు 12 చోట్ల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేలా చేసాయి. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఓఆర్‌ఆర్ దాదాపు 90 కిలోమీటర్‌ల విస్తీరణంలో ఉంది. వీటిలో 12 ప్రాంతాల్లో సర్వీసు రోడ్డులు పాదచారులు, జంతువులు రాకుండా ఉండేందుకు హెచ్‌ఎండిఎ కంచెను ఏర్పాటు చేసింది. ఈ12 ప్రాంతాల్లో ఏడాది కాలం లో కంచెను కత్తిరించి వచ్చి ఓఆర్‌ఆర్‌పై నుంచి అవతలి రోడ్డుకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో మొత్తం 19 మంది మృత్యువాత పడ్డారు. అదే విధంగా పలు సంఘటనల్లో వీరిని తప్పించబోయి వేగంగా ఉండే వాహనదారులు డివైడర్‌లను ఢీ కొట్టి తీవ్ర గాయాలపాలయ్యారు. సైబరాబాద్, రాచకొండ పోలీసులకు పాదచారులు ఆకస్మాత్తుగా డివైడర్ చెట్ల మధ్య నుంచి వస్తుండడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని పోలీసులు గుర్తించారు.

ఓఆర్‌ఆర్‌పై ప్రతి రోజూ 2 వేలకుపైగా ఓవర్ స్పీడ్ కేసులు

ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు చేస్తున్న సూచనలను వాహనదారులు విస్మరిస్తున్నారు. ప్రతి రోజు ఈ రహదారిపై ఓవర్ స్పీడ్ కేసులు 2వేలకు పైగా నమోదు అవడమే ఇందుకు నిదర్శనం. దీని బట్టి ఓఆర్‌ఆర్‌పై వాహనాల వేగం తాకిడి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. పాదచారులను అడ్డుకునేందుకు క్రిమినల్ కేసులను నిరంతరం గస్తీ ని నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా పాదచారులను గుర్తించేందుకు 22 కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వ సహాయాన్ని కోరు తున్నారు. టోల్ గేట్‌ల వద్ద ఉన్న కెమెరా లు, స్పీడ్‌లేజర్ గన్‌లు కాకుండా కేవలం ఈ కెమెరాలు పాదచారులను గుర్తించేందుకు మాత్రమే ఉపయోగించనున్నారు.

ఉద్రిక్తత మధ్య ఓయులో విద్యార్థుల సదస్సు



మన తెలంగాణ/ఉస్మానియా యూనివర్సిటీ :పోలీస్ బలగాలు.. వాగ్వాదాలు...అరుపులు.. నినాదాల నడుమ ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థుల సదస్సు జరిగింది. సదస్సు హాలులోనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, సదస్సు హాలు పక్కనే కాచిగూడ ఎసిపి లక్ష్మి నారాయణ, హాలు వద్దే యూనిఫామ్‌లో పోలీసులు, కామర్స్ కళాశాల గేట్ వద్ద ఎస్సై సైదులుతోపాటు మరికొంత సంఖ్యలో పోలీసుల పహారా నడుమ 'ప్రజా ఉద్యమాలు ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై దళిత, ఆదివాసీ, వామపక్ష, మైనార్టీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సదస్సును ఓ.యూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు.

ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన, అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు మొదలైన అంశాలపై నిజా..నిజాలు తెలుసుకునేందుకు 2016 డిసెంబర్‌లో టిడిఎఫ్ బృందం సభ్యులను భద్రాచలం ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో ఒకవైపు తెలంగాణ పోలీసులు.. మరోవైపు ఛత్తీస్‌ఘఢ్ పోలీసులు అరెస్టు చేసి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా జైలుకు తరలించారు. 6 నెలల జైలు జీవితం తర్వాత గత రెండు నెలల క్రితం జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఓ.యూలోని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ,పిడిఎస్‌యు, టివిఎస్, డిఎస్‌యూ,సిఎంఎస్, ఓయూఆర్‌ఎస్, ఎ ఎస్‌ఏ, డిబిఎస్‌ఏ, ఎఎంఎస్‌ఎ, బివిఎస్, ఎ ఎస్‌యూ, ఎపిఎస్‌ఎ మొదలైన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. సదస్సుకు హాజరైన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మాట్లాడబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. టిడిఎఫ్ నిజ నిర్ధారణ బృందం సభ్యుల్లో ఒకరైన పల్లా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘఢ్‌లో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులపై నిజా..నిజాలు తెలుసుకునేందుకు 2016 డిసెంబర్‌లో బయలుదేరామని వివరించారు. అయితే తమను తెలంగాణ పోలీసులు వెంబడించి.. భద్రాచలం ఛత్తీ స్‌ఘఢ్ సరిహద్దులో పోలీసులకు అప్పగించారని, దీంతో తమ బృందం సభ్యులపై అక్కడ, ఇక్కడ అక్రమ కేసులు బనాయించారని ఆయన తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ సుక్మా జైలులో ఆరు నెలల పాటు అక్రమంగా నిర్బంధించారని చెప్పారు. అయితే ఛత్తీస్‌ఘడ్‌లో అమాయకులను, ఆదివాసీలను అక్రమంగా అరెస్టులు చేసి జైలుకు తరలిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని వివరించారు. ఓయూలో జరుగుతున్న సదస్సుపై నిర్బంధాన్ని చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేదా? అనే ప్రశ్న ఉదయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టివిఎస్ అధ్యక్షులు కోట శ్రీనివాస్, తెలంగాణ దళిత విద్యార్థి సంఘం అధ్యక్షులు భూపల్లి నారాయణ, ఏఐఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్షులు రహమాన్, పిడిఎస్‌యు నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు, రంజిత్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు ముసావీర్, ప్రేమ్, డిఎస్‌యు నాయకులు కంచర్ల బద్రి, సిఎంఎస్ నాయకురాలు శిల్ప, విద్యార్థి జేఏసి నాయకులు అశోక్ యాదవ్, డిఎంఎస్‌ఎ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పాస్ ఉన్నా ఆగని అక్రమాలు


- ప్రజా పంపిణీ వ్యవస్థలో మళ్లీ పాత పరిస్థితే
- సరుకుల్ని స్వాహా చేస్తున్న రేషన్ డీలర్లు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: హైదరాబాద్ మహానగరంలోని ప్రజా పంపిణీ వ్యవస్థలో పౌరసరఫరాల శాఖ అమలు చేస్తున్న ఈపాస్ విధానం లోనూ అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈపాస్ విధానం అమలైనప్పటికీ నుంచి వినియోగదారుడు, వారి కుటుంబ సభ్యులు రేషన్‌షాపులకు వచ్చి వేలిముద్ర వేసిన తరువాతనే డీలర్లు వారికి సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈవిధానం అమలుతో రేషన్ అక్రమాలకు చాలా వరకు అడ్డుకట్టపడింది. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ పాస్ విధానం అమలైన అక్రమాలు మాత్రం ఆగడం లేదని, డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈపాస్ మిషన్‌పై వినియోగదారుడు వేలిముద్ర వేసిన వెంటనే పంపిణీ చేయని సరుకులు సైతం డీలర్లు ఈపాస్ మిషన్‌లో ఫీడ్ చేసి వాటిని పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిసింది. డీలర్లు సాంకేతిక పరిజ్ఞానానికి మరింత పదును పెట్టి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా వివిధ కారణాలతో రేషన్ సరుకులు తీసుకుని వారి కోటా సైతం డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా స్వాహా చేస్తున్నారు. ఈ పాస్ మిషన్‌లో వేలిముద్ర లేకుండా ఎర్రర్‌తో సరుకులు డ్రా అయ్యేటట్లు, వేలిముద్ర పడిన తరువాత అది అడ్జెస్ట్ జరిగేలా ఈపాస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్‌ను మార్చుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో సరుకులకు దూరంగా ఉంటున్న వినియోగదారుల కోటా పక్కదారి పడుతున్నట్లు సమాచారం. ఈ అవినీతి దందాకు తెర లేపినప్పటి నుంచి నగరంలోని పలు రేషన్‌షాపుల్లో గత రెండు మూడు నెలలుగా సరుకులు మిగులు బాటు తగ్గుముఖం పడుతున్నట్లు తెలిసింది. ప్రతి నెలా మహానగరంలో 40శాతం వరకు సరుకులు మిగులుతాయి. తాజాగా అది 25 నుంచి 20 శాతానికి పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ పాస్ అమలుకు ముందు ప్రతి నెల దాదాపు 90 నుంచి 95 శాతం వరకు సరుకులు డ్రా కాగా, ఈ పాస్ అమలుతో 60 నుంచి 65 శాతానికి పడిపోయింది. ఈపాస్ విధానంలోనూ అక్రమాలు చోటు చేసుకుంటుండంతో పౌరసరఫరాల శాఖలో మళ్లీ పాత పరిస్థితి నెలకుంది. ప్రస్తుతం మహానగరంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో పౌరసరఫరాల శాఖకు చెందిన 12 అర్బన్ సర్కిళ్లు ఉన్నాయి. ఈ సర్కిళ్ల పరుధుల్లో ఏడాదిన్నతర క్రితం 13.57 లక్షల ఆహార కార్డులు ఉన్నాయి. ఈ-పాస్ విధానం అమలు చేసిన మూడు నెలల పాటు వరుసగా సరుకులు తీసుకుని కార్డులను అధికారులు ఏరివేత వేశారు. దీంతో ప్రస్తుతం ఆహారభద్రత కార్డుల సంఖ్య 11.10 లక్షలకు చేరింది. ప్రతి నెల సగటున 6.50 లక్షల నుంచి 7.50 లక్షల వినియోగదారులు మాత్రమే సరుకులు తీసుకోవడం జరిగింది. దీంతో సరుకుల మిగులుబాటు పెరిగింది. తాజాగా డీలర్ల చేతివాటంతో పరిస్థితి తిరిగి షరా మాములుగా మారింది. .

చెట్టును నరికితే మనకే చేటు

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రేణుకాచౌదరి



మన తెలంగాణ/ఖమ్మం అర్బన్ : శాటిలైట్ ద్వారా రైతాంగానికి వర్షం, కరువు పరిస్థితులు భూగర్భ జలాలు గుర్తించవచ్చని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రేణుకాచౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని వెలుగుమట్లలో ఉన్న అటవీ పార్కును కమిటీ సందర్శించింది. తొలుత కమిటీ చైర్మన్ రేణుకచౌదరి సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం రేణుకాచౌదరి మాట్లాడుతూ దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అమలు పరిస్థితి, పరిశోధనకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు సక్రమంగా వినియోగమవుతున్నాయా లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉందని విచరక్షణారహితంగా అడవులను నరికేయడం వల్ల మానవ మానుగడే ప్రశ్నార్థకమవుతుందని ఆమె అన్నారు. భావితరాలకు పరిశుభ్రమైన నీరు, గాలి ఇవ్వాలంటే మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఐటిసి వదులుతున్న కలుషిత నీరు వల్ల గోదావరి నది జలాలు పాడవుతున్నాయని గంగానదికి పరిరక్షణ కమిటీ ఉన్నట్లుగానే గోదావరి నది జలాలను పరిరక్షించేందుకు కమిటీ వేయాలని పార్లమెంటులో సిఫారసు చేయనున్నట్లు ఆమె తెలిపారు. తన జీవితమంతా చెట్లను పెంచడానికే వెచ్చించినా పద్మశ్రీ వనజీవి రామయ్యను ఆమె అభినందించి ఘనంగా సన్మానించారు. కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి 300 నివేదికలను ప్రభుత్వానికి అందించిందన్నారు.అటవీ శాఖాధికారులు పార్కు అభివృద్ధి కోసం చేపడుతున్న పనులకు సంబంధించిన వివరాలను ఫారెస్టు అధికారి డా.సునీల్ ఎస్‌హిరామత్ కమిటీకి వివరించారు. కమిటీ సభ్యులు ఫంకజ్ చౌదరి, ఎస్‌ఆర్ బాలసుబ్రహ్మణ్యం,నామదేశ్వర ప్రసాద్, వందన చౌహాన్, సిహెచ్ సుక్రాంసింగ్ యాదవ్, నాగేంద్రసిం పాల్గొన్నారు.



బిజెపి నేత రాంమాధవ్‌తో బిసి సంఘాల భేటీ

బిసి బిల్లుకు మద్దతు కోరిన సంఘాలు


మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్: పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పూర్తిస్థాయి మద్దతు ఇవ్వాలని కోరుతూ వివిధ బిసి సంఘాల నాయకులు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఆదివారం బిజెపి జాతీయ నేత రాంమాధవ్, తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు డాక్టర్.కె.లక్ష్మ ణ్‌లను కలిసి కోరారు. ఈ సందర్భంగా బిసి బిల్లుపై చర్చలు జరిపారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయరంగంలో బిసిల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. రాంమాధవ్‌ను కలిసిన వారిలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి జి.రమేష్, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, నర్సింహా గౌడ్, పెరిక సురేష్, రామలింగం పాల్గొన్నారు.

ఖనిలో విలేకరి దారుణహత్య

మన తెలంగాణ/గోదావరిఖని : సీనియర్ పాత్రికేయుడు అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీను(40) పై గుర్తు తెలియనిని దుండగులు దాడి చేయగా అక్కడిక్కడే మరణించిన సంఘటన గోదావరిఖని పట్టణంలో సంచలనం సృష్టించింది. పట్టణానికి చెందిన అరుకోళ్ల శ్రీనివాస్ గత 20 ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నాడు. 2010లో ఎర్రగొల్ల రమేష్ అనే ఐడి పార్టీ కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడుగా ఉం డడంతో పాటు మరో రెండు హత్య కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు ఈ కేసులో నేటికి విచారణ కొన సాగుంతుంది. ఆదివారం ఉదయం 8.00గంటల ప్రాంతంలో శ్రీనివాస్ దంపతులు ఇంట్లోని ముందు గదిలో మాట్లాడుతుండగా గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు వచ్చి మీతో మాట్లాడని శ్రీనివాస్‌తో నమ్మబలికారు దీనితో భార్య కిచన్‌లోకి వెళ్లింది. వెంటనే దుండగులు శ్రీనివాస్‌పై ఒక్కసారిగా కత్తులతో దాడి చేయగా, గదిలోనే కుప్ప కూలిపోయాడు. భార్య కిచెన్‌లోనుంచి పరిగెత్తుకుంటూ ముందుగదిలోకి వచ్చి దుండగులను అడ్డుకోగా ఆమెపై కూడా దాడికి పాల్పడ్డారు. ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. ఘటన స్థలాన్ని సిపి విక్రం జీత దుగ్గల్, పెద్దపల్లి డిసిపి విజేందర్‌రెడ్డి, ఎసిపి అపూర్వరావు, సిఐ గజ్జి కృష్ణలు పరిశీలించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డుపై బట్టలు ఉతుకుతూ ప్రజల నిరసన

కుంటను తలపిస్తున్న సిద్దాపూర్ కాలనీ



మన తెలంగాణ/సదాశివపేట : సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట పట్టణం నుండి సిద్దాపూర్ కాలనీకి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షాలకే పెద్ద పెద్ద గుంతలుగా మారి కుంటలను తలపిస్తుందని ఆ కాలనీ వాసులు ఆదివారం ఆ రోడ్డుపై బట్టలు ఉతుకుతూ నిరసన వ్యక్తం చేశారు. గతంలో అనేక దఫాలుగా సిపిఐ ఆధ్వర్యంలో సిద్దాపూర్ కాలనీకి సిసి రోడ్డు వేయాలని పలుమార్లు నిరసనలు, విజ్ఞప్తులు చేసినా నేటికీ ఈ రోడ్డును పట్టించుకోలేకపోయారన్నారు. ఈ గ్రామం నుంచి 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ఈ రోడ్డు నుంచి గర్భిణీలు, అత్యవసర చికిత్సల నిమిత్తం వెళ్లేవారి బాధలు వర్ణించలేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి రోడ్డు పనుల ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు, కాలనీ వాసులు కోరారు. నిరసనలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు తాజొద్దిన్, ఇన్సాప్; రఫియొద్దీన్, హుస్సేన్, రవి, అంజయ్య, అశోక్, అఫ్జల్, పాష శ్రీనివాస్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

ఎస్ఐపై దాడికి యత్నించిన ఇద్దరు అరెస్టు

మన తెలంగాణ/ముషీరాబాద్ : రోడ్డుకు అడ్డంగా వెళ్లగా, అదేమని అడిగిన ఓ కారు యాజమానిపై పిడిగుద్దులు కురిపించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా దుర్భాషలాడి, దాడికి దిగారు. ఈ ఘటన హిమాయత్‌నగర్ మెయిన్‌రోడ్డులో శనివారం జరిగింది. నగరానికి చెందిన బలరామ్, హరితా అగర్వాల్‌లు శనివారం సాయంత్రం బైక్‌పై వెళ్తు హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న బిఎండబ్ల్యు కారును ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించగా, కారు యజమాని ఎందుకలా ఓవర్ టేక్ చేస్తున్నారని అడగడంతో కారు డోరు తెరిచి అతన్ని బయటకు లాగి పిడిగుద్దులు కురిపించాడు. అక్కడే ఉన్న నారాయణగూడ ఎస్ఐ. సైదులు ఈ ఘటనను సెల్‌ఫోన్‌లో వీడియో తీసే ప్రయత్నం చేసాడు. దీంతో రెచ్చిపోయిన బలరామ్, అతని స్నేహితురాలు హరితా అగర్వాల్ ఎస్ఐ సైదులును కూడా దుర్భాషలాడి దాడికి యత్నించారు. ఈ క్రమంలో హరితా అగర్వాల్ ఎస్ఐని బలంగా వెనక్కి నెట్టివేసింది. దీంతో ఎస్ఐ. సైదులు వెంటనే పిఎస్‌కు చెందిన మహిళా సిబ్బందిని రప్పించి హరితా అగర్వాల్‌ను, బలరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


ఒక్క ఫైట్ కూడా లేకుండా...

ఈ మధ్యన యంగ్ హీరోలు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లు, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లతో మంచి హిట్‌లు అందుకుంటున్నారు. ప్రేక్షకుల అభిరుచి మేరకు ఈ తరహా సినిమాలు చేస్తూ విజయాలను సొంతం చేసుకుంటున్నారు. అయితే కొందరు యువ కథానాయకులు ఫైట్లు, యాక్షన్, మాస్ ఇమేజ్‌పై ఆసక్తి చూపుతూ ఫ్లాపులతో వెనుకపడిపోతున్నారు. గతంలో నాని, శర్వానంద్, నితిన్ ఇలాగే యాక్షన్ సినిమాలతో ఫ్లాపులు చూసి ఈమధ్యన లవ్ ఎంటర్‌టైనర్‌లతో హిట్‌లు అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయం సాయిధరమ్ తేజ్‌కు కూడా తెలిసి వచ్చినట్లుంది. మాస్ ఇమేజ్ కోసం ప్రయత్నించి ప్రయత్నించి అతను కాస్త వెనుకబడిపోయాడు. అందుకే కరుణాకర్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నాడట. ఈ సినిమాలో ఒక్క ఫైట్ కూడా ఉండకుండా చూడమని కరుణాకరన్‌కు చెప్పేశాడట. ఎలాగైనా ఈ లవ్ ఎంటర్‌టైనర్‌తో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని సాయిధరమ్‌తేజ్ తహతహలాడుతున్నాడు.


సాయిధరమ్ తేజ్


పైసా వసూల్ ఆడియో సక్సెస్ వేడుకలో ఛార్మి, శ్రేయ శరణ్, బాలకృష్ణ, ముస్కాన్ సేథీ, కైరాదత్

రాక్షసుడి పాత్రలో..?



'రుద్రమదేవి' మూవీతో పెద్ద రిస్క్ చేసి చివరికి మంచి హిట్‌ను అందుకున్నాడు దర్శకనిర్మాత గుణశేఖర్. ఈ ప్రాజెక్ట్ ద్వారా తన స్థాయి ఎలాంటిదో చాటి చెప్పాడు. అనంతర తన నెక్స్ట్ మూవీ కోసం సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నాడు గుణశేఖర్. హిరణ్యకశిపుడిపై ఓ పౌరాణిక చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఈ మూవీలో వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తాడనే వార్త కొన్ని రోజుల నుంచి హల్‌చల్ చేస్తోంది. హరి భక్తుడైన ప్రహ్లాదుడి తండ్రి హిరణ్యకశిపుడు ఇంటా బయ టా కానీ... పగలు రాత్రి కానీ... మనిషి, మృగం, దేవుడు ద్వారా చావు లేకుండా వరం పొందిన ఓ రాక్షసుడు. విష్ణుమూర్తి భక్తి నుంచి బయటకు రావాలని తన కొడుకు ప్రహ్లాదుడిని చిత్ర హింసలు పెడతాడు. చివరకు నరసింహస్వామి అవతారంలో వచ్చిన విష్ణుమూర్తి హిరణ్యకశిపుడిని అంతమొందిస్తాడు. ఈ కథనే లేటెస్ట్ టెక్నాలజీతో రూపొందించేందుకు సిద్ధమవుతున్నాడు గుణశేఖర్. అయితే ఈ రాక్షసుని పాత్రకు గుణశేఖర్ ఆప్షన్ వెంకటేష్ కాదని... దగ్గుబాటి రానా అని తెలిసింది. విభిన్న చిత్రాలు ముఖ్యం గా చారిత్రక, జానపద చిత్రాలతో తన సత్తా చాటుతున్న రానా ఈ పౌరాణిక చిత్రంలో హిరణ్యకశిపుడి పాత్రలో నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నాడట. ఇటీవల నేనే రాజు నేనే మంత్రి చిత్రంతో మంచి సక్సెస్ అందుకున్న రానా మరో సారి కొత్త జోనర్‌లో సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నాడని తెలిసింది. త్వరలో హిరణ్యకశిపుడి చిత్రం షూటింగ్ ప్రారంభంకానుందని తెలిసింది.

రానా

బాలకృష్ణ డ్యూయల్ రోల్



నందమూరి బాలకృష్ణ ఇప్పుడు 'పైసా వసూల్' ప్రచారంలో బిజీగా ఉన్నాడు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. మరో వైపు తన తదుపరి చిత్రం షూటింగ్ కూడా ఇప్పటికే మొదలుపెట్టేశాడు బాలకృష్ణ. కె.ఎస్.రవి కుమార్ దర్శకత్వంలో బాలయ్య నటిస్తున్న 102వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. బాలకృష్ణకు జోడీగా సౌత్ బ్యూటీ నయనతార నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఈ షూటింగ్ అంతా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ అని తెలిసింది. అంటే ఫ్లాష్‌బ్యాక్‌లో బాలయ్యకు జోడీగా నయనతార నటిస్తోందన్న మాట. ఈ సన్నివేశాల్లో ఆయన గెటప్ కూడా విభిన్నంగా కనిపించనుండగా... రన్నింగ్ స్టోరీలో బాలకృష్ణ మరో కొత్త గెటప్‌లో కనిపిస్తాడట. ఆ పాత్రకు ఇద్దరు హీరోయిన్‌లు ఉంటారని తెలిసింది. తండ్రీ కొడుకులుగా బాలకృష్ణ కనిపించి సందడి చేయనున్నాడన్నది తాజా సమాచారం. గతంలో సింహా, లెజెండ్ చిత్రాల్లో తండ్రీ కొడుకులుగా కనిపించి అలరించి బంపర్ హిట్స్ కొట్టిన బాలకృష్ణ ఇప్పుడు మరో సారి అదే ఫీట్‌ను రిపీట్ చేయాలనుకుంటున్నాడు.

నవతరం ప్రేమ కథ


ఆశిష్‌రాజ్, సిమ్రాన్

'ఆకతాయి' వంటి మంచి సక్సెస్ తర్వాత వికెఎ ఫిలిమ్స్ నిర్మాణ సంస్థ రూపొందిస్తున్న రెండవ చిత్రం 'ఇగో'. విజయ్ కరణ్, కౌశల్ కరణ్, అనిల్ కరణ్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆశిష్ రాజ్, సిమ్రాన్‌లు జంటగా నటిస్తున్నారు. ఈ నవతరం ప్రేమకథకు సుబ్రమణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే రెండు షెడ్యూళ్లు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ కోసం గోదావరి పరిసర ప్రాంతాలకు వెళ్లనుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''కుటుంబంతో కలిసి చూడదగ్గ రొమాంటిక్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'ఇగో' చిత్రం రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఈ చిత్రంలో కథానాయకుడి క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేయనున్నాం''అని అన్నారు. దీక్షాపంత్, రావు రమేష్, పోసాని కృష్ణ మురళి, పృథ్వీ, గౌతంరాజు, షకలక శంకర్, చంద్ర, వేణు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః సాయికార్తీక్, సినిమాటోగ్రఫీః ప్రసాద్ జి.కె, ఆర్.కె, ఫైట్స్ః నందు.

లవ్, హర్రర్ ఎంటర్‌టైనర్


సాయి కిరణ్, ప్రాచి అధికారి

సాయి కిరణ్, ప్రాచి అధికారి హీరోహీరోయిన్లుగా మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ ప్రధాన పాత్రలో తుల్జా భవాని ఫిలింస్ పతాకంపై పి.విజయ శేఖర్ సమర్పణలో కృష్ణమోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'వలపు సౌధం'. సునీల్ సాగర్, మజ్ను సౌహ్రాట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ చిత్రం ఆడియోను త్వరలో విడుదల చేసి చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన సునీల్ సాగర్ మాట్లాడుతూ ''లవ్, హర్రర్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రంలో ఏడు పాటలున్నాయి. నూతన సంగీత సంగీత దర్శకుడు ఎస్.కె.మజ్ను స్వరపరిచిన పాటలు శ్రోతలను అలరిస్తాయి. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది''అని అన్నారు. దర్శకుడు కృష్ణ మోహన్ మాట్లాడుతూ ''నువ్వే కావాలి, ప్రేమించు చిత్రాల తర్వాత సాయికిరణ్‌కు ఈ చిత్రం మంచి బ్రేక్ ఇవ్వగలదు.

మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఈ క్యారెక్టర్ చిత్రానికే హైలైట్‌గా నిలుస్తుంది''అని తెలిపారు. సత్యప్రకాష్, జీవా, కవిత, కోట శంకరరావు, సంపత్ రాజ్, తిరుపతి ప్రకాష్, దిల్ రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః యాదగిరి, ఫైట్స్ః సూపర్ ఆనంద్, ఎడిటింగ్ః సాయి శ్రీనివాస్, ఆర్ట్ః నాగేశ్వర రావు, డ్యాన్స్ః బ్రదర్ ఆనంద్.

గ్లామర్ డోస్ పెంచేసింది


రాయ్ లక్ష్మీ

కోలీవుడ్‌లో హీరోయిన్‌గా వెలుగులు విరజిమ్ముతూనే టాలీవుడ్‌లో ఐటమ్ బ్యూటీగా క్రేజ్ సంపాదించేసుకుంది రాయ్ లక్ష్మీ. ఖైదీ నంబర్ 150 చిత్రంలో మెగాస్టార్ చిరంజీవితో చిందులు వేసి తనలోని టాలెంట్ ఏ రేంజ్‌లో ఉంటుందో చూపించేసింది ఈ భామ. అంతకుముందే పవన్‌కళ్యాణ్ మూవీ సర్దార్ గబ్బర్ సింగ్‌లో ఐటమ్ సాంగ్‌లో స్టెప్పులు వేసి అలరించింది. ప్రస్తుతం ఈ భామ బాలీవుడ్‌లో 'జూలీ 2' చిత్రంలో టైటిల్ రోల్ చేస్తోంది. ఇందులో అందాల ప్రదర్శన విషయంలో ఏమాత్రం రాజీపడడం లేదు. అయితే ఈ చిత్రం రిలీజ్ కాస్త ఆలస్యమవుతోంది. ఏడాదిన్నర క్రితమే 'జూలీ 2' చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అప్పుడే 2016 ఆగస్టు 12న సినిమా రిలీజ్ అని ప్రకటించారు. అప్పటి నుంచి సినిమా విడుదల అనేక సార్లు వాయిదాపడుతూ వస్తోంది. అయితే ఎప్పటికప్పుడు రాయ్ లక్ష్మీ తన కొత్త ఫొటోలతో ఈ సినిమాను వార్తల్లో నిలిపేందుకు కష్టపడుతూనే ఉంది. దీపక్ శివదాసాని దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. ఇక అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకొని ఈ చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా అనేది చూడాలి.

సాయేషాకు గోల్డెన్ ఛాన్స్


సాయేషా సైగల్

అక్కినేని అఖిల్ హీరోగా అపరిచయమైన చిత్రం 'అఖిల్'లో సాయేషా సైగల్ హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం నిరాశపరచడంతో ఆతర్వాత కోలీవుడ్‌కు వెళ్లి అక్కడ జయం రవితో 'వనమాగన్' చిత్రంలో నటించింది. గ్లామరస్ తారగా తమిళ ప్రేక్షకుల మనసు దోచుకుంది. దీంతో కోలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. ఈమధ్యే ప్రభుదేవా డైరెక్షన్‌లో విశాల్, కార్తీ నటిస్తున్న ఒక చిత్రానికి సైన్ చేసింది సాయేషా. ఇప్పుడు ఈ బ్యూటీకి మరో గోల్డెన్ ఛాన్స్ దక్కింది. ప్రస్తుతం తమిళ్ స్టార్ హీరోల్లో మంచి ఫామ్‌లో ఉన్న నటుడు విజయ్ సేతుపతి. ఇటీవలే 'విక్రమ్ వేద'తో మంచి విజయాన్ని అందుకున్న సేతుపతి త్వరలో చిరంజీవి 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి'లో సైతం నటించనున్నాడు. అలాగే దర్శకుడు గోకుల్ డైరెక్షన్‌లో 'జుంగా' అనే సినిమాలో నటించబోతున్నాడు. ఈ సినిమాలో సాయేషా ప్రధాన హీరోయిన్‌గా చేయనుంది. ఈ చిత్రం ఆమెకు లక్కీ ఆఫర్ అని అంటున్నారు. యంగ్ హీరోయిన్‌గా రాణించేందుకు ఈ చిత్రం సాయేషాకు ఎంతగానో తోడ్పడుతుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఎక్కువ భాగం ప్యారిస్‌లో చిత్రీకరిస్తారని తెలిసింది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కే ఈ చిత్రం సాయేషా కెరీర్‌లో స్పెషల్ మూవీగా నిలవనుంది.

కేథరిన్ టైమ్ స్టార్ట్స



టాలీవుడ్‌లో కేథరిన్ కెరీర్ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. గత ఏడాది సరైనోడు చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకుంది ఈ భామ. ఇటీవల 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రంలో ఓ న్యూస్ ఛానల్ హెడ్ పాత్రను గ్లామరస్‌గా పోషించడంలో సక్సెస్ అయింది. ఆ పాత్రను కేథరిన్ పండించిన తీరు చూసి ఆమెకు గ్లామర్ ప్లస్ పర్‌ఫార్మెన్స్ క్యారెక్టర్లను ఇచ్చేందుకు ఫిల్మ్‌మేకర్స్ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ఆమెను ఓ క్రేజీ ప్రాజెక్ట్ కోసం సంప్రదించారని తెలిసింది. తమిళ్‌లో సక్సెస్ అయిన బోగన్ మూవీని తెలుగులో రవితేజ హీరోగా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తమిళ వర్షన్‌లో హన్సిక చేసిన పాత్ర కోసం కేథరిన్‌ను సంప్రదించగా ఆమెకు ఈ పాత్ర నచ్చడంతో వెంటనే ఈ సినిమాకు ఓకే అని చెప్పిందట. త్వరలోనే ఈ మూవీ పట్టాలెక్కుతుందని... బోగన్ రీమేక్ ద్వారా కేథరిన్‌కు తెలుగులో మరింత క్రేజ్ పెరగడం ఖాయమని అంటున్నారు. అలాగే త్వరలో షూటింగ్ ప్రారంభంకానున్న ఓ బడా తమిళ్ మూవీ కోసం కూడా కేథరిన్‌తో చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. ఇక తన పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో కేథరిన్ సక్సెస్ అవుతోంది. టాలీవుడ్‌లో 27 ఏళ్ల కేథరిన్ టైమ్ స్టార్ట్ అయినట్లేనని సినీ వర్గాలు అంటున్నాయి.




వృద్ధి గణాంకాలు, డెరివేటివ్స్ కీలకం

న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాలు, డెరివేటివ్స్ గడువు ముగింపు వంటి అంశాలు ఈ వారం మార్కెట్‌ను శాసిస్తాయని నిపుణులు అంటున్నారు. ప్రత్యేకించిన దేశీయ త్రైమాసిక ఆర్థిక వృద్ధి గణాంకాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టారు. సెప్టెంబర్ 1న పిఎంఐ తయారీ గణాంకాలు, మరోవైపు వాహన సంస్థ నెలవారీ విక్రయాలు విడుదల కానున్నాయి. అయితే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు గురువారం(ఆగస్టు 31)తో ముగియనున్న నేపథ్యంలో మార్కెట్ సూచీలు ఒడిదుడుకులను ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ సంకేతాలు కూడా పరిశీలించాలని, విదేశీ పెట్టుబడుల కదలికలను గమనించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతవారం సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడు రోజులు లాభపడ్డాయి. సెన్సెక్స్ 28 పాయింట్ల పెరుగుదలతో 31,596 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 4 పాయింట్లు లాభపడి 9,857 వద్ద ముగిశాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.1,044 కోట్ల మేర కొనుగోళ్లు నిర్వహించారు. విదేశీ మదుపరులు(ఎఫ్‌పిఐ) రూ.696 కోట్ల నికర అమ్మకాలు జరిపారు. ఈవారంలో ఇన్ఫోసిస్ జోష్‌ను చూపనుందని భావిస్తున్నారు. మరోవైపు ఒడిదుడుకులు ఎదురవనున్న నేపథ్యంలో మదుపరులు ఆచితూచి వ్యవహరించాలని నిపుణులు చెబుతున్నారు.

100 కోట్ల విజన్

భారతీయులను ఒకే తాటిపైకి తెచ్చిన జన్‌ధన్, ఆధార్, మొబైల్ : జైట్లీ

న్యూఢిల్లీ: సామాజిక విప్లవంలో జామ్(జన్‌ధన్, ఆధార్, మొబైల్) త్రయం కీలకపాత్ర పోషించాయని, భారతీయులు అంతా ఒకే డిజిటల్, ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. 100 కోట్లు, 100 కోట్లు, 100 కోట్లు విజన్‌ను దేశం చేరుకుంటోందని అన్నారు. వంద కోట్ల ఆధార్ నంబర్లు 100 కోట్ల బ్యాంక్ ఖాతాలు, వంద కోట్ల మొబైళ్లకు అనుసందానిస్తామని అన్నారు. దీంతో భారతీయులు అంతా ఒకే ఆర్థిక, డిజిటల్ వ్యవస్థలోకి చేరనున్నానని జైట్లీ వివరించారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన(పిఎంజెడివై) మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు పెట్టారు. జన్‌ధన్, ఆధార్, మొబైల్ వినియోగదారుల సంఖ్య 100 కోట్లవైపు వెళుతోందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ డిజిటల్ రూపంలో ఏకతాటిపైకి వస్తుందని అన్నారు. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)తో ఏక పన్ను విధానం అమల్లోకి వచ్చినట్లే ఈ అనుసంధానంతో దేశం మొత్తం ఒకే ఆర్థిక వ్యవస్థ కిందకు వస్తుందని తెలిపారు. దీనికి అవతల మరే భారతీయుడు ఉండే అవకాశం లేదని అన్నారు. ప్రస్తుతం లక్ష్యం పెద్దదే అని, అయినా కొనసాగుతామని పేర్కొన్నారు. ప్రస్తుత జన్‌ధన్ ఖాతాల ద్వారా 7 కోట్ల మంది పేదలు ప్రతినెలా ఎలక్ట్రానిక్ విధానంలో చెల్లింపు చేస్తున్నారని అన్నారు. ఎలక్ట్రానిక్ విధానంలో చెల్లింపులు మరింతగా పెరుగుతున్నాయని అన్నారు. భీమ్ యాప్, యుపిఐ(యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్), జామ్‌లు పూర్తిగా ఫలవంతమయ్యాయని అన్నారు. భారతదేశం నగదును ఉపయోగించే దేశమని, ఆర్థిక, సాంఘిక లావాదేవీలన్నీ నగదుతోనే జరుగుతున్నాయని అన్నారు. అక్రమ లావాదేవీల వల్ల అటు ప్రజలకు నష్టం జరుగుతోందని, ఇటు ప్రభుత్వం పన్ను ఎగవేతదారుల వల్ల బాధపడుతోందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం బ్యాంకింగ్ రంగాన్ని వేగంగా మార్చేస్తోందని అన్నారు. త్వరలోనే బ్యాంకింగ్ రంగం స్మార్ట్ ఫోన్లలో భాగమైపోతుందన్నారు.





పాన్-ఆధార్ గడువు పొడిగింపు ఉండదు

న్యూఢిల్లీ: పాన్(శాశ్వత ఖాతా సంఖ్య)తో ఆధార్ అనుసంధానం ప్రక్రియకు గడువు ఈ నెలాఖరేనని, పొడిగింపు ఉండబోదని యుఐడిఎఐ సిఇఒ అజయ్‌భూషన్ పాండే స్పష్టం చేశారు. ఆదాయ పన్ను చెల్లింపుదారుల పాన్–ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని అన్నారు. అనుసంధానానికి గడువులో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. సుప్రీంకోర్టు తాజా నేపథ్యంలో ఈ నిబంధనపై ఎలాంటి మార్పు వుంటుందని ప్రశ్నించినపుడు ఆయన ఇలా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 31 తో పొడిగించిన గడువు నాటికి ఆధార్‌తో పాన్ జతచేయాలన్నారు. ఆదాయ పన్ను చట్టంలోని ఒక సవరణ ద్వారా ఇది తప్పనిసరి అవుతుందని అన్నారు. ఆధార్ చట్టం చెల్లుబాటు అయ్యే చట్టమనీ, సుప్రీం తాజా తీర్పులో ఆధార్ చట్టంపై ఏమీ వ్యాఖ్యానించలేదని చెప్పారు. ఆధార్ చట్టం ప్రజల గోప్యతను ఒక మౌలికమైన హక్కుగా పరిరక్షిస్తుందని తెలిపారు. జాతీయ భద్రత వంటి పరిస్థితులలో మినహా, ఈ వివరాలను ఎవరితోనూ పంచుకోలేరని, అదికూడా కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ అనుమతి కావాల్సి ఉంటుందని చెప్పారు. పాన్‌తో ఆధార్ యాక్టివ్‌గా ఉందా? లేదా? తెలుసుకోవాలంటే.. incometaxindiaefiling.gov.in వెబ్ సైట్ లోకి వెళ్లాలి. అనంతరం సర్వీసెస్ ట్యాబ్ లో ఉన్న 'నో యువర్ పాన్' లింక్ ను క్లిక్ చేయాలి. ఓపెన్ అయిన విండోలో మీ పేరు, జెండర్, పుట్టిన తేది, స్టేటస్, డేట్ ఆఫ్ బర్త్ మరియు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ ను ఎంటర్ చేయాలి. మీరు ఎంటర్ చేసిన మొబైల్ నెంబర్ కి ఒక పాస్ వర్డ్ ఎస్ఎంఎస్ వస్తుంది. అది విండోలో ఎంటర్ చేయండి. దీంతో పాన్ చెల్లుబాటులో ఉన్నట్లయితే రిమార్క్ కాలంలో 'యాక్టివ్' అన్న సందేశం వస్తుంది.

అనుసంధానం ఎలా?


- incometaxindiaefiling.gov.in. లాగిన్ కావాలి. ఇది తప్పనిసరేమీ కాదు.. లాగిన్ కాకుండా మీరు డైరెక్టుగా స్టెప్–2కు వెళ్లవచ్చు. ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ ద్వారా చాలా సులువుగా ఆధార్‌తో పాన్ లింక్ చేయవచ్చు.
- 'లింక్ ఆధార్' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- డైరెక్టుగా లింక్ ఆధార్ అంటే పాప్ అప్ విండో ఒకటి ఓపెన్ అవుతుంది. అక్కడ ఆధార్ నెంబర్, పాన్ నంబర్ ఎంట్రీ చేయాలి.
- కాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి, 'లింక్ ఆధార్'పై క్లిక్ చేయాలి.
- పుట్టిన తేదీ, ఇంటిపేరు, పేరు, ఆధార్, పాన్‌తో సరిపోలితే వెంటనే ఆధార్‌తో పాన్ విజయవంతంగా అనుసంధానమైనట్టుగా ఒక మెసేజ్ వస్తుంది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27740	29668.45	0%
ముంబై	28450	30427.81	0%
ఢిల్లీ	28000	29946.52	0%
కోల్‌కతా	28370	30342.25	0%
కేరళ	27100	28983.96	0.37%
బెంగళూరు	27370	29272.73	0.26%
హైదరాబాద్	27740	29668.45	0%
గల్ఫ్	1374.45	1470.00	0.34%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	ఆదివారం	శనివారం	మార్పు (%)
చెన్నై	42000.00	41900.00	0.24
ముంబై	42000.00	41900.00	0.24
ఢిల్లీ	42000.00	41900.00	0.24
కోల్‌కత్తా	42000.00	41900.00	0.24
హైదరాబాద్	42000.00	41900.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

సోమాజిగూడలో లలితా జ్యుయెలరీ

- నూతన షోరూంను ప్రారంభించిన కెటిఆర్
- రెండు నెలల్లో కూకట్‌పల్లిలోనూ మరో షో రూం ఏర్పాటు చేస్తాం : కిరణ్ కుమార్

మన తెలంగాణ / హైదరాబాద్ : జ్యుయెలరీ వ్యాపార రంగంలో దక్షిణాదిలో అగ్రగామిగా ఉన్న లలితా జ్యుయెలర్స్ సంస్థ తెలంగాణలో తన తొలి అతిపెద్ద షోరూంను సోమాజిగూడ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, పార్లమెంటు సభ్యులు టి. సుబ్బిరామిరెడ్డి, ఖైరతాబాద్ శాసన సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి. లలితా జ్యువెల్లరి మార్ట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. యం. కిరణ్‌కుమార్, లైకా గ్రూపు ఛైర్మన్ ఎ. సుభాస్కరణ్ తదితర ప్రముఖుల సమక్షంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి కె. తారక రామారావు లలితా జ్యుయెలరీ నూతన షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి దత్తాత్రేయ నూతన షోరూంలో జ్యోతి ప్రజ్వల చేయగా, వజ్రాభరణాల విభాగాన్ని లైకా గ్రూపు ఛైర్మన్ ఎ. సుభాస్కరణ్ ప్రారంభించారు. కార్మిక, హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ బంగారు తెలంగాణగా రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. ఇప్పటికే వివిధ సంస్థలు తెలంగాణలో లాభసాటిగా వాణిజ్య కార్యకలాపాల్లో ముందుకు వెళ్తున్నాయన్నారు. ఎంఎల్ఏ చింతల రామచంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద షోరూంగా చెబుతున్న ఈ జ్యుయెలరీ మాల్ తన ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు కావడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. వినియోగదారుల ఆదరాభిమానాలను చూరగొని ఈ సంస్థ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఎంపి టి సుబ్బిరామిరెడ్డిలు లలితా జువెల్లరీ సంస్థ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో మరో షో రూం ఏర్పాటు చేస్తాం


సోమాజిగూడలో లక్షా 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతి సువిశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన ఈ షోరం మొత్తం తెలంగాణలోనే అతిపెద్ద నగల షోరూం అని లలితా జ్యుయెలరీ మార్ట్ చైర్మన్ డా. యం. కిరణ్ కుమార్ మీడియాకు తెలిపారు. కూకట్‌పల్లిలోనూ తమ రెండో షోరూంను మరో రెండు నెలల్లోనే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ ఆర్థిక సంవత్సరంలోనే విజయవాడ, రాజమండ్రిలో ఒక్కో కొత్త షో రూంలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తమ షో రూంల సంఖ్యను నాల్గింటికి చేర్చనున్నామన్నారు. సంస్థ వ్యాపార విస్తరణ కార్యాకలాపాలపై మీడియా అడిగిన ప్రశ్నకు డా.యం. కిరణ్ కుమార్ సమాధానం చెబుతూ సోమాజిగూడ షోరూంతో తమ వాణిజ్య సముదాయాల సంఖ్య 14కు చేరుకుందని, ఇప్పటి వరకు తమ ఆదాయం రూ. 11 వేల కోట్లుగా ఉందన్నారు. వచ్చే ఏడాది నాటికి రూ. 15 వేల కోట్లకు ఆదాయం పెంచుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. 2020 నాటికి రూ. 50 వేల కోట్ల ఆదాయ సముపార్జన లక్ష్యంగా వాణిజ్య కార్యకలాపాలను వినియోగదారుల చెంతకు తీసుకెళ్తామన్నారు. బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు ఒక సారి తమ లలితా జువెల్లరీ షాప్‌కు వచ్చి ధరలు చెక్ చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిసి డిజైన్ సంస్థ చైర్మన్ దిలీప్ చాబ్రియా, వేల్స్ విశ్వవిద్యాలయం చెన్నై చైర్మన్ డా. ఐసరి కె. గణేష్, అడయార్ ఆనందభవన్ (ఎ2బి) మేనేజింగ్ డైరెక్టర్ కెటి. శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి షోరూం ప్రారంభిస్తున్న మంత్రి కెటిఆర్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ

నిలేకని మూడేళ్లు కొనసాగాలి

- అలాగైతేనే ఇన్ఫోసిస్ సంస్థ గాడిలో పడుతుంది
- స్వతంత్ర డైరెక్టర్‌గా రవి వెంకటేషన్ వైదొలగాలి: బాలకృష్ణన్



న్యూఢిల్లీ: సరైన వారసుడి ఎంపిక కోసం కంపెనీ కొత్త చైర్మన్ నందన్ నిలేకని సుమారు 2–3 ఏళ్ల వరకు పదవిలో కొనసాగాల్సిన అవసరం ఉంద, వృత్తిపరంగా నిర్వహణలో కంపెనీ మళ్లీ వైఫల్యం చెందకుండా ఉండేందుకు ప్రయత్నించాలని ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఒ బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఉత్తమ చైర్మన్ పొందడంపై నిలేకని దృష్టి కేంద్రీకరించారని, భవిష్యత్‌లో ఆయన వైదొలిగినా.. బోర్డు సురక్షితమైన చేతుల్లో ఉండాలన్నారు. 'బోర్డు నియామకాలు, కొత్త సిఇఒ ఎంపిక, చైర్మన్ పదవికి వారసత్వ ప్రణాళిక ఏర్పాటుకు నాకు తెలిసి 2,3 ఏళ్లు సమయం పడుతుంది. గతంలో ఉన్న బోర్డు బలహీనంగా ఉంది. ఆ బోర్డు అందరితో సరిగ్గా కమ్యూనికేట్ కాలేదు' అని ఆయ నన్నారు. 2014లో ఓ పెద్ద ప్రయోగం జరిగిందని, వృత్తిపరంగా వ్యవహరించే బోర్డు.. కంపెనీని సమన్వయం చేయడం ప్రారంభించిందని అన్నారు. అప్పుడు వ్యవస్థాపకులతో కాకుండా సిఇఒ పదవిని వేరొకరితో భర్తీ చేశారని, ఎందుకంటే బోర్డు సరిగా వ్యవహరించలేకపోవడమే ఇందుకు కారణమని, ఆ ప్రయోగం ఇప్పుడు విఫలమైందని, ఇలాంటి ప్రయోగం మరోసారి విఫలం కాకూడదని అన్నారు. భవిష్యత్‌లో నీలేకని సంస్థ నుంచి వైదొలగే లోగా ఉత్తమ చైర్మన్ కోసం అన్వేషణ సాగించాలని, దానిపైనే దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

కంపెనీలో కార్పొరేట్ పాలన ప్రమాణాలు తుడిచిపెట్టుకుపోతున్నాయంటూ తరచూ విమర్శలు చేసే బాలకృష్ణన్.. కొ– చైర్మన్ నుంచి స్వతంత్ర డైరెక్టర్‌గా మారిన రవి వెంకటేషన్ బోర్డు నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఇన్ఫీ వ్యవస్థాపకులు, యాజమాన్యం మధ్య ఏడాది పాటు ప్రతిష్టంభన నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అకస్మాత్తుగా సిఇఒ పదవి నుంచి విశాల్ సిక్కా రాజీనామా చేశారు. దీంతో దేశీయ రెండో అతిపెద్ద ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌లో కొద్ది రోజులుగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. నిలేకని రాకతో చైర్మన్ ఆర్.శేషసాయి, మరో ఇద్దరు బోర్డు సభ్యులు సంస్థకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాలకృష్ణన్.. కంపెనీని గాడిలో పెట్టాలంటే నిలేకని కొంత కాలం ఉండాలని సూచించారు. నిలేకని అన్ని సమస్యలను పరిశీలిస్తారని, వాటాదారులతో చర్చలు జరుపుతారని, వాటికి పరిష్కారం తీసుకొస్తారని అన్నారు. బోర్డు పునర్నిర్మాణం దిశగా నిలేకని చర్యలు చేపడతారని, రాబోయే సిఇఒకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తారని అన్నారు. వ్యవస్థాపకులు, యాజమాన్యానికి మధ్య వివాదానికి మూల కారణమైన పనాయా కొనుగోలుపై ఆడిట్ సంస్థల నివేదికపై కంపెనీ స్పష్టమైన వైఖరిని తెలియజేస్తుందా? అని ప్రశ్నించగా బాలకృష్ణన్ స్పందిస్తూ, ఇన్ఫోసిస్ ఈ నివేదికను బ హిరంగపర్చాలన్నారు. 'కంపెనీ ఈ నివేదికను బహిర్గతం చేస్తుందని భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. పనా యా ఒప్పందంతో సహా అన్ని అంశాలను పరిశీలించేందు కు నిలేకనీకి కొంత సమయం పడుతుందని అన్నారు.

నిలేకని ఇన్ఫోసిస్‌కు చెందిన ఏడుగురు వ్యవస్థాపకుల్లో ఒకరు. ఆయన 2002 నుంచి 2007 మధ్య కాలంలో ఇన్ఫీ సిఇఒగా మూడేళ్లపాటు సేవలందించారు. సిక్కా రాజీనామా తర్వాత ఈ నెల 24న నిలేకనీని కొత్త చైర్మన్‌గా ఇన్ఫోసిస్ సంస్థ నియమించింది. ఆర్.శేషసాయి స్థానంలో ఆయన నియమితులయ్యారు. దీంతో శేషసాయి, కో ఛైర్మన్ రవి వెంకటేశన్‌లు రాజీనామాలు చేశారు. వీరిలో రవి వెంకటేశన్ స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారు. అదే సమయంలో విశాల్ సిక్కా, జెఫ్రీ ఎస్. లెహ్మన్, జాన్‌ఎట్కెమెండీ బోర్డు నుంచి వైదొలిగారు. కంపెనీ వ్యవస్థాపకులు ఎన్.ఆర్ నారాయణ మూర్తి తర్వాత 2002 ఏప్రిల్‌లో నీలేకని సిఇఒగా బాధ్యతలు చేపట్టారు. 2009లో ఆయన సంస్థ నుంచి వైదొలిగారు. ఆ తర్వాత ఆయన యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఇండియాకు (ఆధార్) ప్రాజెక్ట్ హెడ్‌గా వ్యవహరించారు. అంతేకాదు నిలేకని రాజకీయాల్లో కూడా ప్రవేశించారు. దక్షిణ బెంగళూరు నుంచి కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఇన్ఫీలో నిలేకనికి 2.29 శాతం వాటాలు ఉన్నాయి.



ఐడియాకు 3 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ : ఐడియా సెల్యులార్‌కు టెలికాం రెగ్యులేటరీ ట్రాయ్ రూ.2.97 కోట్ల జరిమానా విధించింది. ఎక్కువ చార్జీలు విధించిందనే కారణంతో ట్రాయ్ ఐడియాపై ఈ జరిమానా వేసింది. మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ వినియోగదారులపై ఐడియా అధిక చార్జీలను వసూలు చేసిందని ట్రాయ్ పేర్కొంది. 2005 మే నుంచి 2007 జనవరి మధ్యకాలంలో బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ నెట్‌వర్క్స్ కాల్స్‌ను టర్మినేట్ చేసేటప్పుడు ఐడియా ఈవిధంగా భారీమొత్తంలో ఛార్జీలు విధించింది. ప్రస్తుతం ఐడియా, వొడాఫోన్ ఇండియా విలీనం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఐడియా 15 రోజుల్లో జరిమానా ఈ మొత్తాన్ని జమచేయాల్సి ఉంటుంది.



జియో ఫోన్ బుకింగ్ నిలిపివేత

న్యూఢిల్లీ: జియో ఫోన్ ప్రి–బుకింగ్ అనూహ్యమైన స్పందన వచ్చింది. అయితే రిలయన్స్ బుకింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. లక్షల మంది వినియోగదారులు ఈ మొబైల్‌ను బుక్ చేసుకోవడంతో బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జియో అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. లక్షల మంది ఇప్పటికే ఫోన్‌ను ముందుగా బుక్ చేసుకున్నారనే సందేశం హోమ్ పేజీలో కనిపిస్తోంది. కేవలం రూ.1500లకే 4జి ఫీచర్‌ఫోన్‌ను అందిస్తామని రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటించారు. దీనికి గాను కేవలం రూ.500 చెల్లించి ఫోన్‌ను బుక్ చేసుకునే వెసులుబాటును సంస్థ కల్పించింది. ఈ నెల 24 సాయంత్రం 5.30 గంటలకు ప్రీ బుకింగ్ ప్రారంభమైంది. కొద్దిసేపటికే సర్వర్ క్రాష్ కావడంతో సేవలు నిలిచిపోయాయి. అనంతరం మళ్లీ బుక్ చేసుకోవడానికి వీలు కల్పించారు. తాత్కాలికంగా అయితే బు కింగ్ ఆప్షన్‌ను తొలగిస్తున్నట్టు సంస్థ పేర్కొంది. మళ్లీ ఎప్పుడు బుకింగ్స్‌ను ప్రారంభిస్తామో తర్వాత తెలియజేస్తామని ప్రకటించింది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు బుకింగ్స్ కొనసాగాయి. అంటే 36 గంటలు మాత్రమే ఈ బుకింగ్స్‌కు అనుమతి ఇచ్చింది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఇప్పటికే కోటి ఫోన్లు బుక్ అయినట్టు తెలుస్తోంది.

ఫోన్ బుక్ అయ్యిందా? లేదా తెలుసుకోవాలంటే?

జియో 4జి ఫోన్‌ను బుక్ చేసుకున్న వినియోగదారులు ఫోన్ డెలివరీ ఎంతవరకు వచ్చిందో తెలుసుకోవాలంటే 18008908900 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. ఫోన్ బుక్ చేసుకున్నప్పుడు ఇచ్చిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను ఐవిఆర్ ద్వారా ఎంట్రీ చేయాలి. దీంతో జియో ఫోన్ డెలివరీ ఎంత వరకు వచ్చిందో తెలుస్తుంది. అయితే టోల్ ఫ్రీ నంబర్ ద్వారానే కాకుండా యూజర్లు జియో యాప్, జియో వెబ్ సైట్‌ల్లో కూడా డెలివరీ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు. అందుకు గాను వాటిలోకి లాగిన్ అయి సెట్టింగ్స్‌లో ఉండే మై వోచర్స్ లేదా మై ఆర్డర్స్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే అందులో జియో ఫోన్ డెలివరీ వివరాలు వస్తాయి.

హర్యానాలో మళ్లీ హింస జరగొచ్చు : సిఐడి

చండీగఢ్: హర్యానా రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చెలరేగే అవకాశం ఉందని రాష్ట్ర నిఘా సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధినేత, ఆధ్యాత్మిక గురువు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సోమవారం కోర్టు శిక్షా కాలాన్ని ప్రకటించిన అనంతరం మరికొన్ని రోజుల పాటు రాష్ట్రంలో హింసాత్మక, ఉద్రిక్తత పరిస్థితులు మళ్లీ కొనసాగే అవకాశం ఉందని ఐజి, సిఐడి నివేదించినట్టు అదనపు ప్రధాన కార్యదర్శి, హోంశాఖ రామ్ నివాస్ ఒక అధికారక ప్రకటనలో వెల్లడించారు. మరోవైపు హర్యానాలో శాంతిభద్రతలను అదుపులోకి ఉంచడం పోలీసులకు అత్యంత ప్రధానమైనదని రాష్ట్ర డిజిపి బిఎస్.సంధు హామీ ఇచ్చారు. రోహ్‌తక్‌లో గుర్మీత్‌కు శిక్ష ఖరారు చేయనున్న నేపథ్యంలో శాంతి భద్రతలను అదుపుచేయడం ఇప్పుడు ప్రధానమైనదిగా ఆయన పేర్కొన్నారు.

డేరా నిర్వాహకులిద్దరిపై దేశద్రోహం కేసు

డేరా సచ్చా సౌధాకు చెందిన కీలక కార్యానిర్వహకులిద్దరిపై దేశద్రోహం కేసు నమోదు చేసినట్టు హర్యానా డిజిపి బిఎస్. సంధు వెల్లడించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డేరా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను సిబిఐ ప్రత్యేక కోర్టు అరెస్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో డేరాకు చెందిన ఐదుగురు నేతలు గుర్మీత్ మద్దతుదారులను హింసకు పురిగొల్పారంటూ స్థానిక హిందీ డెయిలీ పత్రిక కథనాన్ని వెలువరించిందని అన్నారు.



ఆ నాటి సర్జికల్ దాడుల రికార్డుల్లేవు

న్యూఢిల్లీ : 2016 సెప్టెంబరు 29 కంటే ముందు నిర్వహించిన సర్జికల్ దాడులకు సంబంధించిన సమాచారం ఆర్మీ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డిజిఎంఓ)వద్ద లేదు. పిటిఐ దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు స్పందించిన రక్షణ మంత్రిత్వశాఖ (ఆర్మీ) ఇంటిగ్రేటెడ్ ప్రధాన కార్యాలయం డిజిఎంఓ ఈ విషయాన్ని వెల్లడించారు. 2016 సెప్టెంబరు 29న సర్జికల్ దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ తేదీ కంటే ముందు నిర్వహించిన సర్జికల్ దాడులకు సంబంధించి తమ సెక్షన్ ఎలాంటి రికార్డులను నిర్వహించలేదని ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిఎంఓ స్పష్టం చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు వ్యూహాత్మకంగా నిర్వహించే ఆపరేషన్‌గా సర్జికల్ దాడులను డిజిఎంఓ ఈ సందర్భంగా నిర్వచించింది.

'మేడమ్ టుస్సాడ్స్'లో గాంధీ, మోడీ



న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని రీగల్ భవనంలోని 'మేడమ్ టుస్సాడ్స్'లో మహాత్మ గాంధీ, ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాంల విగ్రహాలు కొలువుదీరనున్నాయి. మేడమ్ టుస్సాడ్స్‌లోని ప్రత్యేక జోన్‌లో వీటిని ఏర్పాటు చేయబోతున్నారు. గాంధీ నిలువెత్తు విగ్రహాన్ని ఉంచే ఈ జోన్‌లో భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ విగ్రహాలను కూడా చేర్చనున్నారు. జాతికి విశేష సేవలు అందించిన వారి విగ్రహాలను ఇందులో చేర్చబోతున్నామని, ఇవి జాతీయ వాదాన్ని పెంపొంది స్తాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మ్యూజియంలో చరిత్రకు సంబంధించి ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేసే ఉద్దేశంతోనే ఈ విగ్రహాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ విగ్రహాలను లండన్‌లోని టుస్సాడ్స్ ప్రత్యేక బృందం తయారు చేస్తుందన్నారు.

సిఎం రాజీనామా చేయాలి : సిపిఐ

మన తెలంగాణ/న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా ఛీఫ్ బాబా గుర్మీత్ రామ్ రహీమ్ కు సిబిఐ ప్రత్యేక కోర్టు దోషిగా ఖరారు చేసిన తరువాత చెలరేగిన హింసలో 35 మంది మృతిచెందడాన్ని, 300 మందికి పైగా గాయపడడం పట్ల ఆదివారం సిపిఐ కేంద్ర కార్యదర్శి వర్గం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. బాబా గుర్మీత్ కు శిక్ష ఖరారుచేసే విషయం , ఆయనను దోషిగా ఖరారు చేస్తే హింస చెలరేగే విషయం బిజెపి నేతృత్వంలోని హర్యానా ప్రభుత్వానికి , అధికారులకు ముందు తెలుసని, అయితే అందుకు తగ్గట్లు భద్రతా ఏర్పాట్లు చేయడంలో విఫలమయిందని ఆరోపించింది. హర్యానా సిఎం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం చెందారని ఆరోపించింది.ఈ హింసాయుత పరిస్థితుల నుంచి బిజెపి రాజకీయ ప్రయోజనాలు సాధించే ప్రయత్నం చేసిందని తదనంతర పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని ఈ ప్రకటనలో పేర్కొన్నది. ఈ హింసాయుత ఘటనల తరువాత హర్యానాలో శాంతిభద్రతలు దిగజారాయని, దీనికి కేవలం హర్యానా సిఎం పూర్తి బాధ్యతవహించాలని సిపిఐ కేంద్ర కార్యదర్శి వర్గం అభిప్రాయపడింది. శనివారం పంజాబ్ మరియు హర్యానా ల ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యానించినట్లుగా హర్యానా సిఎం రాజకీయంగా ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం డేరా సచ్చా సౌధా సంస్థకు లొంగిపోయి, ఆ సంస్థ ప్రయోజనాలను కాపాడారని సిపిఐ అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సోమవారం డేరా బాబాకి శిక్ష ఖరారు చేస్తున్న సందర్భంగా హింస చెలరేగకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నది.

9 మంది మావోయిస్టుల లొంగుబాటు

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్ జిల్లా దంతెవాడలో ఆదివారం ఓ మహిళతో సహా 9 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇందులో ఆరుగురిపై నగదు రివార్డులు కూడా ఉన్నాయి. వీరంతా దంతెవాడ పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (దంతెవాడ రేంజ్) సుందర్‌రాజ్ తెలిపారు. లొంగిపోయిన వారిలో ఒకరైన నంద బర్సేపై రూ.5 లక్షల రివార్డు ఉందని, ఇతనికి అనేక విధ్వంసాలు, దాడుల కేసులతో సంబంధాలున్నాయని, 2014లో సుక్మా జిల్లాలో 15 మంది భద్రతా సిబ్బంది, 14 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బంది మరణించిన ఘటనలో ప్రమేయం ఉందని సుందర్‌రాజ్ పేర్కొన్నారు. సుక్కా మాద్‌కం, బీమ పోదియామి, బామన్ కుంజన్, బుధ్రాం సోఢీ, హింగ, సుద్రు, సహదేవ్, కోసి మాందవిలకు కూడా పలు ఘటనలతో సంబంధాలున్నాయని తెలిపారు. మరో ఇద్దరిపై కూడా రూ.8 లక్షల రివార్డు ఉందన్నారు.

పౌర స్మృతిపై నివేదిక వచ్చే ఏడాదే!

రాయ్‌పూర్ : ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్)పై నివేదికను లా కమిషన్ వచ్చే ఏడాది సమర్పించనున్నట్టు ప్యానెల్‌లోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక వ్యక్తిగత న్యాయ చట్టాలున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి ఉండే విషయాన్ని పరిశీలించాలని న్యాయ మంత్రిత్వ శాఖను గత ఏడాది జూన్‌లో లా కమిషన్ కోరింది. ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి పౌర స్మృతిపై తాము చేసే సిఫార్సులతో కోర్టు ఇచ్చే ఆదేశాలు తమ ప్యానెల్‌కు మార్గదర్శకంగా ఉంటాయన్న భావనతో లా కమిషన్ ఈ విషయంలో మరింత ఆచితూచి వ్యవహరించాలన్న నిర్ణయానికి వచ్చింది. దీంతో వచ్చే ఏడాది తాము నివేదికను సమర్పిస్తామని ప్యానెల్‌లోని సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ నివేదికను అఖిలపక్షంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

2020 నాటికి మధ్య శ్రేణి క్షిపణి రెడీ



న్యూఢిల్లీ: ఏళ్లతరబడి నిరీక్షణ అనంతరం భారత ఆర్మీ చివరికి ఆధునిక మధ్య శ్రేణి క్షిపణి (ఎంఆర్‌ఎస్‌ఎఎం) వ్యవస్థను సిద్ధం చేసింది. 2020 నాటికి అందుబాటులోకి వచ్చే ఈ మధ్య శ్రేణి క్షిపణితో భూఉపరితలం నుంచి 70 కిలోమీటర్ల దూరంలో శత్రువుల వైమానిక బాలిస్టిక్ క్షిపణిలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లపై దాడిచేయవచ్చునని సీనియర్ ఆర్మీ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రభుత్వ రక్షణ పరిశోధన సంస్థ డిఆర్‌డిఒ ఇజ్రాయెల్ ఎరోస్పెస్ ఇండస్ట్రీస్ (ఐఎఐ) సహకారంతో ఈ క్షిపణి వ్యవస్థను ఉత్పత్తి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎంఆర్‌ఎస్‌ఎఎం వ్యవస్థతో భూ ఉపరితలం నుంచి శత్రువులకు సంబంధించిన బాలిస్టిక్ క్షిపణులు, యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, నిఘా విమానాలు, ఎడబ్ల్యుఎసిఎస్ (ఎయిర్ బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్) విమానాలను పేల్చే వేసే సామర్థ్యం ఉందని పేరు చెప్పేందుకు నిరాకరించిన ఆర్మీఅధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. ఈ క్షిపణి ప్రాజెక్టుపై ఇజ్రాయెల్ ఎరోస్పెస్ ఇండస్ట్రీస్‌తో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) రూ. 17వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో 40 ఫైరింగ్ యూనిట్లు, 200 క్షిపణులతో ఒప్పందం జరుపుతున్నట్టు అంచనా. ఇందులో భాగంగా వచ్చే మూడేళ్లలో తొలి క్షిపణి వ్యవస్థను సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. అయితే భారత వైమానిక దళం, నేవీ దళాలు ప్రస్తుతం ఎంఆర్‌ఎస్‌ఎఎం వెర్షన్‌ను వినియోగిస్తున్నారు.

నేడే గుర్మీత్‌కు శిక్ష ఖరారు

- రోహ్‌తక్ జైలు చుట్టూ భారీ భద్రత
- రెండు రాష్ట్రాల్లో టెన్షన్ టెన్షన్



సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం సమీపంలోని నిర్మానుష్యంగా మారిన ఓ చౌరస్తాలో జవాను పహారా

చండీగఢ్/సిర్సా : అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు నేడు శిక్ష ఖరారు కానుంది. ఈ కేసులో ఆయన్ని దోషిగా ప్రకటించిన తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రస్తుతమున్న రోహ్‌తక్ జైలులోనే సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి శిక్షను వెల్లడించనున్నారు. ముందస్తు జాగ్రత్తగా జైలు చుట్టూ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. జనసమీకరణ చేసే డేరా ముఖ్యమైన అనుచరులను పోలీసులు ఇప్పటికే కస్టడీలోకి తీసుకున్నారు. సునారియా జైలు రోహ్‌తక్ పట్టణ శివారు ప్రాంతంలో ఉంది. అందువల్ల జైలు సముదాయాన్ని చేరుకునే మార్గం వెంట పలు భద్రతా బారికేడ్లను ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో సునారియాలోని జిల్లా జైలు వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలంటూ పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు శనివారం హర్యానా రాష్ట్ర ప్రభుత్వాన్ని అదేశించింది. అత్యాచారం కేసులో 50 ఏళ్ల గుర్మీత్ బాబాని పంచకులలోని సిబిఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం దోషిగా తేలుస్తూ తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు రోహ్‌తక్ జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పోలీసులు, పారామిలిటరీ బలగాలు పూర్తి సంసిద్ధతతో ఉన్నారని జిల్లా డిప్యూటీ కమీషనర్ అతుల్ కుమార్ తెలిపారు. జిల్లాలో సెక్షన్ 144 అమలు చేస్తున్నామని కూడా ఆయన చెప్పారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవల రద్దు మంగళవారం వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలు, డేటా సేవల రద్దుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గతవారం జారీ చేశారు. కాగా, తమ రాష్ట్రంలో మూడు రోజుల కిందట మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దు చేశాం. అది మంగళవారం వరకు కొనసాగుతుందని పంజాబ్ సిఎం అమరింద్ సింగ్ శనివారం వెల్లడించారు.

డేరా క్యాంపస్ వద్ద కెమెరామెన్‌పై దాడి

సిర్సాలోని డేరా ప్రధాన కేంద్రంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన ఒక వార్తా ఛానల్ కెమెరామెన్‌పై బాబా అనుచరులు ఆదివారం దాడి చేశారు. తర్వాత వారు అతని కారుతో అక్కడ నుంచి ఉడాయించారు. అతని కెమెరాని కూడా ధ్వంసం చేశారు. గాయపడిన బాధితుడిని సునీల్ కుమార్‌గా గుర్తించారు. అతని చేతికి, కాలికి గాయాలయ్యాయి. అనుచరులు నియంత్రణలోని బాధితుడి కారును స్వాధీనం చేసుకున్నామని, అతను తనపై జరిగిన దాడి గురించి తమకు ఫిర్యాదు చేశాడని ఒక సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. కాగా, కెమెరామెన్ మరో విలేకరితో కలిసి డేరా కేంద్రంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో దాడి చేసినట్లు సమాచారం.

డేరా చీఫ్‌గా దత్త పుత్రిక!

చండీగఢ్ : డేరా సచ్చాసౌధా చీఫ్ గుర్మీత్ జైలు పాలు కావడంతో ఇక ఈ పీఠం ఆయన దత్తపుత్రిక హనీప్రీత్ ఇన్సాఫ్ సొంతమవుతుందని భావిస్తున్నారు. తనకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు ఉన్నా గుర్మీత్ ఫతేపూర్ వాసి అయిన హనీప్రీత్‌ను కూతురిగా దత్తత తీసుకున్నారు. సోషల్ మీడియాలో ప్రీత్ తనను తాను తండ్రికి దూతగా పేర్కొంటుంది. తాను ఎడిటర్‌ను,దర్శకురాలిని, నటిని, దాతృత్వగుణవతిని అని పరిచయం చేసుకునే ఆ యువతినే ఇప్పటికే డేరా అధినేత్రిగా ఎంపిక చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. లక్షలాది మంది శిష్యగణం ఉన్న డేరాకు చిన్న వయస్సురాలు అయిన ప్రీత్ గుర్మీత్‌కు ప్రీతిపాత్రం కావడంతో బాధ్యతలు తీసుకుంటారని వెల్లడైంది. వివాదాస్పద తెగకు అధినేత్రి కానున్న ప్రీత్ ముప్పయేళ్ల వయస్సు ఉంటుంది. పంచ్‌కులలో ప్రత్యేక సిబిఐ కోర్టుకు గుర్మీత్‌తో పాటు హనీఫ్ వెంట ఉంది. తన రాక్‌స్టార్ పాపాను ప్రవచనాలను చేతలలోకి మార్చేందుకు తాను ఉవ్విళ్లూరుతున్నానని తరచూ ఈ యువతి ట్వీట్ చేస్తూ ఉంటుంది. ట్విట్టర్‌లో ఆమెకు కోటి మంది ఫాలోయర్లు, ఫేస్‌బుక్‌లో ఐదులక్షల మందికి పైగా అభిమానులు ఉన్నారట. ఇటీవల ఆగస్టు 15న గుర్మీత్ జన్మదినం సందర్భంగా ప్రీత్ బర్త్‌డే గ్రీటింగ్స్ తెలిపింది. తన వెబ్‌సైట్‌లో ఆమె తనను తాను అద్భుతమైన తండ్రికి గ్రేట్ డాటర్‌ను అని తెలియచేసుకుంటుంది. రామ్ రహీం సింగ్ నటించిన సినిమాలకు ఈ యువతినే దర్శకురాలుగా ఉంది. అంతేకాకుండా గుర్మీత్ నటించిన ఎంఎస్‌జి 2లో ఆమె నటించింది. గుర్మీత్‌కు కొడుకు జస్మీత్ కూడా ఉన్నప్పటికీ పెంపుడు కూతురివైపే గుర్మీత్ పీఠాధిపత్యానికి మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది.



డేరా బాబా ఆస్తులు గుర్తింపు

చండీగఢ్/సిర్సా : ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు డేరా సచ్చా సౌధాకు చెందిన స్థిరచరాస్తుల గుర్తింపును మొదలుపెట్టామని పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని అధికారులు ఆదివారం తెలిపారు. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన రెవిన్యూ శాఖ అధికారులు డేరా పరిధిలోని ఆస్తుల వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. డేరా పేరిట తెరిచిన ఖాతాల వివరాలను కూడా ఇవ్వాలని సంబంధిత బ్యాంకులను ఆదేశించామని వారు చెప్పారు. డేరా ఆస్తులు, ఆదాయాలు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల జాబితాను యుద్ధప్రాతిపదికన తయారు చేస్తున్నామని పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఈ కార్యక్రమంతో సంబంధమున్న ఒక అధికారి తెలిపారు. కాగా, డేరా ఆస్తుల జాబితాను మంగళవారానికల్లా సమర్పించాలని పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు సంబంధిత రెండు రాష్ట్రాలను ఆదేశించింది. ఇటీవల చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు డేరా అనుచరులే బాధ్యులని తేలితే ఆయా ఆస్తులను జప్తు చేసేందుకు కోర్టు ఆదేశించే అవకాశముంది. మరోవైపు డేరా సంస్థ ఆస్తులను బదలాయించడం, విక్రయించడం లేదా వాటిని లీజుకివ్వకుండా హైకోర్టు స్టే విధించింది. కాగా, పంచకులలోని సిబిఐ ప్రత్యేక కోర్టు గత శుక్రవారం డేరా బాబాని అత్యాచారం కేసులో దోషిగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన అనుచరులు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, యుపి, ఢిల్లీ రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు.

డేరా బాబా నాణేలు: సిర్సాలోని డేరా సచ్చా సౌధా ప్రధాన కేంద్రం పరిసర ప్రాంతాల్లోని షాపులకు వచ్చే వినియోగదారులకు చిల్లర ఇవ్వడానికి అక్కడ ఒక ప్రత్యేకమైన ద్రవ్య వ్యవస్థ ఉంది. డేరా ప్రాంగణ పరిసరాల్లో ఉండే బాబా అనుచరులకు చెందిన ప్రతి షాపు పేరుకు ముందు 'సచ్ (సత్యం)' అని రాయబడి ఉంటుంది. వినియోగదారులకు భారతదేశ కరెన్సీలో చిల్లర ఇవ్వలేని పక్షంలో షాపుల యజమానులు 'ధన్ ధన్ సద్గురు తేరా హై ఆసరా, డేరా సచ్చా సౌధా సిర్సా' అని రాయబడిన రూ.10, రూ.5 ప్లాస్టిక్ నాణేలు లేదా టోకెన్లు ఇస్తారు. 'సచ్'దుకాణాల్లో షాపింగ్ కోసం వాటిని తర్వాత ఎపుడైనా వినియోగదారులు ఉపయోగించుకోవచ్చు. అంటే, ఒక రకంగా అవి స్థానిక మారకద్రవ్యం లాంటివన్నమాట. సిర్సాలోని ఈ డేరా ఆశ్రమం సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది.

విశ్వాసం పేరిట హింస తగదు

- దోషులపై కఠిన వైఖరి తప్పదు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని వార్నింగ్



న్యూఢిల్లీ : విశ్వాసం పేరిట హింసను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం స్పష్టం చేశారు. డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అనుచరుల హింసాత్మక వైఖరిపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి తల వంచాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతినెలా నిర్వహించే 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన పలు విషయాలపై ముచ్చటించారు. అన్ని రకాల సమస్యల పరిష్కారానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందన్న విషయాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'దేశంలో పండుగ వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో ఏదో ఒక మూల హింస చోటు చేసుకున్నట్లు వార్తలు రావడం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది' అని ప్రధాని చెప్పారు. హర్యానాలోని డేరా సచ్చా సౌధా చీఫ్ గుర్మీత్ అనుచరులు సృష్టించిన హింసను ఉద్దేశించి ఆయన ఈ మేరకు స్పష్టం చేశారు. 'ఈ దేశం బుద్ధ భగవానుడు, మహాత్మాగాంధీ నడయాడింది. ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవించిన దేశమిది' అని ఆయన అన్నారు. అహింస ఈ దేశానికి ఎన్నో యుగాల నుంచి పునాదిగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. 'విశ్వాసం పేరిట చేసే హింసను సహించేది లేదని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చెప్పాను. మతపరమైన, రాజకీయపరమైన లేదా ఒక వ్యక్తికి లేదా ఒక ఆచారానికి సంబంధించిన ఎలాంటి విశ్వాసంతోనూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ లేదు' అని ప్రధాని స్పష్టం చేశారు.

67 శాతం జనాభాకి టాయిలెట్లు

ప్రధాని తన మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని దాదాపు 67 శాతం జనాభాకు టాయిలెట్ల సదుపాయముందని తెలిపారు. 2,30,000 పైగా గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా అవతరించాయని ఆయన చెప్పారు. అక్టోబరు 2న గాంధీ జయంతికి ముందుగా 'పరిశుభ్రత అనేది సేవ' ప్రచారాన్ని చేపట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

కొత్తగా 30 కోట్ల కుటుంబాలకు జన్‌ధన్ ఖాతాలు

దేశంలో కొత్తగా కనీసం 30 కోట్ల కుటుంబాలు జన్‌ధన్ ఖాతాలు పొందాయని, వాటిలో రూ.65 వేల కోట్లు జమయ్యాయని నరేంద్ర మోడీ తెలిపారు. జన్‌ధన్ ఖాతాల కోసం ఆవిష్కరించిన జన్‌ధన్ యోజన పథకం మూడేళ్లను పూర్తి చేసుకోనున్న సందర్భంగా ఆయన ఈ వివరాలను వెల్లడించారు. జన్‌ధన్ యోజనతో పాటు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన లాంటి బీమా పథకాలు, రూపే కార్డు, ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా సామాన్య ప్రజలు ఏ మేర లబ్ధి పొందారన్న విషయాన్ని తెలుసుకోవడానికి బ్యాంకులు సర్వేలు చేపట్టాయని ప్రధాని తెలిపారు.

గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన 11 మంది దుర్మరణం

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఆదివారం ఉద యం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మహిళలు సహా 11 మంది దుర్మరణం చెందారు. మరోక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ముంబయికి చెందిన కుటుంబం జీపు లో వల్లభిపూర్‌కు వెళ్తుండగా అహ్మదాబాద్ జిల్లాలో తగ్డికి సమీపంలో ధందుకబర్వాల రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకున్నట్టు జిల్లా ఎస్‌పి ఆర్‌వి. అసరి చెప్పారు. డ్రైవర్ జీపును అదుపుచేయలేకపోవడంతో వాహనం రోడ్డు రాంగ్ సైడ్‌కు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టినట్టు ఎస్‌పి వెల్లడించారు. ప్రాథమిక సమాచారం మేరకు జీపు డ్రైవర్ నిద్ర మత్తులో నడపటం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు చెప్పారు. ఎదురుగా వచ్చిన ట్రక్కు డ్రైవర్ తప్పు ఏమి లేదని ఎస్‌పి పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్టు పోలీసులు వెల్లడించారు.



పళనికి పరీక్ష పెట్టండి

గవర్నర్‌కు డిఎంకె వినతి, విద్యాసాగర్‌రావు నిర్ణయంపై ఉత్కంఠ



చెన్నై : తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిఎం పళనిస్వామి సారథ్యంలోని అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రధాన విపక్ష పార్టీ డిఎంకె నేతృత్వంలో ఇతర విపక్షాలు సమాయత్తమవుతున్నాయి. డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు ఆదివారం రాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావును కలిశాయి. కొందరు అధికార అన్నాడిఎంకె ఎంఎల్‌ఎలు తిరుగుబావుటా ఎగురవేసిన నేపథ్యంలో పళనిస్వామి ప్రభుత్వం అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకునేలా ఆదేశించాలని ఆయన్ను కోరాయి. ఒక వేళ గవర్నరు నిర్దిష్ట సమయంలో ప్రభుత్వాన్ని విశ్వాస పరీక్షకు ఆదేశించని పక్షంలో తాము రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను లేదా చివరకు కోర్టును ఆశ్రయించడానికి కూడా వెనుకాడబోమని డిఎంకె స్పష్టం చేసింది. ప్రస్తుతం బెంగళూరు జైలులో ఉన్న అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి వికె శశికళ మేనల్లుడు టిటివి దినకరన్‌కు విధేయులుగా ఉన్న 19 మంది అధికార పార్టీ ఎంఎల్‌ఎలు ఈ నెల 21న గవర్నరును కలిసి, సిఎం పాలనపై తమకు విశ్వాసం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ప్రస్తుత ప్రభుత్వం మైనార్టీలో పడిందని, విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలంటూ డిఎంకె డిమాండ్ చేస్తూ వస్తోంది. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలున్నాయి. అందులో ఒకటి ఖాళీగా ఉంది. ప్రస్తుత పళనిస్వామి ప్రభుత్వానికి స్పీకర్ సహా మొత్తం 113 మంది ఎంఎల్‌ఎల బలం మాత్రమే ఉందని పేర్కొంటూ స్టాలిన్ నేతృత్వంలోని విపక్షాలు గవర్నరుకు తాజాగా మరో లేఖను సమర్పించాయి. ఇదే వ్యవహారానికి సంబంధించి ఈ వారంలో గవర్నరుకు సమర్పించిన లేఖల్లో ఇది రెండోది. తన పార్టీకి 89 మంది ఎంఎల్‌ఎలు ఉన్నారని, కాంగ్రెస్‌కు ఎనిమిది మంది, ఐయుఎంఎల్‌కి ఒకరు ఉన్నారని స్టాలిన్ చెప్పారు. అధికార పార్టీకి చెందిన 22 మంది అసమ్మతి ఎంఎల్‌ఎలు సహా ప్రభుత్వాన్ని 120 మంది సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్ల పళనిస్వామి నేతృత్వంలోని మంత్రివర్గం మెజార్టీ ఎంఎల్‌ఎల విశ్వాసాన్ని కోల్పోయిందనేది విస్పష్టమని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగ సంక్షోభం నెలకొందని, గవర్నరు తక్షణమే జోక్యం చేసుకుని మెజార్టీ నిరూపించుకోవాలని పళనిస్వామి ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గవర్నరును కలిసిన వారిలో దురైమురుగన్, డిఎంకె రాజ్యసభ ఎంపిలు కనిమొళి, ఆర్ ఎస్ భారతి, ఐయుఎంఎల్ ఎంఎల్‌ఎ కెఎం మహ్మద్ అబూబకర్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ, పార్టీ విప్ ఎస్.విజయధరణి ఉన్నారు. మరోవైపు పళనిస్వామిని అన్నాడిఎంకె సేలం జిల్లా కార్యదర్శి పదవి నుండి దినకరన్ ఆదివారం తొలగించారు. ఈ మేరకు పార్టీ ఇక్కడ ఒక ప్రకటనను విడుదల చేసింది. పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా కూడా పళనిస్వామి వ్యవహరిస్తున్నారు.

అంతా బూటకం! : చిదంబరం

తమిళనాడు అధికార పార్టీ అన్నాడిఎంకెలో తాజా రాజకీయ పరిణామాలు హాస్యరూప నాటకంగా మారాయని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాలపై గవర్నర్ విద్యాసాగరరావు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. తమిళనాడు గవర్నర్ ఉన్నప్పటికీ కూడా అన్నాడిఎంకె రాజకీయాల్లో హాస్యనాటకం బూటక రాజకీయంగా మారుతోందని చిదంబరం విమర్శించారు.

ఎన్‌డిఎలోకి అన్నాడిఎంకె!

అన్నాడిఎంకె త్వరలోనే జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)లో చేరనుంది. తద్వారా కేంద్రంలోని ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంలో భాగస్వామి అవుతుందని దక్షిణాది రాష్ట్రాల వ్యవహారాలతో సంబంధమున్న బిజెపి సీనియర్ నేత ఒకరు తెలిపారు. 'అన్నాడిఎంకె తప్పకుండా ఎన్‌డిఎలో చేరుతుంది. త్వరలోనే ఇది జరుగుతుంది. ఎన్‌డిఎలో చేరగానే, సహజంగానే అన్నాడిఎంకె కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామవుతుంది' అని ఆయన అన్నారు. తమిళనాడులోని అన్నాడిఎంకెలో నెలకొన్న సంక్షోభంపై అడిగిన ప్రశ్నకు, అది ఒక ప్రాంతీయ పార్టీ అంతర్గత వ్యవహారమని, దాని ప్రభా వం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, అన్నాడిఎంకెకి లోక్‌సభలో 37 మంది, రాజ్యసభలో 13 మంది సభ్యులున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థికే ఆ పార్టీ ఓటేసింది. ఎన్‌డిఎలో అన్నాడిఎంకె చేరినట్లయితే, ప్రధాని మోడీ త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో ఆ పార్టీ సభ్యులకు బెర్తులు దక్కే అవకాశముంది.





డోక్లామ్‌లో యథాతథ స్థితికే మద్దతు : అమెరికా

వాషింగ్టన్: డోక్లామ్ 'ట్రై జంక్షన్'లో కొనసాగుతున్న ప్రతిష్టంభన తొలగింపు విషయంలో భారత్, చైనాలు శాంతియుత చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనగలవన్న ఆశాభావాన్ని ట్రంప్ పాలకవర్గంలోని ఓ సీనియర్ అధికారి వ్యక్తం చేశారు. అక్కడ యథాతథ స్థితికే అమెరికా మద్దతు ఇస్తుందని కూడా చెప్పారు. సిక్కిం సెక్టార్‌లోని డోక్లామ్‌లో రెండు నెలలుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. వ్యూహాత్మకమైన ఆ ప్రాంతంలో చైనా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడంతో భారత్ దానిని అడ్డుకుంది. అప్పటి నుంచి అక్కడ ప్రతిష్టంభన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 'డోక్లామ్ పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాము. దానిపై మాకు ఆందోళ కూడా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలు శాంతియుత చర్చల ద్వారా పరిష్కారం కనుగొంటాయని ఆశిస్తున్నాం. అక్కడ యథాతథ స్థితి నెలకొనడానికే మా మద్దతు ఉంటుంది' అని ఆ అమెరికా అధికారి చెప్పారు. భూటాన్ సార్వభౌమత్వ విషయంలో కూడా తాము ఆందోళన చెందుతున్నట్లు ఆయన తెలిపారు. చైనా, భారత్ మధ్య ఘర్షణ వాతావరణం ఉన్న దృష్ట్యా ఆయన మీడియాకు పేరు తెలుప నిరాకరించారు. ఇదిలా ఉండగా గత రెండు నెలలుగా చైనా మీడియా భారత్‌పై ఉద్రేకపూరిత ఆర్టికల్స్‌ను ప్రచురిస్తూ వస్తోంది. చైనా మాత్రం డోక్లామ్ సమస్యను అమెరికా వద్దకు తీసుకెళ్లలేదని తెలుస్తోంది. 'మేము పరిస్థితిని గమనిస్తున్నాము, భారత్‌తో ఈ విషయంలో సంప్రదిస్తున్నమన్నారు.

టెక్సాస్‌లో హరికేన్ బీభత్సం

- ఐదుగురు మృతి
- భారీగా ఆస్తి నష్టం



హూస్టన్/బీజింగ్: అమెరికా టెక్సాస్ రాష్ట్రంలో హార్వే హరికేన్ (చండమారుతం) పెను బీభత్సాన్ని సృష్టిస్తోంది. అమెరికాలోని గల్ఫ్ తీరాన్ని తాకిన ఈ హరికేన్ ఇప్పటికీ ఐదుగురు ప్రాణాలు బలికొన్నది. గంటకు 195 కిమీ. వేగంతో ఈదురుగాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కుప్పకూలిపోతున్నాయి. గత 12 ఏళ్ల తర్వాత అమెరికాలో ఇదే అత్యంత శక్తిమంతమైన హరికేన్‌గా వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. టెక్సాస్ తీరప్రాంతమైన రాక్‌పోర్టు తీవ్రంగా దెబ్బతింది.ప్రత్యక్ష సాక్షులు మాత్రం మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని అంటున్నారు. దీనికి ముందు అక్కడి మీడియా సైతం కనీసం ముగ్గురు మృతి చెందారని పేర్కొంది. ఈ తుఫాను ఇప్పటికే ఎడతెగని వానలు కురిపిస్తున్నట్లు, రాగల రోజుల్లో ఉపద్రవ వరదలకు దారితీయొచ్చని మియామిలోని జాతీయ హరికేన్ కేంద్రం హెచ్చరించింది. 1961 తర్వాత టెక్సాస్‌ను తాకిన శక్తిమంత హరికేన్ హార్వే ఇదేనని భావిస్తున్నారు. రాగల రెండు మూడు రోజులలో రెండు నుంచి మూడు అడుగుల వానలు పడొచ్చని హూస్టన్ మేయర్ సిల్వెస్టర్ టర్నర్ తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో 100 సెమీ. కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు కావొచ్చన్నారు.సాయం కోసం 1800 మంది మిలిట్రీ సిబ్బందిని రంగంలోకి దింపడానికి సిద్ధంగా ఉంచామన్నారు. దాదాసే 60 లక్షల మంది హరికేన్ హార్వే ప్రభావ ప్రాంతంలో ఉన్నారని తెలిసింది. హరికేన్ ప్రభావం కారణంగా విద్యుత్ వ్యవస్థ బాగా దెబ్బతింది. దాదాపు 3,00,000 విద్యుత్ వినియోగదారులు చీకట్లో మగ్గుతున్నట్లు అమెరికన్ ఎలెక్ట్రిక్ పవర్ కంపెనీ ఇన్‌కార్పొరేషన్, సెంటర్ పాయింట్ ఎనెర్జీ ఇన్‌కార్పొరేషన్ అనే విద్యుత్ కంపెనీలు తెలిపాయి. వరదలు, విధ్వంసం నుంచి తప్పించుకునేందుకు వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. హూస్టన్‌లో గంటకు 3 అంగుళాల చొప్పున వాన కురుస్తోంది చాలా వరకు వీధులు, భూగర్భ మార్గాలు జలమయమయ్యాయి. టెక్సాస్, లూసియానా గవర్నర్లతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడారు. దేశం పెను ప్రకృతి విపత్తును ఎదుర్కొంటుందని పేర్కొనడమేకాక విపత్తు ప్రకటనపై ట్రంప్ సంతకం చేశారు.

చైనా తీరాన్ని తాకిన పఖర్ టైఫూన్ : ఈ ఏడాది 14వ టైఫూన్ పఖర్ చైనాలోని గ్వాంగ్డాంగ్ ప్రాంతంలోని తైషన్ పట్టణాన్ని ఆదివారం తాకింది. సెకండ్‌కు 33 మీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. హటో టైఫూన్ అనేక మంది ప్రాణాలు, మహా విధ్వంసం సృష్టించి కొన్ని రోజులైన గడవక ముందే ఈ టైఫూన్ చైనాను తాకింది. హటో టైఫూన్ బుధవారమే ఝుహైని తాకింది. ఝుహై ప్రాంతం తైషన్ పట్టణానికి 80 కిమీ. దూరంలో ఉంటుంది. తాజా పఖర్ టైఫూన్ కారణంగా తీవ్ర గాలివాన సంభవించే అవకాశాలున్నాయని ఝుహైలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. స్థానిక కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాలను శనివారం నుంచే మూసేశారు. పఖర్ టైఫూన్ వాయవ్య దిశగా కదలనుందని వాతావరణ కేంద్రం తెలిపింది. గ్వాంగ్డాంగ్, ఫుజియన్, హైనన్ ప్రాంతాలలో, గ్వాంగ్జీలో ఎడతెరిపిలేకుండా వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

అమెరికా నర్సుకు రూ. 4846 కోట్ల లాటరీ



న్యూయార్క్: అమెరికాలోని మసాచ్యుసెట్స్‌లో ఓ హాస్పిటల్‌లో పనిచేస్తు న్న మావిస వాన్‌జిక్(53)కు లాటరీ తగిలింది. రూ. 4846 కోట్ల పైచిలుకు గెలుచుకుని అమెరికా చరిత్రలోనే ఒకే టిక్కెట్‌పై అత్యధిక మొత్తాన్ని గెలుచుకున్న వ్యక్తిగా నిలిచారు. బుధవారం డ్రా తీయగా, ఆమెకు జాక్‌పాట్ తగిలినట్లు గురువారం ప్రకటించారు. లాటరీ గెలుచుకున్న ఆ నర్సు ఇకపై తాను ఉద్యోగం చేయబోనని ప్రకటించేసింది. ఇద్దరు పిల్లలకు తల్లి అయిన మావిస్ ఇటీవలే భర్తను కోల్పోయారు. తొమ్మిది నెలల క్రితం బస్సు కోసం ఎదురు చూస్తున్న విలియంను ఓ వాహనం ఢీకొట్టడంతో ఆయన చనిపోయారు. ఇద్దర పిల్లల పోషణ భారాన్ని మోస్తున్న మావిస్ తన దుఃఖాన్ని దిగమింగుకుని ఇన్నాళ్లు ఉద్యోగం కొనసాగించారు.

పాక్ కాల్పుల్లో నలుగురికి గాయాలు

జమ్ము: కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ బలగాలు ఆదివారం సాయంత్రం జరిపిన విచక్షణా రహిత కాల్పుల్లో మహిళ, బాలుడు సహా నలుగురు పౌరులు గాయపడ్డారు. ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. షాపూర్ సెక్టార్‌లో సాయంత్రం 6 గంటలకు భారీ ఆయుధాలతో దాదాపు 45 నిమిషాలపాటు పాక్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో నలుగురు గాయపడినట్లు సమాచారం అందినట్లు పూంచ్ జిల్లా అభివృద్ధి కమిషనర్ తారీఖ్ అహ్మద్ జర్గర్ విలేకరులకు తెలిపారు. కాల్పుల్లో గాయపడిన వారిని బండిచిచీకి చెందిన జమీల్ అహ్మద్(45),పర్వయిజా అఖ్తర్ (20), కస్బా గ్రామానికి చెందిన జావీద్ హుసేన్(24), మొహమ్మద్ ఖాసీమ్(14)గా గుర్తించినట్లు అధికారి తెలిపారు.

నంద్యాల నాయకుడెవరో

- నేడు ఉప ఎన్నిక ఫలితం
- సర్వత్రా ఉత్కంఠ, భారీ భద్రత ఏర్పాట్లు





నంద్యాల : నంద్యాల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. సోమవారం నిర్వహించనున్న ఈ ప్రక్రియ కోసం ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలలో విస్తృత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1,73,335 ఓట్లను లెక్కించనున్నారు. మొత్తం 19 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ప్రతి రౌండ్‌కు తొమ్మిది వేల ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. చివరి రౌండ్ లెక్కింపులో మరికొన్ని ఓట్లు అదనంగా చేరనున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంట తరువాత అధికారికంగా ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. మొదట నంద్యాల మండలం ఓట్లను లెక్కించి తరువాత నంద్యాల పట్టణం, గోస్పాడు మండలం ఓట్లను లెక్కించనున్నారు. నంద్యాల మండలం పోలూరు గ్రామం ఓట్ల లెక్కింపుతో ప్రారంభమయ్యే ఈ క్రతువు గోస్పాడు మండలం బీవీ నగర్ గ్రామ ఓట్ల లెక్కింపుతో పూర్తి కానుంది. లెక్కింపు కేంద్రంలోకి పోటీలో ఉన్న అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది, అధికారులకు తప్ప ఎవరికి ప్రవేశం లేదు. కౌంటింగ్ కేంద్రం నుంచి వంద మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటుచేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద, సమీప ప్రాంతంలో సుమారు 200 మంది వివిధ స్థాయి పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ముగిసిన 'కాకినాడ' ప్రచారం





కాకినాడ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ నెల 29న మొత్తం 48 వార్డులకు 196 కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. నంద్యాల ఉప ఎన్నిక తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్మాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. అభివృద్ధే ప్రధాన ఎజెండాగా అధికార తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహించింది. ఆ పార్టీ తరపున సీఎం చంద్రబాబు రెండు రోజుల పాటు కాకినాడలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

29న కార్పొరేషన్‌కు ఎన్నికలు

టిడిపి, బిజెపి ఓటర్లను గెలిపించాలని కోరారు. ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 39 వార్డుల్లో తెలుగు దేశం అభ్యర్థులు, 9 వార్డుల్లో భాజపా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎన్నికల హామీలను విస్మరించారం టూ వైసిపి ప్రచారం నిర్వహించింది. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన ఆదివారం ఆ పార్టీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా రు. విజయసాయిరెడ్డి, బొత్స, రోజా తమ పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 48 వార్డుల్లో వైసిపి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. మొత్తం 17 వార్డుల్లో అభ్యర్థులను ఆ పార్టీ బరిలోకి దింపింది. ఆ పార్టీ తరపున పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, పల్లంరాజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం 241 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, వీరిలో 121 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క

యుపి రామ్ మనోహార్ లోహియా ఆస్పత్రిలో ఘటన

లక్నో: ఆస్పత్రి మార్చురీలో ఉంచిన ఓ మహిళ మృతదేహాన్ని కుక్క పీక్కుతినేసిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని రామ్ మనోహార్ లోహియా ఆస్పత్రిలో ఆదివారం వెలుగుచూసింది. దీనిపై స్పందించిన ఆస్పత్రి యాజమాన్యం సెక్యూరిటీ సూపర్‌వైజర్, గార్డును సర్వీసుల నుంచి తొలగించారు. అనుమానిత స్థితిలో విషప్రయోగానికి గురైన చిన్‌హట్ ప్రాంతానికి చెందిన పుష్ప తివారి (40)ని లోహియా అత్యవసర చికిత్సా విభాగంలో చేర్పించారు. అయితే గతరాత్రి చికిత్స అందిస్తుండగా పుష్ప మృతిచెందినట్టు ఆస్పత్రి డైరెక్టర్ వైద్యులు దేవేంద్ర నెగీ వెల్లడించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వైద్య చట్టపరమైన కేసు కావడంతో శవపరీక్ష నిర్వహించేంత వరకు మార్చురీలోనే ఉంచారు. ఈ నేపథ్యంలో పుష్ప ముఖం, మెడ భాగాలను కుక్క పీక్కు తిన్నట్టు గుర్తించిన మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పుష్ప చెవి రింగులు కూడా లేవంటూ ఆరోపించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మార్చురీకి సమీపంలో కుక్క దాడిచేసినట్టు గుర్తించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రిన్సిపల్ సెక్రటరీ (హెల్త్) ప్రశాంత్ త్రివేది, మార్చురీలో విధుల్లో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో భారతీయులు సహా ఎనిమిది మంది మృతి



లండన్ : ఇంగ్లాండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో కొందరు భారతీయులు సహా మొత్తం ఎనిమిది మంది మరణించారు. బకింగ్‌హామ్‌షైర్‌లోని న్యూపోర్ట్ పాగ్నెల్ వద్ద దక్షిణ దిశ ఎం1 హైవేలో రెండు పెద్ద లారీల మధ్య మినిబస్సు నలిగి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదకరంగా నడిపిన ఆ రెండు లారీల డ్రైవర్లను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారి వివరాలను పోలీసులు ఇంకా నిర్ధారించాల్సి ఉంది. అయితే మినీ బస్సును నడిపిన డ్రైవరు కేరళకు చెందిన సిరియాక్ జోసఫ్(52) అని తెలిసింది. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. ఆయన 15 ఏళ్ళుగా ఇంగ్లాండ్‌లో పనిచేస్తున్నారు. అతడు చాలా మంచి వ్యక్తి అని, ఔదార్యుడని అతడి స్నేహితులు చెప్పారు. మినీ బస్సులో ప్రయాణించినవారిలో మిగతా పర్యాటకులు చెన్నైకు చెందిన వారని తెలిసింది. వారంతా మినీ బస్సును అద్దెకు తీసుకుని నాటింగ్హామ్ నుంచి లండన్‌కు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదంకు గురయ్యారు. వారు లండన్ నుంచి ఐరోపా పర్యటించాలన్న ప్రణాళికలు కూడా వేసుకున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐదేళ్ల బాలిక, మహిళ, పురుషుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలిలో వాహనాలు ఘోరంగా ధ్వంసమైన దృశ్యాలు కూడా దర్శనమిస్తున్నాయి.

యెమెన్ ఘర్షణల్లో కల్నల్ మృతి



సనా: యెమెన్‌లో తిరుగుబాటుదారుల కూటమిలో అనూహ్యంగా చెలరేగిన ఘర్షణల్లో మాజీ అధ్యక్షుడు అలీ అబ్దుల్లా సలేహ్ అనుకూల కల్నల్ ఖాలేద్ అల్ రిదా, మరి ఇద్దరు తిరుగుబాటుదారులు మరణించారు. ఈ విషయాన్ని సలేహ్ పార్టీ, వార్తా సంస్థలు ఆదివారం ధ్రువీకరించాయి. యెమెన్ రాజధాని సనాలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణల్లో వారు మరణించినట్లు సలేహ్‌కు చెందిన జనరల్ పీపుల్స్ కాంగ్రెస్ పార్టీ (జిపిసి) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే చనిపోయిన హుతీ తిరుగుబాటుదారుల పేర్లను మాత్రం వ్యక్తం చేయలేదు. సలేహ్‌ను వెన్నుపోటుదారుడు, మోసగాడు అంటూ హుతీ తిరుగుబాటుదారులు గత వారంగా విమర్శిస్తుండటంతో తిరుగుబాటుదారుల కూటమిలో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. అయితే పాపులర్ కమిటీలకు చెందిన తమ ఇద్దర సభ్యులు మరణించారని తిరుగుబాటుదారుల సబా వార్తా సంస్థ పేర్కొంది.

ముగ్గురు గూర్ఖా మద్దతుదారుల అరెస్టు

డార్జిలింగ్ : డార్జిలింగ్ కొండల్లో జూన్ మాసంలో చెలరేగిన హింసతో సంబంధమున్నట్టుగా అనుమానిస్తున్న ముగ్గురు గూర్ఖాలాండ్ మద్దతుదారులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యేక గూర్ఖాలాండ్ కోసం డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 74వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ప్రస్తుతం డార్జిలింగ్ కొండల్లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. శనివారం రాత్రి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి హింసాత్మక ఘటనలు జరిగినట్టు సమాచారం లేదు. జూన్ 18 నుంచి ఇంటర్నెట్ సర్వీసులను రద్దు చేశారు. ఉద్యమ నేపథ్యంలో ఈ అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 29న నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనాలని జిజెఎం,జిఎన్‌ఎల్‌ఎఫ్,ఇతర హిల్ పార్టీలు నిర్ణయించుకున్నాయి.

జాలర్ల పడవను ఢీకొన్న విదేశీ నౌక

తిరువనంతపురం : విదేశీ సరుకు రవాణా నౌక ఒకటి కేరళ కోస్తా తీరంలో చేపల వేటకు వెళ్లి బోట్‌ను ఢీకొంది. ప్రస్తుతం ఆ నౌక కోచికి 400 నాటికన్ మైళ్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లో ఉందని నౌకాదళ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో బోట్ పూర్తిగా ధ్వంసమైందని, ఇందులో వున్న ఆరుగురు జాలర్లను సమీపంలో ఇతర బోట్‌లలో ఉన్న వారు రక్షించారని తెలిపారు. ఈ నౌక హాంకాంగ్‌లో రిజిస్టర్ అయినట్టు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైతే విదేశీ వ్యవహారాల శాఖతో లీగల్ కేసు వేస్తామని చెప్పారు. ఇలాంటి తరహా ఘటనలే గతంలోనూ ఇక్కడ జరిగాయి. జూన్ 11న కార్గో నౌక బోట్‌ను ఢీకొనడంతో ఇద్దరు చనిపోగా, 11 మంది గాయపడ్డారు. 2012 ఫిబ్రవరిలో ఇలాంటి ఘటనే జరగగా ఇద్దరు భారత జాలర్లు మృత్యువాత పడ్డారు.

తెలంగాణ భవన్‌లో ముగిసిన విఘ్నేశ్వరుడి ఉత్సవాలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ : సర్వ విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడి ఉత్సవాలు తెలంగాణ, ఆంధ్రభవనల్‌లో ఘనంగా ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్‌లో కొలువుదీరిన మహా గణపతికి మూడు రోజుల పాటు భక్తులు భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం నాడు మూడో రోజు ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ భవన్ ప్రిన్సిపాల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన తల్లి దండ్రులు, బంధువులు పండితుల మంత్రోచ్చరణ మధ్య పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో సహాయక కమిషనర్ రామ్మోహన్, భవన్ సిబ్బంది, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవాడలో ఉత్సాహంగా 'హ్యాపీ సండే'

విజయవాడ: నవ్యాంధ్ర రాజధాని విజయవాడ నగరంలో ఆనంద ఆదివారం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పున్నమి ఘాట్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. పెద్దసంఖ్యలో నగరవాసులు, యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఓ వైపు కృష్ణా తీరం, మరోవైపు కుర్రకారు డ్యాన్సులతో విజయవాడలో సందడి వాతావరణం నెలకొంది. జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలంగా ఆనందంగా ఆరోగ్యంగా జీవించేందుకు ముఖ్యమంత్రి ఆలోచన మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



పాక్ జనాభా 20.7 కోట్లు

రెండు దశాబ్దాల్లో 57 శాతం పెరుగుదల

ఇస్లామాబాద్: పాకిస్థాన్ జనాభా గత 19 సంవత్సరాలలో 57 శాతం మేరకు (7.5 కోట్లు) పెరిగింది. పాక్ జనగణన2017 ప్రకారం తాజా జనాభా వివరాలను పాకిస్థాన్ వెల్లడించింది. 1998 లెక్కల ప్రకారం 13.2 కోట్లున్న జనాభా ఇప్పుడు తాజాగా 20.7 కోట్లకు చేరింది. ఈ జనాభాలో పురుషులు 10.6 కోట్లు, మహిళలు 10.1 కోట్లు, లింగమార్పిడి చేయించుకున్న వారు 10418 మంది ఉన్నారు. పాకిస్థాన్ ప్రధాని నేతృత్వంలోని నలుగురు మంత్రులతో కూడిన రాజ్యాంగ సంస్థ(సిసిఐ) ఈ తాత్కాలిక జనగణన వివరాలను ఆమోదించిందని సమాచారం. ఇందులో గిల్గిత్ బాల్టిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ వివరాలు చేర్చలేదు. అయితే తుది నివేదికను వాటిని కూడా కలిపి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

90 మంది రోహింగ్యాలను పంపేసిన బంగ్లాదేశ్

కాక్స్‌బజార్(బంగ్లాదేశ్): దేశం వదిలి పారిపోతున్న రోహింగ్యా ప్రజలపై సరిహద్దులో మయన్మార్ బలగాలు కాల్పులు జరిపిన కొన్ని గంటలలోనే 90 రోహింగ్యా కాందిశీకులను నిర్బంధించి బలవంతంగా వెనక్కి పంపేసినట్లు బంగ్లాదేశ్ పోలీసులు ఆదివారం తెలిపారు. సరిహద్దు దాటిన రోహింగ్యాలన పోలీసులు నిర్బంధించారు. బంగ్లాదేశ్ కుటుపలాంగ్ కాందిశీకుల శిబిరానికి చేరుకోడానికి ఇంకా నాలుగు కిలోమీటర్ల దూరంలోనే వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఇప్పటికే కాందిశీకుల శిబిరంలో వేలాది రోహింగ్యాలు ఉన్నారని పోలీస్ చీఫ్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. వారిని తిరి మయన్మార్‌లోకే బలవంతంగా పంపించేశారు. మయన్మార్‌కు తిప్పి పంపొద్దని వారు ఎంతగా వేడుకున్నా పంపేశారు. బంగ్లాదేశ్ ఇప్పటికే 4 లక్షల రోహింగ్యా కాందిశీకులకు ఆశ్రయం ఇస్తోంది.




ముద్రగడ 'ఛలో అమరావతి'

- పాదయాత్ర ప్రారంభించిన కాపు నేత



కిర్లంపూడి : ఛలో అమరావతి పేరిట పాదయాత్ర చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న కాపు నేత ముద్రగడ పద్మనాభం ఎట్టకేలకు గడప దాటారు. భారీ మద్దతుదారుల నడుమ పోలీసుల నిర్బంధాన్ని బేఖాతరు చేస్తూ ఆయన ఆదివారం పాదయాత్ర ప్రారంభించారు. తన నివాసం నుంచి బయలుదేరి రాజుపాలెం మీదుగా పాదయాత్ర కొనసాగిస్తున్నారు. కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ గత కొన్నిరోజులుగా పాదయాత్ర చేసేందుకు ముద్రగడ చేస్తున్న ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ముద్రగడను పోలీసులు మొదట అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు సర్కారుపై నిప్పులు చెరిగారు. కాపు ఉద్యమంపై చంద్రబాబు ఎందుకు ఉక్కుపాదం మోపుతున్నారని నిలదీశారు. అనంతరం కొద్దిసేపటికే ముద్రగడకు మద్దతుగా పెద్దయెత్తున కాపు నేతలు, అనుచరులు తరలివచ్చారు. దీంతో పోలీసులను తోసేసి.. వారి నిర్బంధాన్ని దాటుకొని మరీ ఇంటి నుంచి ముద్రగడ పాదయాత్రకు బయలుదేరారు. ముద్రగడ వెంట భారీగా మద్దతుదారులు ఉండటంతో పోలీసులు కూడా చేతులు ఎత్తేశారు. దీంతో ముద్రగడ 'ఛలో క్లిరంపూడి'కి పిలుపునిచ్చారు. తన మద్దతుదారులంతా కిర్లంపూడి రావాలని, అక్కడి నుంచి 'ఛలో అమరావతి' పాదయాత్ర చేపడుదామని ముద్రగడ తన అనుచరులకు సూచించారు. భారీ మద్దతుదారుల నడుమ ఆయన పాదయాత్రగా రాజుపాలెం చేరుకున్నారు.


దొడ్డిదారిన విదేశీ సంస్థలకు చంద్రబాబు ధారాదత్తం : ఐవైఆర్ కృష్ణారావు



మన తెలంగాణ/హైదరాబాద్/సోమజిగూడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పేరిట దొడ్డిదారిన విదేశీ సంస్థలకు పనులను ధారాదత్తం చేస్తున్నారని ఎపి మాజీ ఛీఫ్ సెక్రెటరీ ఐవైఆర్ కృష్ణారావు ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తాను చంద్రబాబుకు రాసిన 19 పేజీల లేఖను మీడియా ముందు ప్రదర్శించారు. జీఓ 179 ద్వారా సింగపూర్ కంపెనీలైన అసెండెస్, సింగ్‌బ్రిడ్జ్, సెంబ్ కార్ప్ కంపెనీలకు అక్రమంగా పనులను కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ జిఒను రద్దు చేసి ఓపెన్ క్యాటగిరిలో పనులను పిలవాలని డిమాండ్ చేశారు. స్విస్ చాలెంజ్ విధానం సరైంది కాదని వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని ఎపి ప్రభుత్వానికి ఆయన సూచించారు. సింగపూర్‌లో కేవలం అంతర్గత పరిపాలనను మాత్రమే నిజాయితీని పాటిస్తారని, విదేశాల్లో చేసే వ్యవహారాల్లో తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న నల్లధనాన్ని తెల్లధనంగా చేసుకొని వెనక్కు తీసుకురావడానికి సింగపూర్ హబ్‌గా మారిందని అన్నారు. లిక్వన్‌యూ మోడల్ మీదనే అనేక ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజాప్రయోజనాలకు విరుద్దంగా ఎపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. సాంకేతిక కమిటీని పారదర్శకంగా వేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి చట్టాన్ని విదేశీ కంపెనీలకు అనుకూలంగా సవరణ చేశారని అన్నారు. ఇంత తొందర పడి అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు..?, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు రాకుండానే పనులు మొదలు పెట్టడం ఏపీ ప్రభుత్వం చేసిన తప్పుగా పేర్కొన్నారు. తీర్పు ఒక వేళ వ్యతిరేకంగా వస్తే రాజధానిని మార్చుతారా అని అన్నారు. స్విస్‌చాలెంజ్‌ను అమలు చేయవద్దని కేంద్రం ఇప్పటికే చెప్పినప్పటికీ ఎపి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇంటర్‌నేషనల్ బిడ్డింగ్ విధానం ద్వారానే రాజధాని కట్టాలని ఆయన సూచించారు.


సైనా, సింధులకు రాష్ట్రపతి అభినందన

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన తెలుగుతేజాలు సైనా నెహ్వాల్, పి.వి.సింధులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభినందించారు. అసాధారణ ఆటతో వీరిద్దరూ భారత ఖ్యాతిని ఇనుమడింప చేశారని ప్రశంసించారు. ఫైనల్లో సింధు పోరాట పటిమ తనను ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. చివరి వరకు సింధు విజయం కోసం తీవ్రంగా పోరాడడం ఆకట్టుకుందన్నారు. మరోవైపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా బ్యాడ్మింటన్ స్టార్‌లను అభినందించారు. అంతేగాక తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖర్ రావులు కూడా సైనా, సింధులను అభినందించారు. ఇద్దరు అద్భుత ఆటతో వీరు దేశ పేరును నలుమూలలా చాటారని ప్రశంసించారు. ఇదిలావుండగా, ఫైనల్లో సింధు అసాధారణ పోరాట పటిమపై అభిమానులు సైతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపించారు.



ఎదురులేని మేవెదర్


- బిగ్ బిలియన్ ఫైట్‌లో మెక్‌గ్రెగర్‌పై గెలుపు
- విజేతకు రూ.1,280 కోట్లు, రన్నరప్‌కు రూ.400 కోట్లు



లాస్‌వెగాస్: ప్రపంచంలోనే రెండో అత్యంత ఖరీదైన పోటీగా పేరొందిన బిగ్ బిలియన్ ప్రొఫెషనల్ బాక్సింగ్ ఫైట్‌లో దిగ్గజ బాక్సర్ ఫ్లాయిడ్ మేవెదర్(అమెరికా) విజయం సాధించాడు. ప్రపంచ క్రీడా చరిత్రలోనే అతి పెద్ద బిలియన్ ఫైట్‌గా పేరొందిన ఈ సమరంలో 40 ఏళ్ల మేవెదర్ ప్రత్యర్థి బాక్సర్ కానర్ మెక్‌గ్రెగర్ (ఐర్లాండ్)ను మట్టి కరిపించాడు. ఈ ఫైట్ ఖరీదు 1700 కోట్ల రూపాయలు కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా జరిగే వ్యక్తిగత క్రీడల్లో మరే క్రీడా పోటీలో ఇంత పెద్ద భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ ఉండదు. ఈ పోటీలో విజేతగా నిలిచిన మేవెదర్‌కు రూ.1,280 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ఓటమి పాలైన మెక్‌గ్రెగర్‌కు కూడా రూ. 400 కోట్ల నజరానా దక్కింది. కాగా, ఈ విజయంతో మేవెదర్ మరో అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలో ఒక్క ఓటమి ఎదుర్కొకుండానే 50 మ్యాచ్‌లు గెలిచిన బాక్సర్‌గా చరిత్ర సృష్టించాడు. మెక్‌గ్రెగర్‌పై సాధించిన గెలుపు మేవెదర్ ఖాతాలో 50వ విజయం కావడం గమనార్హం. రెండేళ్ల క్రితం పకియావ్‌తో మ్యాచ్ అనంతరం మేవెదర్ బాక్సింగ్‌కు వీడ్కోలు పలికాడు. కానీ, ఇటీవల మళ్లీ మనసు మార్చుకున్నాడు. తాజాగా మెక్‌గ్రెగర్‌తో బిలియన్ బిగ్ ఫైట్‌కు సిద్ధమయ్యాడు. ఈసారి కూడా మేవెదర్‌నే విజయం వరించింది. లాస్‌వెగాస్‌లోని టి మొబైల్ ఎరీనాలో జరిగిన ఈ మెగా ఫైట్‌ను తిలకించేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మేవెదర్–మెక్‌గ్రెగర్‌ల మధ్య పోరు ఆసక్తి కరంగా సాగింది. ఇద్దరు కూడా సర్వం ఒడ్డి పోరాడారు. మెక్‌గ్రెగర్ అద్భుత పంచ్‌లతో మేవెదర్‌కు గట్టి పోటీనే ఇచ్చాడు. చివరి వరకు విజయం కోసం పోరాడాడు. అయితే అపార అనుభవం కలిగిన దిగ్గజ బాక్సర్ మేవెదర్ తన అజేయ రికార్డును కొనసాగిస్తూ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

శ్రమించక తప్పలేదు..

ఈ పోటీలో విజయం కోసం తాను తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. మెక్‌గ్రెగర్ అనుకున్న దానికంటే మెరుగైన ప్రదర్శనే ఇచ్చాడు. దీంతో తాను ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించక తప్పలేదు. తాను ప్రత్యర్థి నుంచి ఇంతటి ప్రతిఘటన ఉం టుందని ఊహించలేదు. మెక్‌గ్రెగర్ అసాధారణ ఆటతో చె లరేగి పోయాడు. అతన్ని నిలువరిం చేందుకు తాను సర్వం ఒడ్డాల్సి వచ్చింది. అయితే చివరికి తనకే విజయం వరించడం చాలా ఆనందం కలిగించింది. ఈ గెలుపు తనలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అభిప్రాయ పడ్డాడు.



\- మేవెదర్



సింధుకు రజతం

- ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగుతేజం
- సైనాకు కాంస్యం, ప్రపంచ బ్యాడ్మింటన్

గ్లాస్గో: భారత స్టార్, తెలుగుతేజం పూసర్ల వెంకట సింధు ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజతం సాధించింది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో నాలుగో సీడ్ సింధు జపాన్ క్రీడాకారిణి నొజోమి ఒకుహర చేతిలో పోరాడి ఓడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఏడో సీడ్ ఒకుహర 21–19, 20–22, 22–20 తేడాతో సింధును ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. మరోవైపు విజయం వాకిట వరకు వచ్చిన భారత స్టార్ సింధు త్రుటిలో చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చుకుంది. ఒక దశలో చివరి సెట్‌లో 19–17 తేడాతో ఆధిక్యంలో ఉన్న సింధు ఒత్తిడికి గురై మ్యాచ్‌ను చేజార్చుకుంది. మరోవైపు ఒకుహర ఒత్తిడిలోనూ నిబ్బరంగా ఆడి విజయాన్ని అందుకుంది.

ప్రారంభం నుంచే..

ఫైనల్ సమరం అనుకున్నట్టే హోరాహోరీగా సాగింది. తొలి గేమ్ నుంచే ఇద్దరు సర్వం ఒడ్డారు. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. సింధు, ఒకుహర ప్రతి పాయింట్ కోసం నువ్వానేనా అన్నట్టు పోరాడారు. క్వార్టర్ ఫైనల్లో సైనాపై చెమటోడ్చిన ఒకుహర ఫైనల్లో కూడా సింధు నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. ఇద్దరు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగారు. చూడచక్కని షాట్లతో చెలరేగిన వీరిద్దరూ అభిమానులను కనువిందు చేశారు. ఇద్దరూ కూడా ఏ దశలోనూ పట్టుసడలకుండా ఆడారు. దీంతో ప్రతి పాయింట్ కోసం హోరాహోరీ తప్పలేదు. ఇద్దరూ చెలరేగడంతో ఆధిపత్యం తరచూ చేతులు మారుతూ వచ్చింది. తొలి గేమ్‌లో కీలక సమయంలో సింధు ఒత్తిడికి గురైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ఒకుహర 21–19 తేడాతో సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక, రెండో గేమ్‌లో కూడా ఇద్దరూ సర్వం ఒడ్డారు. ఈ గేమ్ కూడా యుద్ధాన్ని తలపించింది. ఇద్దరూ వరుసగా పాయింట్లు సాధించుకుంటూ లక్ష్యం దిశగా సాగారు. ప్రారంభంలో సింధు పైచేయి సాధించింది. అయితే ఒకుహర కూడా ఒత్తిడిని తట్టుకుని ముందుకు సాగింది. దీంతో ఈ సెట్‌లో కూడా పోరు నువ్వానేనా అన్నట్టు కొనసాగింది. చివరికి సింధు 22–20 తేడాతో సెట్‌ను గెలుచుకుంది. దీంతో స్కోరు 1–1తో సమమైంది. మరోవైపు ఫలితాన్ని తేల్చే కీలకమైన మూడో సెట్‌లో పోరు మరింత రసవత్తరంగా సాగింది. పారంభం నుంచే ఇద్దరు ప్రతి పాయింట్ కోసం చెమటోడ్చారు. ఫలితం తరచూ చేతులు మారుతూ వచ్చింది. ప్రత్యర్థి ఒకుహరతో పోల్చితే సింధుకు మంచి ఛాన్స్ కనిపించింది. అయితే కీలక సమయంలో సింధు ఒత్తిడిని తట్టుకోవడంలో విఫలమైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమైన ఒకుహర మళ్లీ పుంజుకుంది. మరోవైపు టైటిల్ దిశగా సాగుతున్న సింధు ఒక్కసారిగా ఒత్తిడికి గురైంది. కీలక సమయంలో గాడి తప్పింది. ఈ సందర్భంగా తప్పిదాలకు పాల్పడి ప్రత్యర్థిని కోలుకునేలా చేసింది. ఇక, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఒకుహర కీలకమైన మూడు పాయింట్లు సాధించి విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు టైటిల్స్ సాధించే అవకాశాలను సింధు చేజేతులా చేజార్చుకుంది. కాగా, ఈ పోటీల్లో భారత్‌కు చెందిన సైనా నెహ్వాల్ కాంస్య పతకాన్ని సాధించిన విషయం తెలిసిందే. సెమీస్‌లో ఒకుహర చేతిలో ఓడిన సైనాకు కాంస్యం దక్కింది.

మనోజ్, కవీందర్ శుభారంభం


హంబర్గ్: జర్మనీలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు మనోజ్ కుమార్, కవిందర్ బిస్త్‌లు శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన 69 కిలోల విభాగం తొలి రౌండ్‌లో మనోజ్ కుమార్ అద్భుత ఆటతో మొల్దొవన్ వాసిలి బెలోస్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన మనోజ్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. చివరి వరకు ఆధిపత్యాన్ని కాపాడుకున్న మనోజ్ ముందంజ వేశాడు. మరోవైపు 52 కిలోల ఫ్లయ్ వెయిట్ విభాగంలో కవిందర్ చెమటోడ్చి విజయం సాధించాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో కవిందర్ జపాన్ బాక్సర్ ర్యాసి బాబాను ఓడించాడు.



మరో భారత బాక్సర్ సతీష్ కుమార్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. 91 కిలోల విభాగంలో బరిలోకి దిగిన సతీష్ అజర్ బైజాన్ బాక్సర్ మహ్మద్ రసూల్ మజిదోవ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

బెంగాల్, ఢిల్లీ జట్ల గెలుపు

ముంబయి: ప్రొ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్, దబాంగ్ ఢిల్లీ జట్లు విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో బెంగాల్ 32–26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ప్రారంభం నుంచే బెంగాల్ దూకుడైన ఆటను కనబరిచింది. సుర్జీత్ సింగ్, జంగ్ కూన్‌లి తమ మార్క్ ఆటతో బెంగాల్‌ను ఆదుకున్నారు. వీరికి తోడు రాన్ సింగ్, భూపెందర్‌లు కూడా మూడేసి పాయింట్లు సాధించారు. దీంతో బెంగాల్ విజయం సాధించింది. బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్, గుర్విందర్ సింగ్ ఏడేసి పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది. మిగతావారు విఫలం కావడంతో బెంగళూరుకు ఓటమి తప్పలేదు. ఇక, ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 33–32 పాయింట్ల తేడాతో యూ ముంబాను ఓడించింది. చివరి వరకు నువ్వానేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో రెండు జట్లు సర్వం ఒడ్డి పోరాడాయి. చివరి దశలో ఢిల్లీ కీలకమైన పాయింట్ సాధించి జయకేతనం ఎగుర వేసింది. ముంబా జట్టులో అనూప్ కుమార్ 11 పాయింట్లు సాధించాడు. ఢిల్లీ జట్టులో మేరాజ్ 11, అబుల్ ఫజల్ 8 పాయింట్లు సాధించి జట్టును గెలిపించారు.



శాఫ్ ఫుట్‌బాల్ విజేత భారత్

ఖాట్మాండు: శాఫ్ అండర్–15 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత బాలుర జట్టు 2–1 గోల్స్ తేడాతో ఆతిథ్య నేపాల్‌ను ఓడించింది. రెండు జట్లు కూడా విజయం కోసం తీవ్రంగా శ్రమించాయి. భారత్ దూకుడైన ఆటతో పైచేయి సాధించేందుకు ప్రయత్నించింది. అయితే నేపాల్ కూడా దూకుడైన ఆటతో భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇదే క్రమంలో 40వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి 1–0 ఆధిక్యాన్ని సాధించింది. తర్వాత భారత్ స్కోరును సమం చేసేందుకు సర్వం ఒడ్డింది. అయితే నేపాల్ గోల్ కీపర్ భారత దాడులను సమర్థంగా తిప్పి కొట్టాడు. కానీ, పట్టువదల కుండా పోరాడిన భారత్ 58వ నిమిషంలో తొలి గోల్‌ను నమోదు చేసింది. లలొరికామా అద్భుత గోల్‌తో స్కోరును సమం చేశాడు. తర్వాత భారత్ దూకుడును మరింత పెంచింది. 74వ నిమిషంలో కెప్టెన్ విక్రమ్ జట్టుకు రెండో గోల్‌ను అందించాడు. ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న టోఫీని సొంతం చేసుకుంది.



భారత్‌కు వన్డే సిరీస్

- రోహిత్ అజేయ శతకం.. రాణించిన ధోనీ
- చెలరేగిన బుమ్రా
- టీమిండియా హ్యాట్రిక్ విజయం

పల్లెకెలె: శ్రీలంకతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రోహిత్ శర్మ 124 (నాటౌట్), మహేంద్ర సింగ్ ధోనీ 67 (నాటౌట్) రాణించడంతో భారత్ 218 పరుగుల లక్ష్యాన్ని మరో 29 బంతులు మిగిలివుండగానే ఛేదించింది. ఈ గెలుపుతో భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు వన్డేలు మిగిలివుండగానే 3–0తో కైవసం చేసుకుంది. అంతకుముందు స్పీడ్‌స్టర్ జస్‌ప్రిత్ బుమ్రా (5/27) అద్భుత బౌలింగ్‌తో చెలరేగడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 217 పరుగులు మాత్రమే చేసింది. ఒక దశలో మూడు వికెట్ల నష్టానికి 138 పరుగులతో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక బుమ్రా ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది.

ప్రారంభంలోనే షాక్..

ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. భీకర ఫాంలో ఉన్న ఓపెనర్ శిఖర్ ధావన్ ఐదు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి (3) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. లోకేష్ రాహుల్ (17), కేదార్ జాదవ్ (0)లు కూడా నిరాశ పరిచారు. దీంతో భారత్ 61 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది.



మహితో కలిసి రోహిత్..

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యత రోహిత్ శర్మ, సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీలు తమపై వేసుకున్నారు. ఇద్దరు లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. కిందటి వన్డేలో భువనేశ్వర్ కుమార్‌తో కలిసి భారత్‌ను గెలిపించిన ధోనీ ఈసారి రోహిత్‌తో కలిసి ముందుకు సాగాడు. ఇద్దరు సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. భారీ షాట్ల జోలికి పోకుండా సింగిల్స్‌తో స్ట్రయిక్‌ను రోటేట్ చేశారు. ధోనీ రక్షణాత్మక బ్యాటింగ్‌ను కనబరచగా, రోహిత్ ధాటిగా ఆడాడు. వీరిని ఔట్ చేసేందుకు లంక బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇద్దరు కుదురుగా ఆడడంతో భారత్ మళ్లీ కోలుకుంది. ఈ క్రమంలో స్కోరును 34 ఓవర్లలోనే 154 పరుగులు దాటించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ శర్మ 118 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీని పూర్తి చేశాడు. రోహిత్‌కు ఇది వన్డేల్లో 12వ సెంచరీ కావడం విశేషం. మరోవైపు ధోనీ కూడా 4 ఫోర్లతో అర్ధ సెంచరీని అందుకున్నాడు. అయితే భారత్ లక్ష్యానికి 8 పరుగుల దూరంలో ఉన్నప్పుడు అభిమానులు మైదానంలోకి బాటిల్స్ విసిరి గొడవ సృష్టించారు. దీంతో కొద్ది సేపు మ్యాచ్‌ను నిలిపి వేయాల్సి వచ్చింది. అయితే భద్రత దళాలు జోక్యం చేసుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. తర్వాత మళ్లీ ఆట ప్రారంభమైంది. ఆ వెంటనే భారత్ మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేసింది. రోహిత్ శర్మ 146 బంతుల్లో 16 ఫోర్లు, సిక్సర్‌తో 124 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ధోనీ 86 బంతుల్లో 4ఫోర్లు, ఒక సిక్స్‌తో 67 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. దీంతో భారత్ 45.1 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

చెలరేగిన బుమ్రా..


అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంకను బుమ్రా హడలెత్తించారు. అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన బుమ్రా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను వణికించాడు. నిప్పులుచెరిగే బంతులతో చెలరేగి పోయాడు. అతని ధాటికి లంక వరుస క్రమంలో వికెట్లను కోల్పోయింది. అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన బుమ్రా 10 ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టడు. శ్రీలంక జట్టులో లహిరు తిరిమన్నే 80 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్ కుశాల్ మెండిస్ (36), సిరివర్దనె (29) తప్ప మిగతావారు విఫలం కావడంతో లంక స్కోరు 217 పరుగులకే పరిమితమైంది.



బంగ్లాదేశ్ పైచేయి..!

- ఆస్ట్రేలియాతో తొలి టెస్టు

ఢాకా: ఆస్ట్రేలియాతో ఆదివారం ప్రారంభమైన మొదటి టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ పైచేయి సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 260 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 18 పరుగులు మాత్రమే చేసి కష్టాల్లో చిక్కుకుంది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (8), వన్‌డౌన్‌లో వచ్చిన ఉస్మాన్ ఖ్వాజా (1), నైట్ వాచ్‌మన్ నాథన్ లియాన్ (0) వెంటవెంటనే పెవిలియన్ చేరడంతో ఆస్ట్రేలియా ఇబ్బందుల్లో చిక్కుకుంది. మెహది హసన్, సాకిబ్ అల్ హసన్ తలో వికెట్ పడగొట్టారు. ఉస్మాన్ ఖ్వాజా రనౌటయ్యాడు. మరోవైపు తొలుగ బ్యాటింగ్ చేసిన బంగ్లా78.5 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది.



ఆదుకున్న తమీమ్, సాకిబ్

మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్‌కు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ కమిన్స్ హడలెత్తించాడు. అద్భుత బంతులతో చెలరేగిన కమిన్స్ వరుస క్రమంలో వికెట్లు తీస్తూ బంగ్లాను ఇబ్బందుల్లోకి నెట్టాడు. కమిన్స్ ధాటికి సౌమ్య సర్కార్ (8), ఇమ్రూల్ కైస్ (0), షబ్బీర్ రహ్మాన్ (0) ప్రారంభంలోనే పెవిలియన్ చేరారు. దీంతో బంగ్లాదేశ్ 10 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను సీనియర్లు సాకిబ్ అల్ హసన్, తమీమ్ ఇక్బాల్ తమపై వేసుకున్నారు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే బౌండరీలు కొడుతూ ఒత్తిడి దరి చేరకుండా చూశారు. వీరిని ఔట్ చేసేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తమీమ్, సాకిబ్ సమన్వయంతో ఆడడంతో బంగ్లాదేశ్ మళ్లీ కోలుకుంది. ఓపెనర్ తమీమ్ 5ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 71 పరుగులు చేసి మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ క్రమంలో నాలుగో వికెట్‌కు సాకిబ్‌తో కలిసి 155 పరుగులు జోడించాడు. మరోవైపు సాకిబ్ 11 ఫోర్లతో 84 పరుగులు చేసి లియాన్ చేతికి చిక్కాడు. తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయారు. దీంతో బంగ్లా ఇన్నింగ్స్ 260 పరుగుల వద్దే ముగిసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, లియాన్, అస్టన్ అగర్ మూడేసి వికెట్లు పడగొట్టారు. మాక్స్‌వెల్‌కు ఒక వికెట్ లభించింది. కాగా, బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆస్ట్రేలియా మరో 242 పరుగులు చేయాలి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.